PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 152 | విజయవాడ, శుక్రవారం 3 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 3 January 2025 | Rs



జీవాంజి దీప్తి

జ్యోతి యర్రాజి

తెలుగు తేజాలు జ్యోతి, దీప్తిలకు 'అర్జున' పురస్కారాలు

- నలుగురికి 'ఖేల్ రత్న'
- 17న రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రదానం

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం 2024 ఏడాదికి ప్రకటించిన అవార్డుల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన జ్యోతి యర్రాజి, పారా అథ్లెట్ జీవాంజి దీప్తిలకు చోటు దక్కింది. ప్రతిష్టాత్మక మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు ఈసారి నలుగురు ఎంపిక కాగా.. అర్జున అవార్డుకు ఎంపికైన 32 మంది అథ్లెట్ల జాబితాలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంకు చెందిన జ్యోతి యర్రాజి, వరంగల్ జిల్లాకు చెందిన పారా అథ్లెట్ జీవాంజి దీప్తి ఉన్నారు. అర్జున అవార్డుకు ఎంపికైన 32 మందిలో 17మంది పారా అథ్లెట్లు. 2014నుంచి అథ్లెటిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న జ్యోతి.. 2019లో తొలిసారి జాతీయ అండర్-18 మహిళల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం కైవసం చేసుకొని అందరిదృష్టిని ఆకర్షించింది. 2022 ఆసియా క్రీడల్లో 100మీ. హర్డిల్స్‌లో రజత పతకం సాధించి పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. 2024 పారిస్ ఒలింపిక్స్ 100మీ. హర్డిల్స్‌లో భారత్‌నుంచి ప్రాతినిధ్యం వహించిన ఏకైక మహిళా అథ్లెట్ జ్యోతి యర్రాజి చరిత్ర సృష్టించింది.

పారిస్ పారా ఒలింపిక్స్‌లో మహిళల 400మీ. 20 విభాగంలో దీప్తి కాంస్యం సాధించింది. 55.82 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని ఈ ఫీట్ సాధించింది. ఇక ఖేల్‌రత్న అవార్డుకు మను భాకర్(షూటింగ్), గుకేశ్(చెస్), ప్రవీణ్ కుమార్(పారా అథ్లెటిక్స్), హర్మన్‌ప్రీత్ సింగ్(హాకీ) ఎంపికయ్యారు. జనవరి 17న రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో ద్రౌపది ముర్ము చేతుల మీదుగా వీరంతా అవార్డులు అందుకోనున్నారు.

'సమాలోచన'సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

కార్పొరేట్ల కోసమే 'విజన్'

రాష్ట్ర ప్రజలను భ్రమల్లో ముంచుతున్నారు

- స్వర్ణాంధ్ర@ 2047 సమాలోచనలో వి.శ్రీనివాసరావు
- ఇదో కనికట్టు లాంటిది
- సహజ వనరులను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాయితీల పేరుతో కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయలను దోచిపెట్టడానికే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ 2047 అంటున్నారని సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047'పై గురువారం ఉదయం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో సమాలోచన కార్యక్రమం జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ, సిపిఎం నాయకులు కె.ప్రభాకరరెడ్డి, సిహెచ్.నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్ 2047 పేరుతో చంద్రబాబునాయుడు ప్రజలను భ్రమల్లో ముంచి మబ్బుల్లోకి తీసుకెళుతున్నారని విమర్శించారు. అదే సమయంలో సహజ వనరులన్నీ కార్పొరేట్ల చేతుల్లో పెడుతున్నారని, రాయితీల పేరుతో వేల కోట్ల రూపాయలు దోచిపెడతారని విమర్శించారు. గతంలో అట్లహాసంగా చెప్పిన విజన్ 2020పై ఇంతవరకు సమీక్ష లేదని, మరోసారి 2047 విజన్ల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. వీటివల్ల రాష్ట్ర ప్రజలకు ప్రయోజనాలు ఏమీ ఉండటం లేదని చెప్పారు. గతంలో తీసుకువచ్చిన విజన్ 2020 విఫలమైందని, విజన్ పూర్తయ్యే నాటికి రాష్ట్ర జిడిపి సగటున సంవత్సరానికి 10 శాతానికి తీసుకెళతామని చెప్పారని, వాస్తవంగా సాధించింది 5.2 శాతం మాత్రమేనని చెప్పారు. ఆర్థిక అంతరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పేర్కొన్న విజన్లో పేదరికం లేని సమాజం, ఉపాధి, నైపుణ్యం, నీటి వనరులు, ఆధునిక వ్యవసాయం, రవాణా, లాజిస్టిక్స్, తక్కువ ఖర్చుతో విద్యుత్, ఆధునిక పద్ధతుల్లో ఉత్పత్తి, స్వచ్ఛాంధ్ర అనే అంశాలను ప్రస్తావించారని తెలిపారు. రాష్ట్రంలో విజన్ 2020 ప్రకటించిన తరువాత 20 ఏళ్లలో పది సంవత్సరాలు చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఇప్పటి వరకూ ఎందుకు చేయలేకపోయారని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని, కొత్తగా పిపిపి స్థానంలో పి4 తీసుకొచ్చారని విమర్శించారు. ఇక ముందు అన్నిట్లోనూ ప్రజల భాగస్వామ్యం పేరుతో ప్రజల ఉమ్మడి ఆస్తులను దోచుకోవడానికి పక్కా ప్రణాళిక రూపొందిస్తున్నారని వివరించారు. 2047 నాటికి పూర్తిస్థాయి అభివృద్ధి చెందిన దేశంగా చేస్తామని చెబుతున్నారని 20 ఏళ్లలో ఒక్క అడుగు కూడా ముందుకుపడలేదని, రాబోయే 23 ఏళ్లలో ఏం సాధిస్తారని ప్రశ్నించారు.గత దశాబ్ధ కాలంలో నిజ వేతనాలు కూడా 0.4 శాతం తగ్గాయని, ప్రజల ఆదాయాలూ తగ్గుతున్నాయని వివరించారు. అక్రమాలకు కేంద్రంగా పాలన సాగుతోందని, ఆదానీ కుంభకోణంలో ఇప్పటి వరకూ సెకీ నివేదికలు తెప్పించుకోలేదని విమర్శించారు. అమెరికా న్యాయ విభాగం కేసు నమోదు చేసినా ప్రధానిలో చలనం లేదని, అటువంటి వ్యక్తుల పాలనలో దేశం ఏమి అభివృద్ధి చెందుతుందని ఆయన ప్రశ్నించారు.

నెల క్రితం ఒక అంశాన్ని అధ్యయనం చేస్తున్నామని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు చేతులెత్తేశారని విమర్శించారు. ప్రజలపై విద్యుత్ భారాలు మోపిన జగన్‌ను విమర్శించినందువల్ల ప్రయోజనం లేదని, చార్జీలు తగ్గించాలని, సెకీ ఒప్పందాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మెగా డిఎస్‌సి కింద ఉద్యోగాలు ఇస్తామని మొదటి సంతకం చేశారని, ఇప్పటి వరకూ దానికి అతీగతి లేదని, ఇప్పుడు విజన్ పేరుతో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెబుతూ నిరుద్యోగ యువతను మభ్యపెడుతున్నారని అన్నారు. ఉపాధి కల్పించే విశాఖ ఉక్కు లాంటి సంస్థలను అమ్మేస్తున్నారని, ప్రైవేటు రంగంలో మిట్టల్ స్టీలును తీసుకొస్తున్నారని మిగతా 7లో

ఎక్కడ కోరుకుంటే అక్కడే!

- రిలయన్స్‌కు భూకేటాయింపులు
- కార్పొరేట్లకు 'మెగా' ప్యాకేజీలు
- మంత్రిమండలి నిర్ణయాలు

మంత్రివర్గ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్న రిలయన్స్ సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ కోరుకుంటే అక్కడ భూములు కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. 'ఎంత భూమి అవసరమైతే అంత భూమిని, ఎక్కడ కోరుకుంటే అక్కడ' రిలయన్స్ సంస్థకు కేటాయించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. ఈ సంస్థకు రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల ఎకరాల భూములు కేటాయించాలని ఇటీవల జరిగిన ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు సమావేశంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రతిపాదన కేబినెట్ ముందుకు వచ్చింది. దీనిపైన చర్చించిన మంత్రిమండలి ఆ ప్రతిపాదనను ఆమోదించడంతోపాటు ఎక్కడ కోరుకుంటే అక్కడ, ఎంత అవసరమైతే అంత భూమిని రిలయన్స్‌కు ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ భూములైతే ఎకరాకు రూ.15 వేలు, రైతుల వద్ద నుంచి నేరుగా తీసుకుంటే ఎకరాకు రూ.30 వేలు వంతున 15 సంవత్సరాల కాలపరిమితితో లీజుకు ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఏర్పాటయ్యే ఇతర పరిశ్రమలకు కూడా ప్రాధాన్యత ప్రాతిపదికన భూములు కేటాయించాలని నిర్ణయించారు. కేబినెట్ సమావేశ నిర్ణయాలను మీడియాకు వివరించిన రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి రిలయన్స్ ఇండస్ట్రీస్ రాష్ట్రప్రభుత్వంతో 12.11.24న ఎంఓయు చేసుకుందని తెలిపారు.

45 రోజుల్లో తమకు కావాల్సిన భూముల వివరాలు తెలిపితే అడ్వాన్స్ పొజీషన్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి సమావేశంలో మెగా ప్రాజెక్టులకు ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీని అందజేయడానికి చేసిన ప్రతిపాదనలను కూడా కేబినెట్ ఆమోదించినట్లు మంత్రి చెప్పారు. నెల్లూరు జిల్లా రామాయపట్నంపోర్టు సమీపంలో ఏర్పాటుకానున్న గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ, పెట్రో కెమికల్ కాంప్లెక్స్ నిర్మాణాలకు ప్రత్యేక ప్రోత్సాహకాల ప్యాకేజీకి ఆమోదంతోపాటు ఆరు వేల ఎకరాల భూమి కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి చెప్పారు. బస్సుల బాడీ బిల్డింగ్ చేసే ఆజాద్ ఇండియా మొబిలిటీ లిమిటెడ్ రూ.1046 వేలకోట్లతో సత్యసాయిజిల్లాలో ఒక యూనిట్‌ను మూడు దశల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సంస్థకు 70.7 ఎకరాల భూమిని కేటాయిస్తున్నట్లు వివరించారు. దక్షిణ భారతదేశంలో తొలిసారిగా సోలార్ విండ్ బ్యాటరీ స్టోరేజ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టును రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు క్లీన్ రిన్యూవబుల్ ఎనర్జీ హైబ్రిడ్ త్రీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకు వచ్చినట్టు మంత్రి చెప్పారు. నంద్యాల, వైఎస్ఆర్ జిల్లాల్లో ఈ ప్రాజెక్టు అమలులోకి రానున్నట్లు తెలిపారు.

అమరావతిలో 2,732 కోట్లతో ఇంజినీరింగ్ పనులు

అమరావతిలో రూ.2,732 కోట్లతో రెండు ఇంజనీరింగ్ పనులు చేపట్టడానికి మంత్రి మండలి ఆమోదించింది. వరల్డ్ బ్యాంక్, హడ్కో, జర్మన్ ఫైనాన్సియల్ అసిస్టెన్స్‌తో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. తిరుపతిలోని ఇఎస్ఐ ఆసుపత్రిని 50 పడకల నుంచి 100 పడకలకు రూ.7,44,08,373 అంచనా వ్యయంతో అప్‌గ్రేడేషన్ చేయడానికి మంత్రిమండలి ఆమోదించింది.

మరికొన్నినిర్ణయాలు ...

- కర్నూలు జిల్లా పత్తికొండ మండలం హోసూరు, పెద్దహులిటి గ్రామాల్లో టాటా పవర్ రెన్యూవబుల్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ ద్వారా 400 మెగావాట్ల సోలార్ ఇందన సామర్థ్యాన్ని మిగతా 7లో

మృతుడు దారావత్తు చంద్రశేఖర్

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలో విషాదం

- పరుగుపందెంలో యువకుడి మృతి

3

తెలుగు పరిరక్షణకు మీరే సైన్యం

పుస్తక మహోత్సవం ప్రారంభ సభలో యువతకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు

జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తక మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

"తెలుగు నేర్చుకోండి, తెలుగు భాషను పరిరక్షించే సైన్యంగా మారండి' అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. తెలుగును నిర్లక్ష్యం చేయొద్దని హితవు పలికారు. విజయవాడలోని ఇందిరా గాంధీ పురపాలక స్టేడియంలో గురువారం ఆయన 35వ విజయవాడ పుస్తక మహోత్సవాన్ని ప్రారంభించారు. చెరుకూరి రామోజీరావు సాహిత్య వేదికపై జరిగిన ప్రారంభ సభలో పవన్ కల్యాణ్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఇంగ్లీషు చదువులు అవసరమేనని, అయితే పేదరికం పారద్రోలడానికి అది మార్గం కాదని అన్నారు. అందరూ ఇంగ్లీషు మాట్లాడే ఇంగ్లాండులో కూడా పేదరికం ఉందని ఆయన గుర్తు చేశారు. సినిమా నటులు, ప్రముఖులనే కాకుండా రచయితలను, చదువుకున్న వారిని గౌరవించడం, వారి మాటలు వినడం నేర్చుకోవాలని సూచించారు. పుస్తక పఠనమే అభివృద్ధికి మార్గమన్నారు. తాను చదువును మధ్యలోనే ఆపినా, పుస్తకాలు చదవడం ఆపలేదని తెలిపారు. పుస్తకం జీవితంతోనూ, సమాజంలో అన్యాయాలతోనూ పోరాడే ధైర్యాన్నిస్తుందన్నారు. యువతీయువకులు కూడా పుస్తకాలు చదవడం మానొద్దని సూచించారు. అభిమానులకు తాను ప్రాణమైతే, తనకు పుస్తకాలు ప్రాణమని తెలిపారు. లక్షలాది మంది హృదయాలను ఆకట్టుకునే శక్తి తనకు పుస్తకాల వల్లనే వచ్చిందన్నారు. తన అభిమానులంతా తెలుగు భాషను పరిరక్షించే సైనికులు కావాలని పిలుపునిచ్చారు. వారు కూడా పుస్తకాలు చదివి, సమాజంలోని అన్యాయంపై పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ప్రధాని పివి.నరసింహారావు సాహిత్య జీవితానికి సంబంధించి ఎ.కృష్ణారావు రాసిన పుస్తకాన్ని పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులు, విజయవాడ ఫెస్టివల్ సొసైటీ సభ్యులు ఎమెస్కో విజయకుమార్ అధ్యక్షత వహించి మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యా శాఖ నుండి మార్పు చేసి సాంస్కృతిక శాఖ పరిధిలోకి తీసుకోవాలని కోరారు. ఈనాడు దినపత్రిక సంపాదకులు ఎం.నాగేశ్వరరావు, రామోజీరావు స్మారక ఉపన్యాసాన్ని చేస్తూ, అక్షరాన్ని, పుస్తకాన్ని ప్రేమించిన వ్యక్తుల్లో మిగతా 7లో

కక్ష కట్టిన కేంద్రం

- రైతు సంఘాల విమర్శ
- కేంద్రం తీరుపై సుప్రీం ప్రశ్నల వర్షం
- నోటీసులు జారీ

శంభూ రైల్వేస్టేషన్ వద్ద గురువారం రైతుల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తమ ఆందోళన ఎంతకాలం కొనసాగుతుందనేది కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ఆధారపడి ఉంటుందని సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్) స్పష్టం చేసింది. రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ నిరవధిక నిరాహార దీక్ష గురువారం 38వ రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతుల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టారని రైతు నేత అభిమన్యు కోహర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ సమస్యలను నెరవేరిస్తే, ఆందోళన నిలిపివేస్తామని అన్నారు. పార్లమెంటరీ ప్యానెల్ ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని సిఫార్సు చేసినా ఇంకా ఎందుకు తటపటాయిస్తున్నారు? రైతులతో ఎందుకు చర్చించడటం లేదు అంటూ సుప్రీంకోర్టు కేంద్రాన్ని సూటిగా ప్రశ్నించింది. రాజ్యాంగ సంస్థలను ఎల్లప్పుడూ గౌరవిస్తామని అన్నారు. దల్లేవాల్ ఆరోగ్యం విషమంగా ఉందని, కొన్ని నిమిషాల పాటు స్పృహ తప్పి పడిపోయారని, అయినప్పటికీ ఉన్నత న్యాయస్థానంలో విచారణకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కనెక్ట్ అవ్వడానికి ముందుకొచ్చారని తెలిపారు. "ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని పార్లమెంటరీ ప్యానెల్ కూడా సిఫార్సు చేసింది. దానిని అమలు చేయాలని సుప్రీంకోర్టు కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని మాత్రమే మేము చెప్పాం" అని ఆయన అన్నారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతున్నామని అన్నారు. ఈ నెల 4న ఖనౌరీలో రైతుల దర్శనం పేరుతో భారీ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ సభలో దల్లేవాల్ ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తారని కోహర్ తెలిపారు. ఎస్‌కెఎం, కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో ఉన్న రైతులు ఢిల్లీకి చేపట్టే మార్చ్‌ను భద్రతా దళాలు అడ్డుకున్న తరువాత, పంజాబ్, హర్యానా మధ్య శంభు, ఖనౌరీ సరిహద్దు పాయింట్ల వద్ద క్యాంప్ చేస్తున్నారు.

దల్లేవాల్ దీక్షను భగ్నం చేయాలని ఎప్పుడూ ఆదేశించలేదు : సుప్రీం కోర్టు

సుప్రీంకోర్టు గురువారం పంజాబ్ ప్రభుత్వాన్ని నిలదీసింది. దల్లేవాల్ నిరాహార దీక్షను భగ్నం చేయడానికి ప్రయత్నిస్తున్నామని పంజాబ్ అధికారులు, కొంతమంది రైతు నాయకులు మీడియాలో తప్పుడు అభిప్రాయాన్ని ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. దల్లేవాల్ నిరసనను విచ్ఛిన్నం చేయమని కోర్టు ఎప్పుడూ ఆదేశించలేదని, ఆయన ఆరోగ్యం గురించి మిగతా 7లో

ఇద్దరు సైబర్ నేరగాళ్ల అరెస్ట్

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాల్లో రూ.10 కోట్ల మేర సైబర్ నేరాలకు పాల్పడిన రాజస్థాన్‌కు చెందిన ఇద్దరిని బాపట్ల జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుండి కొంత నగదు స్వాధీనం చేసుకున్నారు. వారి బ్యాంకు ఖాతాల్లోని కొంతనగదును ఫ్రీజ్ చేయించారు. బాపట్ల జిల్లా ఎస్‌పి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి తుషార్ డూడి ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం... బాపట్ల జిల్లా చుండూరు పోలీస్ స్టేషన్ పరిధి వేటపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ గొంధి శ్రీలక్ష్మీ వరప్రసాదరావుకు సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తాము సిబిఐ ఆఫీసర్లమని, చెప్పుకున్నారు. శ్రీలక్ష్మీ వరప్రసాదరావుపై మనీ లాండరింగ్ కేసు నమోదైందని, డిజిటల్ అరెస్టు చేస్తున్నామని వారు బెదిరించారు. ఈ కేసు నుండి బయట పడాలంటే డబ్బులు ఖర్చవుతాయన్నారు. బెదిరించి రూ.74 లక్షలను మోసపూరితంగా తమ బ్యాంకు ఖాతా నుంచి తీసుకున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు గత డిసెంబరు మూడున చుండూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసు అధికారులు జిల్లా టెక్నికల్ బృందం ద్వారా బ్యాంకు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి సైబర్ నేరగాళ్ల ఖాతాలోని రూ.17.90 లక్షల నగదును ఫ్రీజ్ చేయించారు. మిగతా నగదు ఐదు బ్యాంకు ఖాతాలకు, వాటి నుండి వేర్వేరు ఖాతాలకు బదిలీ జరిగినట్లు గుర్తించారు. నిందితులు రాజస్థాన్, ముంబయిలలో ఉన్నట్లు గుర్తించారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు బాపట్ల ఐటి కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలోని టెక్నికల్ బృందం ఇచ్చిన సమాచారం మేరకు చుండూరు సిఐ నేతృత్వంలో ఒక బృందాన్ని రాజస్థాన్ రాష్ట్రానికి, ఆర్ఐ శ్రీకాంత్ నేతృత్వంలో మరొక బృందాన్ని ముంబయికి పంపించారు. రాజస్థాన్ వెళ్లిన బృందం నిందితుల్లో ఒకరైన రమేష్‌ను పట్టుకుని అతని నుంచి రూ.2 లక్షలు, మరో నిందితుడు శ్రావణ్‌కుమార్‌ను పట్టుకొని అతని నుంచి రూ.5 లక్షలు రికవరీ చేసింది. వీరిద్దరూ సుమారు రూ.50 లక్షల మేర మోసం చేసినట్లు గుర్తించారు. నిందితుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ 17.90 లక్షల నగదు స్తంభింపజేశారు.

వీరిద్దరి బ్యాంకు ఖాతాలను తనిఖీ చేయగా వారు దేశంలోని మన రాష్ట్రంతోపాటు, కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, వెస్ట్ బెంగాల్, గుజరాత్, తెలంగాణ, రాజస్థాన్‌లోని 12 పోలీస్ స్టేషన్ల పరిధిలో 13 సైబర్ నేరాలకు పాల్పడినట్లు గుర్తించారు. సైబర్ నేరాలకు పాల్పడిన నిందితుల ఐదు బ్యాంక్ ఖాతాలను పరిశీలించగా 18 రాష్ట్రాల్లోని 39 జిల్లాల్లో 43 పోలీస్ స్టేషన్ల పరిధిలో వారిపై ఫిర్యాదులు ఉన్నట్లు, సుమారు రూ.10 కోట్ల మేర మోసం చేసినట్లు, అ ఖాతాల ద్వారా సుమారు రూ 12.30 కోట్ల మేర నగదు బదిలీలు జరిగినట్లు వెల్లడైంది. రెండో బృందం మహారాష్ట్రలో సైబర్ నేరగాళ్ల కోసం గాలిస్తోందని ఎస్‌పి తెలిపారు.

వైసిపి నేత గౌతమ్ రెడ్డికి ఊరట

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైసిపి నేత గౌతమ్ రెడ్డికి అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. హత్యాయత్నం కేసులో రాష్ట్ర హైకోర్టు బెయిల్ నిరాకరిస్తూ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ గౌతమ్‌రెడ్డి వేసిన పిటిషన్‌ను గురువారం న్యాయమూర్తులు జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ మహదేవన్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. తదుపరి విచారణ వరకు ఎలాంటి తీవ్రమైన చర్యలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వానికి, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేసింది. వారం రోజుల్లో ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. గౌతమ్ రెడ్డిపై టిడిపి ప్రభుత్వం అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు చేసిందని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే, న్యాయవాది అల్లంకి రమేష్ వాదనలు వినిపించారు. ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం కెవియట్ ఎలా దాఖలు చేస్తుందని, ఫిర్యాదుదారు కాకుండా, ప్రభుత్వమే ఎందుకు యాక్టివ్‌గా ఉందని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అనంతరం కేసు విచారణ వాయిదా వేసింది.

జలవనరులశాఖకు సిఎం కితాబు

- రిజర్వాయర్లలో 75 శాతం నీరు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 85 శాతం రిజర్వాయర్లలో 75 శాతం నీరు నిల్వ ఉందని, వర్షాల సమయంలో వచ్చిన నీటిని ఒడిసి పట్టామని, దీనివెనుక మంత్రి నిమ్మల రామానాయుడు, అధికారులు చేసిన కృషి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కితాబిచ్చారు. కేబినెట్ సమావేశం అనంతరం మంత్రితో ప్రత్యేకంగా మాట్లాడారు. మంత్రులు పట్టుదలతో కృషి చేస్తే ఇలాంటి ఫలితాలు ఉంటాయనే దానికి జలవనరులశాఖ నిదర్శమని పేర్కొన్నారు. గతంలో ఈ సమయంలో రిజర్వాయర్లలో నీరు లేదని, సమిష్టి కృషి, ప్లానింగు వల్లే అది సాధ్యమైందని సిఎం పేర్కొన్నారు.

రూ.1,616 కోట్లతో పనులు

- రాజధాని అమరావతిలో కొనసాగుతున్న టెండర్ల ప్రక్రియ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి నగరంలో అభివృద్ధి పనులకు అవసరమైన టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. బుధవారం రూ.2,677 కోట్ల విలువైన పనులకు టెండర్లు పిలిచిన ప్రభుత్వం గురువారం మరో రూ.1,661 కోట్ల విలువైన పనులు చేపట్టనుంది. 31వ తేదీ నుండి వరుసగా మూడు రోజులపాటు టెండర్లను పిలిచిన సిఆర్‌డిఎ మరో రెండు రోజులపాటు వీటిని కొనసాగించనున్నట్లు తెలిసింది.

కొత్తగా పిలిచిన టెండర్లలో ఎల్‌పిఎస్ జోన్ 2ఎలో అనంతవరం, నెక్కల్లు, తుళ్లూరు పరిధిలో సదుపాయాల కల్పనకు రూ.542.84 కోట్లు, 2బిలో రూ.542.84 కోట్లు వెచ్చించనున్నట్లు పేర్కొంది. జోన్-6 పరిధిలోని కొండమరాజుపాలెం, రాయపూడి పరిధిలో అభివృద్ధి పనులకు రూ.530.83 కోట్లు వెచ్చించనుంది. మొత్తం 13 జోన్లలో ఇప్పటి వరకూ ఐదు జోన్లకు టెండర్లు పిలిచారు. మిగిలిన వాటికి కూడా ఒకటి రెండురోజుల్లో పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఇవి కాకుండా కరకట్ట విస్తరణ, గ్రీనరీ, వరద ముంపు నివారణ చర్యలు వంటి పనులు చేపట్టాల్సి ఉంది.

5 వరకు లా, ఎడ్‌సెట్ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

లాసెట్-2024, ఎడ్‌సెట్-2024 స్పాట్ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ గడువును ఉన్నత విద్యామండలి పొడిగించింది. ఈ నెల 5వ తేదీ వరకు స్పాట్ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్లు అప్‌లోడ్ చేసే అవకాశం కల్పిస్తున్నట్లు మండలి కార్యదర్శి టివి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ లా, బిఇడి కళాశాలల వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు.

శ్రీవారి ఆలయంపై విమానం చక్కర్లు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారి ఆలయం పై నుంచి గురువారం ఉదయం పది గంటలకు ఓ విమానం చక్కర్లు కొట్టింది. 'నో ఫ్లై జోన్' ఏరియాగా తిరుమల ఉన్నప్పటికీ తరుచూ విమానాలు చక్కలు కొడుతూనే ఉన్నాయి. ఈ విషయంపై టిటిడి యాజమాన్యం పట్టించుకోవడం లేదని ఆగమ శాస్త్ర సాంప్రదాయ నిర్వాహకులు మండిపడుతున్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

వచ్చే విద్యాసంవత్సరం నుండి తల్లికి వందనం

- మోడీ పర్యటన కోసం కూటమి పార్టీలతో కమిటీ
- రెవిన్యూ సమస్యల పరిష్కారానికి కేబినెట్ సబ్ కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న విద్యాసంవత్సరం నుండి 'తల్లికి వందనం' పథకం అమలు చేయడానికి సన్నాహాలు చేయాలని రాష్ట్ర మంత్రులకు ముఖ్యమంత్రి సూచించినట్లు తెలిసింది. సచివాలయంలో గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశం నుండి అధికారులు వెళ్లిన అనంతరం నూతన సంవత్సరంలో అమలు చేయాల్సిన పథకాల గురించి మంత్రులతో సిఎం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకానికి ఎంతో ప్రాధాన్యత ఉందని చెప్పినట్లు తెలిసింది. మత్స్యకారులకు ఏప్రిల్ నుంచి గతంలో ఇస్తున్న రూ.10వేల స్థానంలో రూ.20వేలు చెల్లించే అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం,. రైతులకు కేంద్రం పిఎం కిసాన్‌కు నిధులు విడుదల చేసినప్పుడు అన్నదాత సుఖీభవ అమలు చేయాలనే అభిప్రాయానికి మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వచ్చే అకడమిక్ సంవత్సరంలో మెగా డిఎస్‌సి నిర్వహించడంతో పాటు నియామకాలు చేపట్టాలని కూడా మంత్రి వర్గంలో నిర్ణయం తీసుకున్నారు. విశాఖపట్టణంలో ఈనెల 8న జరగనున్న ప్రధాని మోడీ పర్యటనను విజయవంతం చేసేందుకు కూటమి పార్టీల నేతలతో పొలిటికల్ కమిటీ వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని పర్యటన విజయవంతం చేయడంతో పాటు సనసమీకరణ చేయడం ఈ కమిటీ లక్ష్యమని సమాచారం. పర్యటనలో భాగంగా మోడీ జరపనున్న రోడ్‌షోలో తనతో పాటు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొంటారని ఈ సమావేశంలో సిఎం చెప్పినట్లు సమాచారం. రోడ్‌షో విశాఖ సిద్ధి వినాయక ఆలయం నుంచి ఆంధ్ర యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్ వరకు నిర్వహించనున్నారు. అదే విధంగా రెవిన్యూ,జలనవరులు, ఆర్థిక ఇబ్బందులపై మంత్రివర్గంలో సుదీర్ఘచర్చ జరిగినట్లు తెలిసింది. రెవిన్యూ సదస్సుల్లో ఇప్పటి వరకు లక్ష అర్జీలు రాగా అందులో అత్యధికంగా 22ఎ, భూముల రీసర్వే, రికార్డులల్లో తప్పులు లాంటి అంశాలకు సంబంధించిన అర్జీలు ఉన్నట్లు అధికారులు నివేదించిన అంశంపై కూడా చర్చించి, రెవిన్యూ సమస్యల పరిష్కారం కోసం మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు రెవిన్యూ, ఫైనాన్స్, పరిశ్రమలు, మునిసిపల్ శాఖ మంత్రులతో ఉప సంఘం ఏర్పాటు కానుంది.

మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

'బనకచర్ల'పై సిఎం పవర్‌ఫాయింట్ ప్రజంటేషన్

గోదావరి-బనకచర్ల అనుసంధానంపై మంత్రులకు అర్థమయ్యేందుకు వీలుగా సిఎం చంద్రబాబునాయుడు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. కొత్త ప్రాజెక్టు ఎలా నిర్మించాలి? నిధుల సమీకరణ ఎలా అనే అంశాలపై మంత్రి వర్గ సమావేశంలో చర్చ జరిగింది. వెనుకబడిన ప్రాంతాల ప్రయోజనాల కింద నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని సిఎం మంత్రులకు వివరించారు. కుప్పం, చిత్తూరుకు అదనంగా నీరు ఇచ్చేందుకు చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, యోగి వేమన నుంచి హంద్రీనీవా లింక్ ద్వారా వచ్చే అంశాన్ని పరిశీలించాలని నిర్ణయించారు.

పట్టిసీమవల్ల రాయలసీమకు ప్రత్యక్షంగా,పరోక్షంగా జరిగిన లబ్ధిని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశంలో వివరించారు.

బకాయిలపై పవన్‌కల్యాణ్ ఆరా..

రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులపై ఆర్థికశాఖ మంత్రులకు ఓ ప్రజంటేషన్ ఇచ్చినట్లు సమాచారం. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలు అమలు చేసి తీరుతామని సిఎం చంద్రబాబునాయుడు స్పష్టం చేసినట్లు తెలిసింది. బకాయిలు ఎన్ని ఉన్నాయని డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఆరా తీశారు, రూ.1.30 లక్షల కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపినట్లు సమాచారం.

నేరాల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం
నూతన ఎఎస్‌పిలు, డిఎస్‌పిలతో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నేరాల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శిక్షణ పూర్తి చేసేందుకు విధుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్న ఎఎస్‌పిలు, డిఎస్‌పిలు గురువారం నాడు చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లూ రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా దెబ్బతిన్నాయని, మళ్లీ వాటిని గాడిలో పెట్టాలని వారికి దిశానిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా వారి వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. గతంలో రౌడీలు, రాజకీయ పార్టీల్లోకి వచ్చినా పార్టీలు మద్దతు తెలిపేవి కావని, నేడు నేరస్తులే రాజకీయ ముసుగు వేసుకున్నారని పేర్కొన్నారు.

గత ఐదేళ్లలో కొందరు కళంకిత పోలీసుల అధికారులు కూడా ఇష్టారీతన వ్యవహరించి వ్యవస్థకు చెడ్డపేరు తెచ్చారని చెప్పారు. పోలీసులను రాజకీయ నేతలపై కక్షసాధింపు కోసం గత ప్రభుత్వం వాడుకుందని వివరించారు. రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ హబ్‌గా మార్చేశారని, ఇక్కడ నుండి అన్నిచోట్లకు పంపిణీ జరిగేదని పేర్కొన్నారు. కొత్తగా విధుల్లో చేరేవారందరూ నిర్వహణలో రాజీపడొద్దని, గంజాయి రవాణా, బెల్టుషాపుల నిర్వహణ, ఇసుక అక్రమ తరలింపులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

సైబర్ నేరాలు ఆపాలి

సైబర్ నేరగాళ్లు కూడా రానున్న రోజుల్లో సవాల్‌గా మారతారని, వారికంటే మెరుగ్గా ఆలోచించినప్పుడే నేరాలను అరికట్టగలమని సిఎం చెప్పారు. నేరస్తులకు ఎక్కడా అవకాశం ఇవ్వొద్దని, శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే రాష్ట్రానికి పెట్టుబడులు, తద్వారా ఉద్యోగాలు వస్తాయని తెలిపారు.

తన అంచనాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానం ఉండాలని, గతంలో పోలీసులకు టెక్నాలజీ అందుబాటులోకి తెచ్చామని, బాడీ ఓన్, సిసి కెమెరాలనూ ఏర్పాటు చేశామని తెలిపారు. దీనివల్ల నేరస్తులను గుర్తించడంతో నేరాల సంఖ్య తగ్గిందని, ఐదేళ్లు వాటిని నిర్వీర్యం చేశారని పేర్కొన్నారు. మహిళలు, చిన్నారులపై కొందరు మానవత్వం మరిచి అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించొద్దని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా కట్టడి చేయాలని కోరారు.

తల్లికి వందనంపై చేతులెత్తేయడం దుర్మార్గం

- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తల్లికి వందనం పథకం ఈ విద్యా సంవత్సరం అమలు చేయలేమని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ ఖండించింది. ఈ పథకం అమలు చేయకుండా చేతులెత్తేయడం దుర్మార్గమని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఆశలతో ప్రజలు టిడిపి కూటమికి అధికారం ఇచ్చారని, ప్రభుత్వ నిర్ణయం మాత్రం వారికి నిరాశ మిగిల్చిందన్నారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అంతమందికి తల్లికి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు ప్రభుత్వం ప్రకటనతో 45 లక్షల మంది తల్లులు, 83 లక్షల మంది విద్యార్థులు నష్టపోతారని తెలిపారు. వారి కుటుంబాలపై ఆర్థికభారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ఏమవుతుందో గత ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును మరవొద్దని హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని మార్చుకుని తల్లికి వందనం పథకాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, తల్లిదండ్రులను కలుపుకుని ఆందోళనబాట పడతామని హెచ్చరించారు.

టిడిపి కార్యకర్తలకు యునైటెడ్ బీమా

- కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్న లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్యకర్తలకు ప్రమాద బీమా కల్పనకు యునైటెడ్ బీమా కంపెనీతో టిడిపి ఒప్పందం కుదుర్చుకుంది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి లోకేష్ ఉండవల్లిలోని తన నివాసంలో బీమా కంపెనీ ప్రతినిధులతో కలిసి గురువారం ఎంఒయుపై సంతకాలు చేశారు. బీమా కోసం తొలి విడతలో రూ.42 కోట్లు కంపెనీకి పార్టీ చెల్లించింది. ఒప్పందం ప్రకారం ఈ ఏడాది మొత్తం కార్యకర్తలకు బీమా అందుతుంది. వచ్చే ఏడాది కూడా దాదాపు ఇదే మొత్తంలో ప్రీమియం సొమ్మును పార్టీనే చెల్లిస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్యకర్తలకు రూ.5 లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. ఇప్పటికే సుమారు 94 లక్షల మంది సభ్యత్వం తీసుకున్నారని, మరికొద్ది రోజుల్లో కోటికి చేరుకుంటుందని పార్టీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కార్యకర్తల సంక్షేమనిధి సారథిగా లోకేష్ బాధ్యతలు చేపట్టాక కేడర్ సంక్షేమమే లక్ష్యంగా విప్లవాత్మక నిర్ణయాలు తీసుకున్నారని పార్టీ తెలిపింది. కార్యకర్తల సంక్షేమానికి ఇప్పటి వరకు రూ.138 కోట్లు ఖర్చు చేశారని, వివిధ ప్రమాదాల్లో దెబ్బతిన్న కార్యకర్తలను ఆదుకునేందుకు కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారని వెల్లడించింది. మృతిచెందిన కార్యకర్తల పిల్లల కోసం హైదరాబాద్‌తోపాటు కృష్ణా జిల్లా చల్లపల్లిలో ఎన్‌టిఆర్ ట్రస్ట్ తరపున రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుచేసి ఉచితంగా విద్యనందిస్తున్నారని పేర్కొంది.

హైడ్రోపవర్ ప్లాంట్లను అడ్డుకుంటాం : సిపిఎం

ప్రజాశక్తి-దేవరాపల్లి (అనకాపల్లి జిల్లా)

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం చింతలపూడి, నగరంపాలెం ప్రాంతాల్లో అదాని కంపెనీకి చెందిన హైడ్రో పవర్ ప్లాంట్లను గిరిజనులతో కలిసి అడ్డుకుంటామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాదం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న తెలిపారు. చింతలపూడి ప్రాంతంలో అదాని కంపెనీ తలపెట్టిన హైడ్రోపవర్ ప్లాంటు ప్రాంతాన్ని గురువారం గిరిజనులతో కలిసి వారు పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. అదాని హైడ్రోపవర్ ప్లాంట్లకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే ప్రత్యక్ష ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు హైడ్రోపవర్ ప్లాంట్లను నిర్మించి గిరిజనులను ముంచుతారా? అని ప్రశ్నించారు. ఈ ప్రాంతంలో హైడ్రోపవర్ ప్లాంట్లు పెట్టొద్దని గత కొంతకాలంగా గిరిజనులు అందోళన చేస్తుంటే, మరో పక్కన అనుమతులివ్వడానికి రహస్యంగా ఎలా సర్వే చేస్తారని ప్రశ్నించారు. నగరంపాలెం గ్రామానికి జల్ జీవన్ మిషన్ కింద పైప్‌లైన్ వేస్తుంటే ఫారెస్టు అధికారులు అడ్డుకున్నారని, ఇప్పుడు అటవీ ప్రాంతాన్ని అదానికి ఎలా కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. రైవాడ, కోనాం ప్రాజెక్టులపై అదాని కన్ను పడిందని, ఈ రెండు ప్రాజెక్టులు అదాని పరమైతే గిరిజనుల బతుకులు బుగ్గి పాలవుతాయని, ఆయకట్టు భూములు ఎడారిగా మారతాయని తెలిపారు. సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ప్రజా ప్రతినిధులు రాజకీయాలకతీతంగా రైతులను చైతన్యం చేసి పోరాటానికి సిద్ధం చేయాలని కోరారు.

చింతలపూడిలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న లోకనాథం

విశాఖ 'ఉక్కు' పరిరక్షణకు ఎలాంటి పోరాటానికైనా సిద్ధం : సిఐటియు

ప్రజాశక్తి -ఉక్కునగరం (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఎలాంటి పోరాటానికైనా వెనుకాడబోమని సిఐటియు నాయకులు వెంకటరావు, డిసిహెచ్ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిరసిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1421వ రోజుకు చేరాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాలకు చెందిన సిఐటియు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ.. ప్రపంచమంతా నూతన సంవత్సర వేడుకలు చేసుకుంటే స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కుటుంబ సభ్యుల్లో ఆనందం లేకుండా పోయిందన్నారు. వేతనాలు చెల్లించకుండా స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం దుర్మార్గమన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వ ఉద్యోగికీరాని దారుణ పరిస్థితి విశాఖ ఉక్కు ఉద్యోగులకు వచ్చిందన్నారు. సుమారు నాలుగు నెలలుగా వేతనాలు లేకపోవడంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పస్తులు ఉండాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కాలంటే స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడమే మార్గమన్నారు. దీనికోసం కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు.

డబుల్ డెక్కర్ మెట్రో
2017 పాలసీ ప్రకారం ఫండింగ్

- విజయవాడ, విశాఖ మెట్రోపై సిఎం సమీక్ష
- కేంద్రంతో చర్చలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ, విశాఖ నగరాల్లో డబుల్ డెక్కర్ పద్ధతిలో మెట్రో నిర్మించనున్నట్లు, దీనికోసం ఫండింగ్ కోసం కేంద్రంతో చర్చించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. వెలగపూడి సచివాలయంలో మెట్రో ప్రాజెక్టులపై సిఎం గురువారం సమీక్ష నిర్వహించారు. దీనికి మంత్రులు నారాయణ, బిసి జనార్ధనరెడ్డి తదితరులు హాజరయ్యారు. మెట్రో ఎమ్‌డి రామకృష్ణారెడ్డి ప్రాజెక్టు స్థితిగతులను వివరించారు. 2017లో వచ్చిన కొత్త మెట్రో పాలసీ ప్రకారం రాష్ట్రంలో చేపట్టే ప్రాజెక్టులకు ఫండింగ్ మోడల్స్‌పై వారితో సిఎం చర్చించారు. 2017 వరకు 100 శాతం నిధులు కేంద్రం భరించే విధానం లేదని, అయితే 2017 పాలసీ ప్రకారం 100 శాతం ఈక్విటీ కేంద్రమే చెల్లిస్తూ కోల్‌కతాలో 16 కిలోమీటర్ల మేర రూ.8,565 కోట్లతో ప్రాజెక్టు చేపట్టారని అధికారులు వివరించారు. ఇదే తరహాలో ఎపిలోనూ మెట్రో ప్రాజెక్టు చేపట్టే అంశంపై కేంద్రంతో చర్చించాలని సిఎం నిర్ణయించారు. ఎపి పునర్విభజన చట్టంలోనూ రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు ఉందని సిఎం అన్నారు. ఆ చట్టం ప్రకారమైనా, లేకపోతే 2017 మెట్రో పాలసీ ద్వారానైనా కేంద్రం సాయం చేసేలా చేస్తామని చెప్పారు. దీనిపై కేంద్రంతో సంప్రదింపులు జరుపుతామని అన్నారు. విజయవాడ, విశాఖలో చేపట్టే మెట్రో ప్రాజెక్టుల్లో డబుల్ డెక్కర్ విధానం అమలు చేయబోతున్నట్లు సిఎం తెలిపారు. దీనిలో రోడ్డు పైన ఫ్లైఓవర్, దానిపైన మెట్రో కారిడార్ వస్తుందన్నారు. విశాఖలో మొదటిదశలో చేపట్టే మధురవాడ నుండి తాటిచెట్లపాలెం వరకూ 15 కిలోమీటర్లు, గాజువాక నుండి విశాఖ స్టీల్ ప్లాంటు వరకూ నాలుగు కిలోమీటర్లు మెట్రో నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే విజయవాడలో రామవరప్పాడు నుండి నిడమనూరు వరకూ 4.7 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ విధానంలో మెట్రో చేపడతామని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ తరహా మోడళ్లు పలు నగరాల్లో ఉన్నాయని, ఇక్కడ అమలు చేయొచ్చని తెలిపారు. కేంద్రంతో త్వరితగతిన సంప్రదింపులు పూర్తి చేసి పనులు ప్రారంభమయ్యేలా చూడాలని సిఎం ఆదేశించారు. నాలుగేళ్లలో రెండు నగరాల్లో అందుబాటులోకి వచ్చేలా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనిచేయాలన్నారు.

వినతులు స్వీకరిస్తున్న రంజన్ మిశ్రా

ఉపకులాల వారీగా సమగ్రమైన వివరాలివ్వాలి

- ఎస్‌సి వర్గీకరణ ఏకసభ్య కమిషన్ సభ్యులు రాజీవ్ రంజన్ మిశ్రా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

షెడ్యూల్ కులాల్లోని ఉప కులాల వారీగా సమగ్రమైన వివరాలను ఇవ్వాలని అధికారులను ఎస్‌సి వర్గీకరణ ఏకసభ్య కమిషన్ సభ్యులు రాజీవ్ రంజన్ మిశ్రా ఆదేశించారు. షెడ్యూల్ కులాల్లోని ఉప వర్గీకరణ అంశానికి సంబంధించి గురువారం కర్నూలు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఈ అంశంపై వ్యక్తులు, వివిధ సంఘాల వారు ఇచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా రాజీవ్ రంజన్ మిశ్రా మాట్లాడుతూ.. ఉప కులాల వారీగా ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా సమగ్రమైన వివరాలను సేకరించి వాటి ఆధారంగా ఏకసభ్య కమిషన్ సిఫార్సులు చేస్తోందని తెలిపారు. ఉప కులాల వారీగా కీలకమైన రంగలైన ఉపాధి, విద్యకు సంబంధించిన ప్రాతినిధ్యంతో పాటు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య అంశాలకు సంబంధించిన వివరాలను అన్ని ప్రభుత్వ శాఖలు సమగ్రంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. డేటాలో కచ్చితత్వం ఉండాలని, ఎలాంటి పొరపాట్లు ఉండకూడదన్నారు. అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధి పొందిన వారి వివరాలను కూడా సమగ్రంగా ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆయా సంఘాలు, వ్యక్తుల నుంచి వచ్చిన దరఖాస్తులను నిర్దేశించిన ప్రొఫార్మాలో పూర్తి వివరాలతో పొందుపరచి, పూర్తి స్థాయి విశ్లేషణతో పంపాలన్నారు. సమావేశంలో కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నేవీ విన్యాసాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ (విశాఖపట్నం)

తూర్పు నావికాదళం శనివారం నిర్వహించ తలపెట్టిన నేవీ డే వేడుకలను పురస్కరించుకొని గురువారం సాయంత్రం బీచ్ రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ వేదికగా నేవీ ఆపరేషన్ డెమో ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా తూర్పు నావికాదళ విభాగాధిపతి కమాండింగ్ ఆఫీసర్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందర్కర్ హాజరై నావికాదళ విన్యాసాలను వీక్షించారు. ఈ రిహార్సల్స్‌లో తూర్పు నావికాదళానికి చెందిన హాక్ యుద్ధ విమానాలు, చేతక్ హెలికాప్టర్లు, యుద్ధనౌకలు, సబ్ మెరైన్లు పాల్గొన్నాయి. హెచ్‌కె.బాంబింగ్, మార్కోస్ డెమో, హీలో ల్యాండింగ్ డెమో, హెచ్‌కె డెమో, ఏంజెల్ డెమో, ఎస్ఎఆర్ డెమో, హార్న్ పైప్ డాన్స్, కంపోసిట్ ఫ్లై పాస్ట్, బీటింగ్ రిట్రీట్, సన్ సెట్ సెర్మనీ, సెర్మోనియల్ సన్ సెట్‌తో పాటు కంటిన్యూటీ డ్రిల్ వంటి విన్యాసాలను ప్రదర్శించారు. విన్యాసాల్లో భాగంగా చివరిలో నౌకలను ప్రకాశవంతం చేస్తూ నిర్వహించిన లేజర్ షో సందర్శకులను ఆకర్షించింది.

విన్యాసాలలో అపశ్రుతి

ఆపరేషన్ డెమోలో స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. ఎనిమిది అడుగుల ఎత్తు నుంచి కిందకు వస్తున్న రెండు పారాచ్యూట్లు గాలి తీవ్రతకు ఒకదానిని ఒకటి చిక్కుకొని నియంత్రణ కోల్పోయాయి. ఈ క్రమంలో ఇద్దరు పారాచ్యూట్ ప్రదర్శనకారులు సముద్రంలో పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన నేవీ సిబ్బంది వారి వద్దకు చేరుకుని సురక్షితంగా ఒడ్డుకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలూ కాలేదని అధికారులు తెలిపారు.

అగర్వాల్ పరిశ్రమలో లావా ఎగచిమ్మి ఒకరు మృతి

- మృతుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - పెళ్లకూరు (తిరుపతి జిల్లా)

ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలోని స్క్రాప్ ఐరన్ క్యాస్టింగ్ బాయిలర్ 1600 డిగ్రీల వేడితో లావా ఎగచిమ్మి కార్మికులపై పడడంతో ఒకరు మృతి చెందారు. ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం పెనుబల్లి పంచాయతీ ఎంఎస్ అగర్వాల్ ఫౌండర్స్ ప్రయివేట్ లిమిటెడ్ యూనిట్ 2లో బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన విదితమే. ఈ ఘటనలో మధ్యప్రదేశ్‌కు చెందిన సిపాయి లాల్ (30) మృతి చెందారు. తీవ్ర గాయపడిన ఐదుగురు చెన్నయ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుని కుటుంబానికి తిరుపతి జిల్లా కలెక్టర్ రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించారు.

గురువారం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పి మునిరాజా, మండల నాయకులు ఎస్ ముకుంద ఈ పరిశ్రమను సందర్శించారు. అనంతరం అంగేరి పుల్లయ్య మీడియాతో మాట్లాడుతూ మృతుని కుటుంబానికి రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గాయాలతో ఉన్న వారికి రూ. 25 లక్షలు ఇవ్వాలని, ఆస్పత్రి ఖర్చులను కంపెనీనే భరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో యాజమాన్యం సురక్షిత నియమాలను పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని తమ పరిశీలనలో తేలిందన్నారు. కలెక్టర్ కార్మిక శాఖ అధికారులు ఈ పరిశ్రమపై నిఘా ఉంచి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పరిశ్రమ నుండి వచ్చే వ్యర్థాలతో చుట్టుపక్కల ఉన్న పేదలు, ఎస్‌టి సామాజిక తరగతికి చెందిన గ్రామాలు మొత్తం కలుషితమై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శి రాధాకృష్ణ, నాగేంద్ర, సుధాకర్ రెడ్డి సిఐటియు స్థానిక నాయకులు కుమార్ పాల్గొన్నారు.

పరిశ్రమను పరిశీలిస్తున్న సిఐటియు నాయకులు

7.5 లక్షల మందికి ఉపాధే లక్ష్యం

- మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 ద్వారా రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 7.5 లక్షల మందికి ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్, జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్‌బాబుతో కలిసి ట్రాన్స్‌కో, జెన్‌కో నూతన డైరీ, కేలండర్లను సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి ఆశయాలకు, ఆకాంక్షలకు అనుగుణంగా అధిక విద్యుదుత్పత్తి కోసం, వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించేందుకు సంస్థలు అహర్నిశలు కృషి చేస్తున్నాయని మంత్రి తెలిపారు. విద్యుత్‌శాఖను సంస్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేసిందని, సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా పయనించేందుకు అనేక కార్యక్రమాలకు నాంది పలకబోతుందని చెప్పారు.

ఇప్పటికే క్లీన్ ఎనర్జీ పాలసీ తీసుకొచ్చామన్నారు. రాబోయే కాలంలో రూ.15,729 కోట్ల విలువైన ప్రాజెక్టులను అమలు చేస్తామన్నారు. ఎగువ సీలేరులో 1,350 మెగావాట్ల సామర్థ్యంతో సొంతంగా పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు (పిఎస్‌పి) నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. దశలవారీ 5 వేల మెగావాట్ల సామర్థ్యంతో ఐదు పిఎస్‌పిలను నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌హెచ్‌పిసితో చేసుకున్న అవగాహన ఒప్పందం విద్యుత్ రంగంలో కీలక ముందడుగు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఎకెవి భాస్కర్, జెన్‌కో డైరెక్టర్లు పి అశోక్ కుమార్ రెడ్డి, పి నవీన్ గౌతమ్, ఎం సుజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలులో నేడు విద్యుత్‌శాఖ సమన్వయ సదస్సు

ట్రాన్స్‌కో రాష్ట్ర స్థాయి సమన్వయ ఫోరం సదస్సు శుక్రవారం కర్నూలులో జరగనుంది. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ ఠాకూర్ రామసింగ్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ట్రాన్స్, జెన్‌కో, డిస్కమ్‌లు, ఎన్‌టిపిసి, సెకి ఉన్నతాధికారులు పాల్గొంటారు. ఎలక్ట్రిసిటీ ప్లాన్ 2024-25, 2028-29 ఆమోదంపై ముఖ్యంగా ఈ సమావేశంలో చర్చించనున్నారు.

4న స్పష్టత ఇవ్వకుంటే ప్రధాని పర్యటనలో నిరసన

- విశాఖ ఉక్కుపై కె.రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగకుండా సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ నెల 4న సిఎం ఢిల్లీలో జరపనున్న ఎపర్యటనలో ఈ అంశంపై స్పష్టమైన ప్రకటన రాకపోతే, 8న ప్రధాని మోడీ నిర్వహించనున్న రాష్ట్ర పర్యటనలో నల్లజెండాలతో నిరసన తెలుపుతాయని ఆయన చెప్పారు. విజయవాడలోని దాసరి భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు విశాఖ ఉక్కు ప్రైవేట్‌పరం కాకుండా చూడాల్సిన బాధ్యత నాటి ముఖ్యమంత్రి జగన్‌దేనంటూ లేఖ రాసిన విషయాన్ని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక విశాఖ స్టీల్ ప్రస్తావనే తేవడం లేదని, మరోవైపు మిట్టల్ స్టీల్ గురించి మాట్లాడుతున్నారని చెప్పారు. సెకీ విద్యుత్ ఒప్పందాల్లో జరిగిన అవినీతిపై అమెరికా ప్రభుత్వనివేదిక కోసం ఎదురు చూస్తున్నామంటూ సిఎం చేసిన ప్రకటన విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలపై భారీ భారం పడుతున్నా సిఎం వ్యాఖ్యలు దురదుష్టకరమన్నారు. కృష్ణా - గోదావరి - పెన్నా నదుల అనుసంధానం కోసం రూ.80 వేల కోట్లు ఖర్చు అవుతుందని, దీన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడతామని చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. సాగునీటి రంగంలో ఈ తరహా నిర్ణయం అత్యంత ప్రమాదకరమైన ఆలోచన అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.దుర్గాభవానీ, ఆ పార్టీ నాయకులు కోటేశ్వరరావు, జాన్సన్‌బాబు పాల్గొన్నారు.

నల్లమలలో ప్రారంభమైన పులుల గణన

ప్రజాశక్తి-శ్రీశైలం ప్రాజెక్టు

నల్లమల అటవీ ప్రాంతంలోని నాగార్జున సాగర్ టైగర్ రిజర్వులో పులుల గణన బుధవారం నుంచి ప్రారంభమైంది. పులులను లెక్కించేందుకు నల్లమల అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. నాగార్జున సాగర్ టైగర్ రిజర్వు పరిధిలోని మార్కాపురం, ఆత్మకూరు, నంద్యాల, గిద్దలూరు డివిజన్లలో ఈ పులుల గణన చేపట్టనున్నారు. ఫిబ్రవరి 15 వరకూ ఈ గణన కొనసాగనుంది. 2023-24 అటవీ శాఖ లెక్కల ప్రకారం నాగార్జున సాగర్ టైగర్ రిజర్వులో 87 పులులు ఉన్నాయి.



2	Palaparthi Ravibabu	Christian
3	Palaparthi Hosanna	Christian
4	Palaparthi Soujanya	Christian
5	Palaparthi Sravani	Christian
6	Palaparthi Charles	Christian
7	Palaparthi Rambabu	Christian
8	Palaparthi Charles	Christian
9	Eepuri Achamma	Christian
10	Eepuri Pavan kumar	Christian
11	Palaparthi Rajesh	Christian
12	Palaparthi Divyateja	Christian
13	Palaparthi Kavitha	Christian
14	Palaparthi Pavani	Christian
15	Palaparthi Veeranjaneyulu	Christian
16	Palaparthi Mariya kumari	Christian
17	Palaparthi Saibabu	Christian
18	Palaparthi Bhavyapriya	Christian
19	Palaparthi Blessisom	Christian
20	Palaparthi Bhanu prakash	Christian
21	Palaparthi Vijayalakshmi	Christian
22	Palaparthi prabhudasu	Christian
23	Palaparthi Sulochana	Christian
24	Palaparthi Raju	Christian
25	Palaparthi Sravanthi babu	Christian
26	Palaparthi Rebkamma	Christian
27	Palaparthi Samuel raju	Christian
28	Palaparrthi Naveena	Christian
29	Palaparthi Vaishnavi	Christian
30	Palaparthi Haritha	Christian
31	Palaparthi Chinna Yesamma	Christian
32	Palaparthi Krishna chaitanya	Christian

తూర్పు తక్కెలపాడు దళిత కాలనీలోని వారి పేర్లకు ఎదురుగా క్రిస్టియన్స్ అని నమోదైన కులగణన పేజీ

తప్పులతడకగా కులగణన

- 'హిందూ'కు బదులు క్రిస్టియన్‌గా నమోదు

ప్రజాశక్తి-పంగులూరు (బాపట్ల జిల్లా)

ఎస్‌సి కులగణనలో తప్పులు చోటు చేసుకున్నట్లు దళితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కులానికి ముందు మతం హిందూ అని ఉండాల్సి ఉండగా, దానికి బదులుగా క్రిస్టియన్ అని వచ్చినట్లు తెలిపారు. బాపట్ల జిల్లా పంగులూరు మండల పరిధిలోని తూర్పు తక్కెళ్ళపాడు దళిత కాలనీలో సుమారు 700 మంది ఉండగా అందులో 45 మంది పేర్లు క్రిస్టియన్ జాబితాలో నమోదైనట్లు దళితులు తెలిపారు. ప్రతి ఒక్కరికి హిందూ అని ఉండగా తమకు మాత్రమే క్రిస్టియన్ అని ఎందుకు ఉందని వారు ప్రశ్నిస్తున్నారు. రామకూరు దళితవాడలో కూడా క్రిస్టియన్ పేరు ఎక్కువ కనిపిస్తోందని చెబుతున్నారు. ఈ విషయమై తూర్పు తక్కెలపాడు విఆర్‌ఒ నూతలపాటి సుధాకర్‌ను ప్రశ్నించగా 2022లో వలంటీర్లు రాసిన జాబితాలో హిందూ బదులుగా కొంతమంది పేర్ల ముందు క్రిస్టియన్ అని రాశారని, అందువల్లనే ఇప్పుడు ఈ జాబితాలో కూడా క్రిస్టియన్ అని వచ్చిందని చెప్పారు. వాటిని సరిచేసేందుకు ఈ పాటికే గ్రీవెన్స్‌లో అప్లై చేశామని, ఆ తప్పులను సరిదిద్దుతామని తెలిపారు.

ఎగరని 'ఫ్లెమింగో'

- 'ఫీడ్' లేక...తగ్గిన సందడి..
- ఏడేళ్లలో 15 వేలపైనే తగ్గిన పక్షులు
- ఆహారం లేక పులికాట్ సరస్సుపై ఆధారం
- నేలపట్టు పండుగపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

విదేశాల నుంచి సంతాన ఉత్పత్తి కోసం రెండు నెలలు సుదూర ప్రాంతం ప్రయాణించి తిరుపతి జిల్లా దొరవారిసత్రం సమీపంలోని నేలపట్టుకు చేరుకుంటాయి ఫ్లెమింగో పక్షులు. అయితే, ఆదరించాల్సిన ప్రభుత్వం వాటి పట్ల గత ఏడేళ్లుగా నిర్లక్ష్యం వహిస్తుండడంతో పక్షుల రాక సంఖ్య తగ్గింది. 2017-18లో దాదాపు 40 వేల వివిధ రకాల పక్షులు నేలపట్టుకు విచ్చేసి సందడి చేసేవి. వాటికి ఆహారం సరిగ్గా లేకపోవడం, అనువైన గూడు ఏర్పాటు చేయకపోవడంతో ఏటా తగ్గుతూ వచ్చాయి. ఈ ఏడాది పక్షుల సంఖ్య 25,275కు తగ్గిపోయింది. దాదాపు 15 వేల పక్షులు తగ్గాయని వైల్డ్‌లైఫ్ అధికారులు తెలిపారు. సెప్టెంబర్‌లో నేలపట్టుకు చేరుకున్న పక్షులు గూళ్లలో గుడ్లు పెట్టి తమ పిల్లల్ని పొదిగించుకుని, కొంత పెద్దయిన తరువాత తిరిగి ఆయా ప్రాంతాలకు వెళ్లిపోవడం ఆనవాయితీ. ప్రభుత్వం చేపపిల్లల్ని సైతం వదలకపోవడంతో పులికాట్ సరస్సుకు వెళ్లి చేపలు, నత్తలు, రొయ్యలు తెచ్చుకొని తమ పిల్లల్ని పోషించుకుంటున్నాయి. ఫ్లెమింగో పండుగ నిర్వహణకు రూ.6 కోట్ల నుంచి రూ.8 కోట్లు ప్రకటించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రతిపాదన పంపించగా ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ రాలేదు. దీంతో ఈ నెల 10 నుంచి మూడు రోజులపాటు జరగాల్సిన ఫ్లెమింగో పండుగను వాయిదా వేస్తున్నట్లు చెప్పినా, ఇంకా తేదీలను ఖరారు చేయకపోవడం గమనార్హం.

నైజీరియా, సైబేరియా, బర్మా, బంగ్లాదేశ్, ఆస్ట్రేలియా, పాకిస్తాన్, కెజికిస్తాన్, నేపాల్, ఖాట్మండ్ తదితర దేశాల నుంచి ఈ వలస పక్షులు తిరుపతి జిల్లా నేలపట్టుకు వస్తుంటాయి. సెప్టెంబర్ నుంచి ఈ ప్రాంతానికి వచ్చి సంతాన ఉత్పత్తి చేసుకుని తిరిగి మార్చి, ఏప్రిల్‌లో తిరిగి వెళుతుంటాయి. ఎనిమిది నెలల పాటు ఆ దేశాల్లో మంచు విపరీతంగా ఉండి నీళ్లు గడ్డ కట్టుకుపోయి ఉండడంతో ఆహారం కోసం మన దేశానికి వలస వస్తాయి. ప్రస్తుతం పెలికాన్లు 16 వేలు, నత్తగుల్ల కొంగలు 5 వేలు, తెల్లకంకనాయులు 1,150, తెడ్డుముక్కు కొంగలు 175, నీటికాకులు 3 వేలు వచ్చి ఉన్నాయి. ఫారెస్టు వైల్డ్‌లైఫ్ అధికారులు పెట్టిన గూళ్ల ప్రకారం వీటిని లెక్కిస్తుంటారు. ఒక గూడులో ఆడ, మగ పక్షులు, నాలుగు పిల్లలు ఉంటాయి. ఈ ప్రకారం లెక్కలు తీస్తుంటారు.

ఏటా నిధుల నిర్లక్ష్యం

సెప్టెంబర్‌లోనే ఫ్లెమింగో పక్షుల ఆహారానికి 2 లక్షల చేప పిల్లలను వదలాలని అధికారులు ప్రతిపాదనలు తయారు చేసినా నిధుల కేటాయింపు లేదు. ఈ పండుగ కోసం మన రాష్ట్రంతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, ఇతర ప్రాంతాల నుంచి ప్రకృతి ప్రేమికులు వస్తుంటారు. తాజాగా జనవరి 1న 16 వేల మంది వచ్చారు. ఈ మూడు రోజుల పండుగకు ఐదు లక్షల మందిపైనే వస్తారని అంచనా.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలో విషాదం

- పరుగు పందెంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా)

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో విషాదం చోటుచేసుకుంది. పరుగు పందెంలో యువకుడి మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు ఆధ్వర్యంలో కృష్ణా జిల్లాలోని జిల్లా పోలీసు మైదానంలో డిసెంబర్ 30వ తేదీ నుండి దేహదారుఢ్య పరీక్షలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన 1600 మీటర్ల పరుగు పందెంలో ఉమ్మడి కృష్ణా జిల్లా ఎ కొండూరు గ్రామానికి చెందిన దారావత్తు చంద్రశేఖర్ (25) పరుగు పందెంలో పాల్గొని నాల్గవ రౌండ్ గమ్యానికి మరికొంత దూరంలో ఉండగా రన్నింగ్ ట్రాక్‌పై పడిపోయారు. వైద్య సిబ్బంది ఆయనకు ప్రథమ చికిత్స అందించి అంబులెన్స్‌లో బందరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మధ్యాహ్నం 2.14 గంటలకు కార్డియాటిక్ అరెస్ట్ (హార్ట్ ఎటాక్)తో మరణించినట్లు వైద్యులు తెలిపారు. ప్రాథమికంగా చేసిన రిపోర్టులలో భాగంగా ఆయనకు గత ఐదు రోజులుగా తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోందన్నారు. తన కాల్ లెటర్‌లో ఉన్న తేదీ ఆధారంగా గురువారం టెస్టులకు హాజరయ్యారు. ఈ ఘటనతో శుభవార్తతో ఇంటికి వస్తాడని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులకు తీరని సోకం మిగిలింది.

అనారోగ్యంతో బాధపడుతున్న వారు చివరి రోజైనా పాల్గొనవచ్చు : ఎస్‌పి

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వారి ఆరోగ్య స్థితిగతులను ఆధారంగా చేసుకుని టెస్టులకు హాజరవ్వాలని జిల్లా ఎస్‌పి ఆర్ గంగాధరరావు సూచించారు. అభ్యర్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఉండాలని, వారికి ఇచ్చిన తేదీన అనారోగ్య కారణంగా పాల్గొనలేకపోతే చివరి రోజు అయిన 20వ తేదీన హాజరయ్యేలా జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో అనుమతి పొందవచ్చన్నారు.

సాగునీటి రంగంలో బిఒటి విధానం వద్దు

- ఎపి రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు అయ్యే వ్యయం రూ.80 వేల కోట్ల భారం రైతులపై వేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని, ఈ ప్రాజెక్టును బిల్ట్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్ (బిఒటి) విధానంలో ప్రైవేటు సంస్థలకు కేటాయించే ఆలోచన విమరించుకోవాలని ఎపి రైతు సంఘం డిమాండ్ చేసింది. ప్రాజెక్టుతో రాయలసీమ కరువు సమస్యను తీరుస్తామని, రాష్ట్ర భవిష్యత్తు మారుస్తామని ప్రకటించిన సిఎం చంద్రబాబు మాటలు 'తెలుగు తల్లికి జలహారతి కాదు, కాంట్రాక్టర్లకు ధనహారతి'గా ఈ విధానం ఉండబో తుందని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి కృష్ణయ్య, కార్యదర్శి కె ప్రభాకర రెడ్డి గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొ న్నారు. బిఒటి విధానం చాలా ముద్దుగా ఉందని, జాతీయ రహదారులు నిర్మించిన సంస్థలు టోల్ గేట్ పేరుతో ప్రజల నుంచి దశాబ్దాలపాటు టోల్ ఎలా వసూలు చేస్తున్నారో చూస్తున్నామని, రేపు రైతుల పరిస్థితి ఇదే విధంగా మారే ప్రమాదం ఉందన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం నిర్మాణం ప్రారంభమై 20 ఏళ్లు గడిచినా పూర్తి కాలేదన్నారు. రాయలసీమ జీవనాడి హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి సుజల స్రవంతి పనులు ప్రారంభించి 4దశాబ్దాలు అయినా పూర్తికాలేదన్నారు. ప్రకాశం, నెల్లూరు కరువు ప్రాంతాలకు ఉపయోగపడే వెలుగొండ నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న అన్ని సాగునీటి ప్రాజెక్టులకు బడ్జెట్‌లో 5 శాతం మించి నిధులు కేటా యించని రాష్ట్ర ప్రభుత్వం.. రూ.80 వేల కోట్లతో గోదావరి- బనకచర్ల ప్రాజెక్టును ఎప్పుడు పూర్తిచేస్తుంది? అని ప్రశ్నించారు. సాగునీటి రంగంలోకి బిఒటి విధానాన్ని తీసుకురావడమంటే కాంట్రాక్టర్లకు దోచిపెట్టడానికే తప్ప రైతుల కోసం కాదన్నారు. కాంట్రాక్టర్లకు కాసులు కురిపిస్తూ, రైతులపై భారం వేసే ఆలోచన విరమించుకోవాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణం బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పుకుని ప్రైవేటు సంస్థలకు ఇచ్చి సాగునీటి రంగాన్ని వ్యాపారంగా మార్చే ఆలోచనను తప్పుబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత తీసుకుని సాగునీటి ప్రాజెక్టులను నిర్మించాలని, దానికి అవసరమైన నిధులు కేటాయించి నిర్దిష్ట కాల వ్యవధిలో సాగునీటి ప్రాజెక్టులు నిర్మించి కరువు ప్రాంతాలకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బ్యాక్ లాగ్ పోస్టుల విషయంలో 2016లో విడుదల చేసిన జిఒ 218ని రద్దు చేసి వెంటనే ఆ ఖాళీలను భర్తీ చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఒ.నల్లప్ప, ఆండ్ర మాల్యాద్రి గురువారం ప్రకటన విడుదల చేశారు. టిడిపి ప్రభుత్వ హయాంలో 218 విడుదల చేసి బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీని ఏడాది కాలం నిలిపివేశారని, తదుపరి వచ్చిన వైసిపి ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగించి ఈ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. దీంతో దళిత, గిరిజన బిడ్డలు ఉద్యోగ అవకాశాలు లేకుండా నష్టపోతున్నారని చెప్పారు. ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల అర్హులు తమకు వయోపరిమితి మించిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. దీనికి కారణం పాలకుల నిర్ణయాల్లో లోపం తప్ప మరొకటి కాదన్నారు. ఎస్సి, ఎస్టిల విషయంలో ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా జిఒ 218ని రద్దు చేసి బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధంకానున్నట్లు తెలిపారు.

బిపిసిఎల్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

- ఎంపి ఎంపి వేమిరెడ్డి హర్షం

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

నెల్లూరు జిల్లా రామాయపట్నం సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) రిఫైనరీ అండ్ పెట్రో కెమికల్ కాంప్లెక్స్ కంపెనీ ఏర్పాటులో మరో కీలక ముందడుగు పడింది. ఇప్పటికే రామాయపట్నం కేంద్రంగా కంపెనీ ఏర్పాటు చేసేందుకు బిపిసిఎల్ యాజమాన్యం అంగీకరించగా.. గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కేబినెట్ దీనిపై సుదీర్ఘంగా చర్చించింది. నెల్లూరు జిల్లా రామాయపట్నంలో 6 వేల ఎకరాల్లో రూ.96 వేల కోట్లతో బిపిసిఎల్ భారీ రిఫైనరీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రామాయపట్నం పోర్టు సమీపంలో బిపిసిఎల్ రిఫైనరీ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలపడంపై ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. బిపిసిఎల్ ఏర్పాటు కానుండటంతో పారిశ్రామికంగా జిల్లా ఎంతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. తాను ఎంపిగా ప్రాతినిథ్యం వహిస్తున్న నెల్లూరు జిల్లాలో ఇంత భారీ పరిశ్రమ ఏర్పాటు కావడం చాలా గర్వకారణంగా ఉందని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం రామాయపట్నం కేంద్రంగా రూ.96 వేల కోట్లతో బిపిసిఎల్ ఏర్పాటుతో పారిశ్రామికంగా, ఉద్యోగ ఉపాధి అవకాశాల పరంగా సమూల మార్పులు రానున్నాయి. బిపిసిఎల్‌తో దాదాపు 15 అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు కానుండటంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించనుంది. జిల్లా సమగ్రాభివద్ధిలో బిపిసిఎల్ ప్లాంట్ ఒక మైలు రాయిగా నిలిచిపోనుందని ఎంపి వేమిరెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు రవాణా రంగాన్ని పరిరక్షించండి

- ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

ప్రజాశక్తి - బేతంచర్ల (నంద్యాల)

సదస్సులో మాట్లాడుతున్న లక్ష్మయ్య, పక్కన నాయకులు

రోడ్డు రవాణా రంగాన్ని పరిరక్షించి, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు కేరళ తరహా సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. లారీ, ఆటో, జీపు కార్మికుల రవాణా రంగ సదస్సు గురువారం నంద్యాల జిల్లా బేతంచెర్లలోని సిఐటియు కార్యాలయంలో ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు బి.రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ఆర్ లక్ష్మయ్య మాట్లాడుతూ... దేశాభివృద్ధిలో రవాణా రంగం పాత్ర కీలకమైందని, 85 శాతం ప్రయాణికులు, 61 రకాల వస్తువుల సరఫరా రోడ్డు రవాణా ద్వారా జరుగుతోందని, జిడిపిలో రవాణా రంగం భాగం 4.60 శాతంగా ఉందని తెలిపారు. వ్యవసాయం తర్వాత ఎక్కువ శాతం ఉపాధి కల్పించే రంగం కూడా రవాణా రంగమేనని తెలిపారు. సుమారు పది కోట్ల మంది కార్మికులు ప్రత్యక్షంగా పని చేస్తున్నారని వివరించారు. వీరిలో 95 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్నారని, నేడు ఈ కార్మికుల స్థితిగతులు చాలా దుర్భరంగా ఉన్నాయని తెలిపారు. పిఎఫ్, ఇఎస్‌ఐ, గ్రాట్యూటీ, ఎనిమిది గంటల పని, వారాంతపు సెలవులకు కార్మికులు నోచుకోవడం లేదన్నారు. ఒక పక్క కేంద్ర ప్రభుత్వం రోడ్డు రవాణా రంగాన్ని పెద్ద పెద్ద కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టే లక్ష్యంతోనే 2019లో ఎంవి యాక్ట్-1988కు సవరణ చేసిందన్నారు. చలానా ఛార్జీలు, జరిమానాలు రూ. వందల రెట్లు పెంచారని, చిన్న వాహనదారులకు వాహన పార్కింగ్ పాలసీ హానికరంగా తయారైందని తెలిపారు. రవాణా కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. 2019 ఎంవి యాక్ట్‌కు సవరణ చట్టాన్ని ఎత్తివేయాలని, రోడ్డు రవాణా రంగాన్ని, ఆర్‌టిసిలను రక్షించాలని కోరారు. డీజిల్, పెట్రోల్ ధరలు తగ్గించాలని, నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని, ఇఎస్‌ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా జరిగే 'చలో పార్లమెంట్' కార్యక్రమంలో రోడ్డు రవాణా కార్మికులందరూ పాల్గొనాలని కోరారు.

ఈ సదస్సులో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి వై.ఎల్లయ్య, ఆటో యూనియన్ మండల కార్యదర్శి ఎ.మదిలేటి స్వామి, జీపు యూనియన్ కార్యదర్శి మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

దలాల్ స్ట్రీట్‌కు ఎట్టకేలకు ఉపశమనం

- సెన్సెక్స్‌కు 1436 పాయింట్ల లాభం
- ఐటి, ఆటో స్టాక్స్ మద్దతు
- పెరిగిన రూ.6 లక్షల కోట్ల సంపద

ముంబయి : చాలా రోజులుగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్న దలాల్ స్ట్రీట్‌కు ఎట్టకేలకు ఉపశమనం లభించింది. ఫైనాన్సియల్, ఆటో, ఐటి స్టాక్స్‌ల్లో కొనుగోళ్ల మద్దతుతో గురువారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 1436 పాయింట్లు లేదా 1.83 శాతం పెరిగి రూ.79,943కి చేరింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 446 పాయింట్ల లాభంతో 24,188 వద్ద ముగిసింది. సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్లు, నిఫ్టీ దాదాపు 450 పాయింట్లు ర్యాలీ చేసింది. ఉదయం కాసేపు స్తబ్దుగా సాగిన మార్కెట్లు.. ఆ తర్వాత ఏ దశలోనూ వెనక్కి తిరగకుండా పరుగులు పెట్టాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 80,033 గరిష్ట స్థాయిని తాకింది. దీంతో వరుసగా రెండో సెషన్‌లోనూ లాభాలు నమోదు చేసినట్లయ్యింది. సెన్సెక్స్ 30 సూచీలో ఒక్క సన్‌ఫార్మా మినహా మిగిలిన అన్ని సూచీలూ లాభపడ్డాయి. ముఖ్యంగా బజాజ్ ఫిన్‌సర్వ్, బజాజ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్ షేర్లు అధికంగా లాభపడిన వాటిలో ఉన్నాయి.

ఒక్క పూటలోనే బిఎస్‌ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.5.89లక్షల కోట్లు పెరిగి రూ.450.32 లక్షల కోట్లకు చేరింది. దీంతో దాదాపు రూ.6 లక్షల కోట్ల సంపద పెరిగినట్లయ్యింది. నిఫ్టీలో ఆటో, ఫైనాన్సీయల్ సర్వీసెస్, ఐటి, కన్స్యూమర్ డ్యూరేబుల్స్ రంగాలు 1.5 శాతం నుంచి 3.8 శాతానికి పెరిగాయి. మంగళవారం వరకు వరుసగా నాలుగు సెషన్లలో నష్టాలను నమోదు చేసిన ఐటి స్టాక్స్ గురువారం లాభాలను నమోదు చేయడం సానుకూలంగా మారింది.

సానుకూలాంశాలు..

గతేడాది 2024 చివర్లో అంతర్జాతీయ, జాతీయ మార్కెట్లు భారీగా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయంగా అమెరికా, యూరోపియన్ స్టాక్ ఫ్యూచర్స్ దిగిరావడంతో ఆయా ఎక్స్ఛేంజీల్లో కొనుగోళ్ల మద్దతు లభించింది. ఈ క్రమంలో కొత్త సంవత్సరంలో భారీగా కోనుగోళు జరపడంతో యూరో స్టాక్స్ 50, నస్డాక్ 100 ఫ్యూచర్స్ 0.5 శాతం మెరుగుపడ్డాయి. 2023 చివరి నెలతో పోల్చితే గడిచిన డిసెంబర్‌లో జిఎస్‌టి వసూళ్లు 7.3 శాతం పెరిగి 1.77 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది వినియోగంలో రికవరీకి సంకేతమనే విశ్లేషణలు రావడంతో ఇన్వెస్టర్లలో విశ్వాసం పెరిగింది. అదే విధంగా డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో ఆటో మోటివ్, ఫైనాన్షియల్స్ తో పాటు కీలక రంగాల నుంచి సానుకూల ప్రకటనలు రావడం ఉత్సాహాన్ని నింపింది.

సమస్యలపై రేడియో ఫోన్‌ఇన్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం రేడియో స్టేషన్ నుంచి ఫోన్ ఇన్ కార్యక్రమం ద్వారా సమస్యలను తెలుసుకుంటున్న కలెక్టర్

మున్సిపాల్టీ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు అనంతపురం రేడియో స్టేషన్‌లో గురువారం ఆకాశవాణి ఫోన్ ఇన్ కార్యక్రవాన్ని నిర్వహించారు. మున్సిపల్ అధికారులతో కలిసి కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల సమస్యలను తెలుసు కున్నారు. విద్యుత్తు దీపాలు, రోడ్లు, డ్రయినేజీలు, తదితర సమస్యలపై ప్రజలు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. 18 మంది వివిధ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసు కొచ్చారు. ఈ సమస్యలన్నింటిపై కలెక్టర్ అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథ్, అనంతపురం ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, అనంతపురం ఆకాశవాణి డైరెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మంగళగిరిలోని సిసిఎల్‌ఎ కార్యాలయంలో ఈ నెల 3న జోన్-2, 3 రెవెన్యూ ప్రాంతీయ సదస్సులు రెవెన్యూశాఖ నిర్వహించనుంది. ఈ సదస్సులు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన జరగనున్నాయి. ఈ సదస్సుకు ఆయా జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఎమ్మెల్సీలు హాజరవుతారని సిసిఎల్‌ఎ కమిషనరు జి జయలక్ష్మి గురువారం ప్రకటించారు. శుక్రవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలకు సదస్సు జరగనుంది. అనంతరం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల ప్రాంతీయ సదస్సు జరగనుంది.

హస్తకళలకు ప్రాచుర్యం

- పర్యాటకశాఖ మంత్రిని కోరిన మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టూరిజం సర్క్యూట్ల ఏర్పాటులో భాగంగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌లను అభివృద్ధి చేయాలని, హస్తకళలకు ప్రాచుర్యం కల్పించాలని పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను బిసి సంక్షేమ, చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్ సవిత కోరారు. సచివాలయంలోని మంత్రి దుర్గేష్‌ను ఆయన కార్యాలయంలో గురువారం మంత్రి సవిత మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన పర్యాటక పాలసీకి అనుగుణంగా ప్రభుత్వం సర్క్యూట్లను అభివృద్ధి చేస్తోందని సవిత అన్నారు. చేనేతకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు పర్యాటకశాఖతో కలిసి ముందుకెళ్లేందుకు సహకరించాలని కోరారు. టూరిజం సర్క్యూట్‌లలో భాగంగా సమీపంలోని హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌ను అభివృద్ధి చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్థానికంగా ఉండే హస్తకళలకు ప్రాచుర్యం కల్పించాలన్నారు. హస్తకళలు, చేనేతను ప్రోత్సహించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపైనా ఉందని మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా అన్నారు. రాష్ట్రంలో లేపాక్షి, ఆప్కో, చేనేత వస్త్రాల అమ్మకాలు పెరిగేందుకు తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో హ్యాండ్‌లుమ్స్ అండ్ టెక్స్‌టైల్స్ ముఖ్యకార్యదర్శి కె సునీత, కమిషనర్ రేఖారాణి తదితరులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో మళ్లీ భూప్రకంపనం

ప్రజాశక్తి-ముండ్లమూరు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా ముండ్లమూరులో మళ్లీ భూమి కంపించింది. గురువారం 1.43కు పెద్ద శబ్దంతో భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ముండ్లమూరు మండలంలో పలు గ్రామాల్లో డిసెంబర్‌లో ఐదుసార్లు భూప్రకంపనలు వచ్చాయి. మళ్లీ ప్రకంపనలు రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

నాలుగేళ్ల కనిష్టానికి కార్ల అమ్మకాల వృద్ధి

- పట్టణ మార్కెట్‌పై ఒత్తిడి
- విక్రయాలపై ప్రభావం

న్యూఢిల్లీ : హెచ్చు ధరలతో పట్టణ ప్రజలపై ఆదాయ ఒత్తిడీలు నెలకొనడంతో కార్ల అమ్మకాలు ఆశించిన స్థాయిలో జరగలేదు. గడిచిన ఏడాది 2024లో కార్ల అమ్మకాల వృద్ధి 5 శాతానికి పరిమితమై.. నాలుగేళ్ల కనిష్టానికి పడిపోయాయి. నాలుగేళ్లలో ఇంత తక్కువ వృద్ధి చోటు చేసుకోవడం ఇదే తొలిసారి. మరోవైపు స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (ఎస్‌యువి)ల అమ్మకాలకు ప్రజాదరణ పెరిగింది. కాగా.. పట్టణ మార్కెట్లు సవాళ్లను ఎదుర్కొన్నాయి. పెరుగుతున్న కార్ల ధరలు, పేలవమైన డిమాండ్ అమ్మకాలను ప్రభావితం చేశాయని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మారుతీ సుజుకీ, టాటా మోటార్స్ రికార్డు స్థాయిలో అమ్మకాలను నమోదు చేయగా, హ్యుందాయ్ దాదాపు యథాతథ వృద్ధిని ప్రకటించింది. భవిష్యత్ అమ్మకాలను పెంచుకోవడానికి వాహన తయారీదారులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు, పన్ను తగ్గింపులను డిమాండ్ చేస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం.. 2024లో 5 శాతం పెరుగుదలతో 43 లక్షల వాహనాల అమ్మకాలు జరిగాయి. ఇంతక్రితం 2023లో 41.1 లక్షల యూనిట్ల విక్రయాలు నమోదయ్యాయి. మొత్తం అమ్మకాల్లో 54 శాతం ఎస్‌యువిలు ఉండటం విశేషం. తక్కువ అమ్మకాల వృద్ధి భవిష్యత్తులో మరిన్ని సవాళ్లను విసురొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2024లో చాలా వరకు డిమాండ్ తక్కువగా ఉంది. ముఖ్యంగా సంవత్సరం చివరిలో అమ్మకాలను పెంచడానికి వాహన తయారీదారులు దూకుడుగా ధరల తగ్గింపును ప్రకటించారు. ఇటీవల కఠినమైన భద్రత, ఉద్గార నిబంధనల అమలు కారణంగా పెరుగుతున్న కార్ల ధరలు ప్రజల వాహన కొనుగోలు స్తోమతను దెబ్బతీస్తున్నాయి. ఇది పట్టణ విక్రయాలపై మరింత ఒత్తిడి పెంచింది. కొత్త ఏడాది 2025లో పరిశ్రమ అమ్మకాలు ప్రభుత్వ విధానంపై ఆధారపడి ఉండొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. చాలా మంది వాహన తయారీదారులు ఆదాయపు పన్ను రేట్లలో తగ్గింపును, సహా ప్రోత్సాహకాల కోసం రాబోయే బడ్జెట్‌లో ఎదురు చూస్తున్నారని భావిస్తున్నారు. పన్నులు తగ్గించడం ద్వారా వినియోగాన్ని పెంచడానికి, ఆర్థిక స్థోమత మెరుగుదలకు మద్దతునివ్వనుందని విశ్లేషిస్తున్నారు. విస్తృత మార్కెట్ మందగమనాన్ని ఎదుర్కోవడానికి గ్రామీణ మార్కెట్లలోనూ కార్ల పరిశ్రమ ఊపందుకునేలా.. బలమైన డిమాండ్ పెంచడంపై ప్రభుత్వ దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

పాతాళానికి రూపాయి

ముంబయి : కొత్త ఏడాదిలోనూ రూపాయి పతనం ఆగడం లేదు. గురువారం ప్రపంచ మార్కెట్‌లో రూపాయి మారకం విలువ 9 పైసలు పతనమై 85.73 కనిష్ఠ స్థాయికి దిగజారింది. ఇంటర్ బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో రూపాయి విలువ 85.79-85.68 మధ్య కదలాడింది. ఇంతక్రితం బుధవారం 85.64 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా చమురు ధరలు పెరగడం, దేశ ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకుంటున్న అత్యంత బలహీనమైన గణంకాలు, స్టాక్ మార్కెట్లలో ఒత్తిడి, విదేశీ సంస్థాగత పెట్టుబడులు తరలిపోవడం, పేలవ ఎగుమతుల తీరు, దిగుమతులు పెరగడం తదితర పరిణామాలు రూపాయికి ప్రతికూలంగా మారాయి.

త్వరలోనే విఐ 5జి సేవలు..!

న్యూఢిల్లీ : ప్రయివేటు టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా (విఐ) త్వరలోనే 5జి సేవలను తీసుకురానుందని ఆ సంస్థ వర్గాలు తెలిపాయి. ఈ ఏడాది మార్చిలో 5జిని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నాయి. దీంతో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌కు పోటీ ఇవ్వనుంది. మెరుగైన నెట్‌వర్క్ అనుభవంతో, తక్కువ ధరలో ఈ సేవలు అందుబాటులోకి తేనున్నట్లు విఐ వర్గాలు తెలిపాయి.

ఆంధ్రప్రదేశ్ సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ
(APSWREIS) తాడేపల్లి, గుంటూరుజిల్లా.
e-Procurement Short Tender notice No. 12/APSWRE-Technical-2025, Dated : 02-01-2025
ప్రశ్న పత్రములు మరియు స్టడీ మెటీరియల్ ప్రింటింగ్ కొరకు ప్రకటన
APSWREIS నిర్వహించు అంతర్గత పరీక్షల కొరకు ప్రశ్న పత్రాలు మరియు స్టడీ మెటీరియల్ ముద్రణ కొరకు షార్ట్ టెండర్లను ఆహ్వానించడమైనది. డౌన్‌లోడ్ (Download) ప్రారంభతేది: 03-01-2025. పూర్తి వివరముల కొరకు https:// apeprocurement.gov.in సందర్శించగలరు.
కాంటాక్ట్ నెంబర్ : 0863 - 2347445. సం/- కార్యదర్శి, APSWREIS

సంపాదకీయం

విద్యకు విఘాతం

దేశంలో నూరుశాతం అక్షరాస్యత సాధించటంపై పాలకులు ఏళ్ల తరబడి ఘనంగా మాట్లాడుతున్నా- ఇప్పటికీ కోట్లాదిమందికి విద్య అందని ద్రాక్షగానే ఉంది. పాలకుల చిత్తశుద్ధి లేమి, పోతపోసిన నిర్లక్ష్యం సామాన్యులకు చదువుని దూరం చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఈ సత్యాన్ని అనేక అధ్యయనాలూ, గణాంకాలూ వెల్లడి చేస్తున్నా కట్టుదిట్ట కార్యాచరణ చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయి. పట్టుదలతో పనిచేస్తున్న రాష్ట్రాల్లో తప్ప మిగతా అన్నిచోట్లా బడికి దూరమవుతున్న పిల్లల సంఖ్య పెరుగుతోంది. తాజాగా వెలువడ్డ ఒక అధ్యయనంలో- కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు విద్యాభివృద్ధిలో ఉన్నత స్థానంలో ఉండగా, ఎన్డీఏ పాలనలోని బీహార్, అసోం, గుజరాత్, హర్యానా అట్టడుగున ఉన్నాయి. కేరళలో బాలురు, బాలికలు ప్రాథమిక విద్యలో ఎంతమంది చేరితే అంతమందీ మాధ్యమిక విద్యను పూర్తి చేస్తున్నారు. బీహార్లో 100 మందిలో 40.3 మంది మాత్రమే మాధ్యమిక విద్యను దాటుతున్నారు. హర్యానా, గుజరాత్, అసోం వంటి రాష్ట్రాలు 2019తో పోలిస్తే 2024 నాటికి దిగజారినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానం వైపు నడిపించే సాధనంగా విద్య తోడ్పడుతుంది. ఈ అవగాహన సమాజంలోని అన్ని తరగతుల్లోకి ప్రభవించినా- అనేకమందికి ఇప్పటికీ సామాజిక, ఆర్థిక కారణాలు విద్యను అందుకోవటానికి ఆటంకంగా ఉన్నాయి. వాటిని నిర్ద్వంద్వంగా దూరం చేసి, 14 ఏళ్ల లోపు పిల్లలందరికీ నిర్బంధ విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. కానీ, చిత్తశుద్ధి లేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారవాద ఆర్థిక విధానాలను అవలంబించి, విద్యారంగాన్ని ప్రైవేటు బాట పట్టించాయి. నలభై ఏళ్ల క్రితం నిర్మించుకున్న ప్రభుత్వ విద్యారంగాన్ని ఏమాత్రం విస్తరించకుండా, ఉన్న విద్యాసంస్థలను నిర్వీర్యం చేశాయి. ఏళ్ల తరబడి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా, మౌలిక వసతులు కల్పించకుండా సర్కారు బడులను బలహీనపర్చి; ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థల ఎదుగుదలకు కారణమయ్యాయి. అధ్యయన కమిటీలు, కమిషన్లు చేసిన సిఫార్సుల మేరకు కొన్ని కంటితుడుపు చర్యలు చేపట్టినా- బలహీనపర్చే కుట్రను కొనసాగిస్తూనే ఉన్నాయి. గత ముప్పయ్ ఏళ్లుగా ఏలికలు అనుసరించిన సంస్కరణలు యావత్తూ ప్రభుత్వ విద్యారంగానికి పాడె కట్టే దిశగానే సాగాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఏడాదికేడాది విద్యార్థి ప్రవేశాలు తగ్గిపోతుండడం నిర్వీర్య పర్వానికి ఆనవాలు. ఈ ఏడాది 1 - 10 తరగతుల మధ్య రెండు లక్షల మంది విద్యార్థులు బడికి దూరమయ్యారన్న లెక్క ఆందోళన కలిగించే పరిణామం. ప్రాథమిక పాఠశాలల్లోని 3 పైబడిన తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం, ఉన్న ఫళాన ఆంగ్ల మాధ్యమాన్ని రుద్దటం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవటం వంటి చర్యలన్నీ ఈ డ్రాపౌట్లకు కారణం. అంతకంతకూ పెరుగుతున్న కుటుంబ జీవన వ్యయాన్ని అందుకోవటానికి అల్పాదాయ కుటుంబాల్లోని 13 ఏళ్లు దాటిన పిల్లలు పనుల్లోకి మళ్లటం కూడా ఈ మధ్యకాలంలో ఎక్కువగానే కనిపిస్తోంది. బహుశా ఇలాంటి కారణాల వల్లనే మన రాష్ట్ర పాఠశాలల్లో సగటున రోజువారీ గైర్హాజరు 24.3 శాతంగా ఉంటోంది. నాలుగో వంతు విద్యార్థులు రోజూ బడికి రాలేని పరిస్థితి ఉన్నదంటే- మన విద్యాప్రమాణాల స్థాయి ఏమేరకు ఉన్నదో అర్థం చేసుకోవొచ్చు! మన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో 2021 - 22లో 45 లక్షల మంది విద్యార్థులు ఉంటే- ఆ సంఖ్య ఈ విద్యాసంవత్సరం 38 లక్షలకు పడిపోయింది.

చదువుకోవటం అనేది ఆర్థికంగా కానీ, సామాజికంగా కానీ భారంగా మారినప్పుడు ఆ ప్రభావం ఎక్కువగా బాలికా విద్యపైనే పడుతోంది. దేశంలో ప్రతి ఐదుగురు అమ్మాయిల్లో ముగ్గురు మాత్రమే ఇంటర్మీడియట్‌లో అడుగు పెడుతున్నారు. వందమందిలో 40 మంది బాలికలు పదో తరగతితోనే చదువు ఆపేసి, పనుల్లో చేరటమో, వివాహబంధంలోకి వెళ్లటమో జరుగుతోంది. పాలకులు భేటీ బచావో అని నినాదాలతో హోరెత్తించటం కాదు; అమ్మాయిలను విద్యావంతులను చేయాలి. అందరికీ చదువు అందించటం తమ కనీస బాధ్యతగా గుర్తెరగాలి. 1966లోనే కొఠారి కమిషన్ సిఫార్సు చేసినట్టు జాతీయాదాయంలో ఆరు శాతాన్ని విద్యారంగానికి కేటాయించాలి. ఉదారవాద విధానాలకు స్వస్తి చెప్పి, ప్రభుత్వరంగ విద్యాసంస్థలను బలోపేతం చేయటం ద్వారానే అందరికీ విద్య అన్న విధానం ఫలిస్తుంది.

మహనీయుల మాట

పార్టీ నుండి విడగొట్టుకుని
ఏ వర్గమూ, ఏ వ్యక్తీ
ఎంత సామర్థ్యమున్నవాడైనా
ఏమీ సాధించలేడు.
- హోచిమిన్

అంతర్జాతీయం

అమెరికన్ సామ్రాజ్యవాద విష వారసత్వం

అంతులేని వియత్నాం యుద్ధం

ఎస్. కృష్ణస్వామి

> వియత్నాం యుద్ధం మిగిల్చిన గాయాలను చూసి అమెరికా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అమెరికా చేసిన తప్పులకు పరిహారంగా అక్కడి పరిస్థితులను చక్కదిద్దేందుకు తగిన కార్యాచరణ పథకాన్ని చేపట్టాలి. విచ్చలవిడిగా బాంబులు ప్రయోగించడం, రసాయన జీవ ఆయుధాలను వినియోగించడం మీద పూర్తి నిషేధం విధించేలా ప్రపంచ దేశాల మీద అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకురావాలి. ఇజ్రాయిల్ వంటి ధూర్త దేశాల మీద కఠిన చర్యలు చేపట్టాలి. యుద్ధ పరిహారం చెల్లింపు దానధర్మంగా ఇచ్చేది కాదు. సహజ న్యాయ సూత్రాలకు కట్టుబడి పరిహారం చెల్లించాలి.

వియత్నాం యుద్ధం 1955 నుండి 1975 వరకు ఇరవయ్యేళ్ల పాటు కొనసాగింది. చరిత్రలో ఇంతటి విపత్కర అధ్యాయం పట్ల పశ్చాత్తాపం గాని, చేసిన దుర్మార్గం ఒప్పుకోలు ప్రకటనగానీ మనకు కానరాదు. ఈ యుద్ధం మానవ సమాజం మీదా, పర్యావరణం మీదా లోతైన గాయం మిగిల్చింది. ఇది మిగిలిన యుద్ధాల వంటి యుద్ధం కాదు. ఒక దేశం మీదో ఆ దేశ ప్రజానీకం మీదో, వాళ్లదైన చిన్న ప్రపంచం మీదో సామ్రాజ్యవాద శక్తులు నిరంతరాయంగా, నిర్దయగా చేసిన అమానవీయ, అమానుష యుద్ధం. ఈ యుద్ధం మాటున చేసిన విధ్వంసం, ప్రజానీకానికి మిగిల్చిన బాధ, వేదన కొన్ని దశాబ్దాలుగా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఈ యుద్ధానికి ఉన్న చారిత్రక మూలాలు, ఈ యుద్ధం మూలంగా జరిగిన పర్యావరణ విధ్వంసం వియత్నాం ప్రజానీకాన్ని ప్రపంచ ప్రజానీకాన్ని పీడకలలా వెంటాడుతూనే ఉన్నాయి.

సామ్రాజ్యవాదం, ప్రచ్ఛన్న యుద్ధం దూకుడు

వలస పాలనను వ్యతిరేకిస్తూ వియత్నమిన్ శక్తుల పోరాటాన్ని అణిచివేయాలని ప్రయత్నిస్తున్న ఫ్రాన్స్‌కు అమెరికా బలమైన తోడుగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ 1954లో వియత్నాంలో నెలకొన్న పరిస్థితులు, దక్షిణాసియాకు మధ్య ఉన్న బాదరాయణ సంబంధం గురించి వివరిస్తూ ఒక దేశంలో (వియత్నాం) కమ్యూనిజం విజయం సాధిస్తే చుట్టుపక్కల దేశాలన్నీ అదే మార్గం పడతాయన్న ఆందోళన వ్యక్తం చేశాడు. అమెరికా అండదండగా నిలబడిన ఫ్రాన్స్‌ను హోచిమిన్ నాయకత్వాన వియత్నమిన్ శక్తులు 1954లో డియన్ బియన్ ఫు దగ్గర పరాజయం పాల్జేశాయి. వియత్నాం నుండి ఫ్రాన్స్ సైన్యం వైదొలగింది. వియత్నాం స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నది. అయితే ఈ స్వాతంత్ర్యం అట్టే కాలం నిలవలేదు. దోపిడీ శక్తులు జెనీవా ఒప్పందం పేరిట వియత్నాం దేశాన్ని కమ్యూనిస్టు పార్టీ జయించుకున్న ఉత్తర వియత్నాం, కమ్యూనిస్టు వ్యతిరేక దక్షిణ వియత్నాంగా రెండుగా విభజించాయి.

అమెరికా సామ్రాజ్యవాద దాహంతో వియత్నాం అంతర్గత వ్యవహారాలలో తలదూర్చింది. ఉత్తర వియత్నాంలో ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వం దక్షిణాసియా ఖండంలో పశ్చిమ దేశాల ఆధిపత్యానికి సవాలుగా నిలుస్తుందని అమెరికా భావించింది. 1964లో టోన్‌కిన్ జల సంధిలో చోటు చేసుకున్నదని చెబుతున్న నావికాదళ స్వల్ప ఘర్షణను సాకుగా తీసుకుని అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ అమెరికన్ కాంగ్రెస్ అనుమతి లేకుండా ఏకపక్షంగా వియత్నాంపై సైనిక చర్యకు పిలుపునిచ్చాడు. అధునిక యుద్ధ చరిత్రలో అత్యంత పాశవికమైన యుద్ధానికి అలా అంకురార్పణ జరిగింది.

1965 నుండి 1973 వరకు అమెరికా 50 లక్షల మందికి పైగా సైన్యాన్ని వియత్నాం యుద్ధంలో మోహరించింది. అమెరికా వియత్నాంలో అంగుళం భూభాగాన్ని కూడా వదిలి పెట్టకుండా వైమానిక దాడుల ద్వారా బాంబుల వర్షం కురిపించింది. రసాయన యుద్ధానికి పాల్పడింది. అయితే అమెరికాలో ఈ యుద్ధానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. అమెరికా దుర్మార్గ వైఖరికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం తీసుకు వచ్చిన ఒత్తిడి, దేశీయంగా ఉధృతమైన నిరసనోద్యమాల నేపథ్యంలో అమెరికా వియత్నాం నుండి తన సైన్యాన్ని ఉపసంహరించుకుంటూ 1973లో పారిస్‌లో ఒక శాంతి ఒప్పందం మీద సంతకాలు చేసింది.

బాంబు దాడుల తీవ్రత - సరికొత్త సాక్ష్యం

అమెరికా వియత్నాం మీద బాంబు దాడులు చేసి విచక్షణా రహిత విధ్వంసానికి పాల్పడింది. కొత్తగా వెలుగు చూసిన రహస్య నివేదికలు ఈ బాంబు దాడుల వెనుక ఉన్న భయంకరమైన చేదు నిజాలను వెల్లడిస్తున్నాయి. వియత్నాం, లావోస్, కంబోడియాల మీద అమెరికా 130 లక్షల టన్నుల బాంబులు కురిపించింది. రెండవ ప్రపంచ యుద్ధంలో కురిపించిన మొత్తం బాంబుల పరిమాణం వియత్నాం మీద అమెరికా కురిపించిన బాంబులతో పోలిస్తే ఏ మూలకీ లెక్కలోకి రావు.

క్వ్యాయాంగ్ ట్రై ప్రావిన్స్‌లోను, వియత్నాం, లావోస్, కంబోడియాల ఉమ్మడి సరిహద్దు ట్రై ప్రాంతంలోనూ దాదాపు 50,000 భారీ గోతులు ఉన్నట్లు కనుగొన్నారు. ఇవి కేవలం గోతులే కాదు. వీటి నిండా ఇంకా పేలని మందుగుండు పదార్థాలు నిండి ఉన్నాయని తేల్చి చెప్పారు. వియత్నాం యుద్ధం ముగిసి ఇప్పటికి యాభై ఏళ్లు కావస్తున్నది. ఈ రోజుకీ వియత్నాం గడ్డ మీద 6,00,000 టన్నుల పేలని మందు గుండు నిల్వలున్నాయి. యుద్ధం ముగిసినా ఈ పేలుడు పదార్థాల మూలంగా ఇప్పటి వరకూ లక్ష మంది సాధారణ పౌరులు దుర్మరణం పాలయ్యారని వియత్నాం ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. వీటి మూలంగా ఈ రోజుకీ స్థానికులు భయం భయంగా దినదినగండంగా బతుకులు వెళ్లదీస్తున్నారు.

రసాయన యుద్ధ విధ్వంసం

మానవ జీవితాలంటే అమెరికా సామ్రాజ్యవాదానికి ఏ మాత్రం లెక్కలేదని వియత్నాంపై అది కురిపించిన బాంబులు తెలియచేస్తుంటే 'ఏజెంట్ ఆరెంజ్' పేరిట అది చేపట్టిన రసాయన యుద్ధం దాని రాక్షసత్వాన్ని వెల్లడిస్తుంది. 1962-1971 మధ్య కాలంలో అమెరికన్ సైన్యం వియత్నాం, తూర్పు లావోస్, కంబోడియాలోని కొన్ని ప్రాంతాలపై 750 లక్షల లీటర్ల విష రసాయనాలు విరజిమ్మింది. 1967-69 మధ్య కాలంలో ఈ విష రసాయనాలను అత్యధిక స్థాయిలో వినియోగించింది. సామూహిక విధ్వంసక ఆయుధాలలో రసాయన యుద్ధం అనేది మానవులు సృష్టించిన అత్యంత కిరాతక యుద్ధ క్రీడగా నిలుస్తుంది. ఈ రసాయన యుద్ధం ద్వారా వియత్నాంలో పంటలను, అడవులను దుంప నాశనం చేసింది అమెరికా. పర్యావరణ దృష్ట్యా చూస్తే ఇది మానవ ప్రేరేపిత ఉత్పాతం. 30 లక్షల హెక్టార్ల పచ్చని అడవులు బీళ్ళుగా మారాయి. జీవ వైవిధ్యం ఘోరంగా దెబ్బతిని పోయింది. పర్యావరణానికి తీరని విపత్తు దాపురించింది.

'ఏజెంట్ ఆరెంజ్' రసాయనాల విష ప్రభావాలతో దాదాపు 30 లక్షల మంది వియత్నమీయులు అనారోగ్యం పాలైతే మరో పది లక్షల మంది అంగ వైకల్యానికి లోనయ్యారని అధికారికంగా లెక్కించారు. యుద్ధానంతరం జన్మించిన తరం పిల్లలకు తాము ఎందుకు జన్యుపరమైన లోపాలతో వికారంగా ఉన్నామో తెలియదు. యుద్ధం పేరిట వియాత్నాంలో అమెరికా సృష్టించిన విధ్వంసంతో పోలిస్తే అది చెల్లించిన పరిహారం హాస్యాస్పదంగా అనిపిస్తుంది.

యుద్ధం మూలంగా వియత్నాం ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతిని పోయింది. సాగుకి లాయకీ అయిన భూములు...బాంబుల మూలంగా ధ్వంసం కావడం, లేదంటే ఏజెంట్ ఆరెంజ్ రసాయనాల మూలంగా దెబ్బతిని పోవడమో జరిగింది. దీనితో సాగు దెబ్బ తినిపోయి గ్రామీణ ప్రాంత ప్రజానీకం పేదరికంలోకి కూరుకుపోయారు. క్షుద్బాధ పట్టి పీడించింది. అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడి జీవించే లక్షలాది మంది ప్రజానీకం కూడా జీవనోపాధి కోల్పోయి అదే దైన్యానికి లోనయ్యారు. నదులు, నీళ్ల చెలమలు, బావులు విష రసాయనాల ప్రభావంతో ప్రజల దాహార్తిని తీర్చడానికి పనికి రాకుండా పోయాయి. గత్యంతరం లేక అదే నీటిని వాడుకున్న జనం రోగాల పాలయ్యారు.

సామాజిక జన జీవితం అస్తవ్యస్థం అయిపోయింది. మరణాలు, విస్థాపనలు, యుద్ధం మూలాన ఏర్పడిన మానసిక సమస్యలతో కుటుంబాలకు కుటుంబాలే విచ్ఛిన్నమై పోయాయి. ఈ యుద్ధం ములంగా ఇరవై లక్షల మంది వియత్నమీయులు మరణించారు. అనేక లక్షల మంది విస్థాపనకు గురయ్యారు. తత్ఫలితంగా అతి పెద్ద మానవ సంక్షోభం నెలకొన్నది. యుద్ధానంతరం దేశ పునర్నిర్మాణ ప్రక్రియ చాలా నెమ్మదిగా నడిచింది. యుద్ధం మూలంగా నెలకొన్న విధ్వంసం అంతటి తీవ్ర స్థాయిది కావడం ఒక కారణమైతే, పునర్నిర్మాణ ప్రక్రియకు అంతర్జాతీయ సహకారం ఆశించినంతగా అందకపోవడం మరో కారణం.

యుద్ధం-జవాబుదారీతనం

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకూ జరిగిన యుద్ధాల్లో అత్యధికం అమెరికా స్వీయ ప్రయోజనాల కోసం, అమెరికా తోడ్పాటుతో జరిగినవే. వియత్నాం యుద్ధం నేర్పిన గుణపాఠాలను అమెరికా ఈ రోజుకీ పెద్ద ఎత్తున విస్మరిస్తున్నది.

ఈ అమానవీయ యుద్ధానికి నైతికంగా బాధ్యత వహించకపోవడం అమెరికా ప్రధాన వైఫల్యం. విషతుల్యమైన పదార్థాల ప్రక్షాళన, ఆ రసాయనాల ఫలితంగా తలెత్తిన ఆరోగ్య సమస్యలను చక్కదిద్దడానికి అమెరికా పూర్తి బాధ్యత వహించకపోవడం క్షంతవ్యం కాని నేరం. అమెరికా పెద్ద ఎత్తున ఈ సమస్యల పరిష్కారానికి పూచీ పడడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా యుద్ధాలను ప్రేరేపించడం గానీ, యుద్ధాలకు మద్దతుగా నిలబడడం కానీ చేయరాదు.

వియత్నాం యుద్ధం మిగిల్చిన గాయాలను చూసి అమెరికా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అమెరికా చేసిన తప్పులకు పరిహారంగా అక్కడి పరిస్థితులను చక్కదిద్దేందుకు తగిన కార్యాచరణ పథకాన్ని చేపట్టాలి. విచ్చలవిడిగా బాంబులు ప్రయోగించడం, రసాయన జీవ ఆయుధాలను వినియోగించడం మీద పూర్తి నిషేధం విధించేలా ప్రపంచ దేశాల మీద అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకురావాలి. ఇజ్రాయిల్ వంటి ధూర్త దేశాల మీద కఠిన చర్యలు చేపట్టాలి. యుద్ధ పరిహారం చెల్లింపు దానధర్మంగా ఇచ్చేది కాదు. సహజ న్యాయ సూత్రాలకు కట్టుబడి పరిహారం చెల్లించాలి.

పారదర్శకతకు, జవాబుదారీతనానికి అమెరికా పెట్టింది పేరు అంటుంటారు. అదే నిజమైతే వియత్నాం యుద్ధ బాధితులను అన్ని విధాలా ఆదుకునేందుకు తక్షణమే సమగ్ర సహాయ ప్రణాళికను ప్రకటించి అమలు చెయ్యాలి. లేని పక్షంలో యుద్ధం మూలంగా ఒనగూడిన అన్యాయాలను వియత్నాం ప్రజానీకం మరింత సుదీర్ఘకాలం భరించాల్సి వుంటుంది. వియత్నాం యుద్ధం నుండి మనం నేర్వాల్సిన గుణపాఠం ఏమిటంటే ప్రజల ప్రాణాలను హరించి, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే సాయుధ ఘర్షణలకు ఇకనైనా స్వస్తి చెప్పాలి. యుద్ధ వ్యయం కన్నా యుద్ధాల మూలంగా చెల్లించే మూల్యం ఎన్నో రెట్లు ఎక్కువ. యుద్ధాలు దేశాలకు దేశాలనే అస్థిరం పాల్జేస్తాయి. సామ్రాజ్యవాద శక్తులు యుద్ధ దాహార్తిని కట్టబెట్టి శాంతికి కట్టుబడి ఉండాలి. మానవాళి శ్రేయస్సు కోసం యుద్ధాలను వ్యతిరేకించాలి. శాంతి స్థాపన కోసం పాటుపడాలి. వియత్నాం యుద్ధం మనకు ఇచ్చే సందేశం ఇదే. ★

నివాళి

సంస్కర్త, ఉద్యమశీలి

> భర్త జ్యోతి రావు పూలేతో కలసి పూణేలో అణచివేతకు గురవుతున్న బాలికల కోసం పాఠశాలను ప్రారంభించారు. ఇది మొదట తొమ్మిది మంది బాలికలతో ప్రారంభమైంది. తర్వాత సతారా, అహ్మదా నగర్‌లలో మరికొన్ని పాఠశాలలు స్థాపించారు. ఈమె పాఠశాలకు వెళ్లేటప్పుడు సనాతన చాందసవాదుల కారణంగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. ఆమెను మార్గ మధ్యలో ఆపి అసభ్యకరమైన పదజాలంతో దూషించి, రాళ్లతో దాడి చేసి, పేడ నీళ్ళు చల్లి అవమానించేవారు. అయినా సరే వెనుకడుగు వేయలేదు. తన సంచిలో అదనంగా మరో చీర పెట్టుకెళ్లి పాఠశాల దగ్గర మార్చుకునేవారు. వారు మొక్కవోని దీక్షతో ఎంతో మంది మహిళలను విద్యావంతులుగా మార్చేందుకు శ్రీకారం చుట్టారు.



నేడు సావిత్రిబాయి పూలే జయంతి

దేశ సాంఘిక సంస్కరణోద్యమంలో పూలే దంపతులు అద్భుతమైన పాత్ర పోషించారు. నాటి పరిస్థితుల్లో స్త్రీలు మాట్లాడటానికి కూడా అవకాశం లేదు. అయినప్పటికీ సామాజిక రుగ్మతలను పారదోలేందుకు తన వంతు కృషి చేసి నేటికీ ఆదర్శంగా నిలిచారు సావిత్రి బాయి పూలే. ఆమెకు తొమ్మిదేళ్ల వయసులో పదమూడేళ్ల జ్యోతి రావు పూలేతో (1840) వివాహం జరిగింది. వివాహానంతరం అభ్యుదయ భావాలున్న జ్యోతి రావు పూలే, సావిత్రి బాయి పూలేతో కలసి సాంఘిక సంస్కరణోద్యమంలో నూతన ఒరవడికి తెర లేపారు.

ఈమె వివాహానంతరం ఇంట్లోనే విద్యాభ్యాసం ప్రారంభించారు. 1847లో ఉపాధ్యాయురాలిగా శిక్షణ పొందారు. 1848లో భర్త జ్యోతి రావు పూలేతో కలసి పూణేలో అణచివేతకు గురవుతున్న బాలికల కోసం పాఠశాలను ప్రారంభించారు. ఇది మొదట తొమ్మిది మంది బాలికలతో ప్రారంభమైంది. తర్వాత పూణె, సతారా, అహ్మదా నగర్‌లలో మరికొన్ని పాఠశాలలు స్థాపించారు. ఈమె పాఠశాలకు వెళ్లేటప్పుడు సనాతన చాందసవాదుల కారణంగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. ఆమెను మార్గ మధ్యలో ఆపి అసభ్యకరమైన పదజాలంతో దూషించి, రాళ్లతో దాడి చేసి, పేడ నీళ్ళు చల్లి అవమానించేవారు. అయినా సరే వెనుకడుగు వేయలేదు. తన సంచిలో అదనంగా మరో చీర పెట్టుకెళ్లి పాఠశాల దగ్గర మార్చుకునేవారు. వారు మొక్కవోని దీక్షతో ఎంతో మంది మహిళలను విద్యావంతులుగా మార్చేందుకు శ్రీకారం చుట్టారు. బాల్య వివాహాలను వ్యతిరేకించారు. చిన్న వయసులో వివాహం చేయటం వలన ప్రసవించే శక్తి లేక అనేకమంది బాలికలు ప్రాణాలు కోల్పోతున్నారని, చిన్న వయసులో భర్తను కోల్పోయిన వాళ్ళు వితంతువులుగా జీవితాన్ని గడపాల్సి వస్తుందనే వాదన దృఢంగా వినిపించారు. వితంతువులను హీనంగా చూస్తూ, గుండు గీయించి తెల్ల చీర కట్టించి, వారిని అశుభ సంకేతంగా చిత్రించేవారు. ఆ దురాచారాన్ని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాల్ని ప్రోత్సహించడమే గాక, దగ్గరుండి చేయించారు. వితంతు గర్భిణీల కోసం 1853లో ఒక గృహాన్ని ఏర్పాటు చేసి వారి బాగోగులు దగ్గరుండి చూసేవారు. వితంతు మహిళలకు గుండు గీసే పద్ధతి పోయేందుకు కృషి చేశారు. వరకట్నాన్ని వ్యతిరేకించారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించారు. 1852లో మహిళా హక్కులను మహిళలకు తెలియజేసేందుకు, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు 'మహిళా సేవా మండల్' ఏర్పాటు చేశారు. కార్మికులు, గ్రామీణ పేదలు కోసం జ్యోతి రావు పూలే 52 ఆహార కేంద్రాలను తెరిచారు. వీటన్నింటిని ఆమె చూసుకునేవారు. వారిరువురూ ఏర్పాటు చేసిన బోర్డింగ్ పాఠశాలలను దగ్గరుండి చూసుకునే వారు. 1863లో సంఘ బహిష్కృతులైన తల్లీపిల్లల కోసం శరణాలయం స్థాపించారు. ప్లేగు వ్యాధిగ్రస్తుల కోసం ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి వారికి సేవ చేసే వారు. జ్యోతి రావు పూలే స్థాపించిన సత్య శోధక్ సమాజ్‌ని ఆయన మరణానంతరం ఈమె నడిపారు. ఈ రకంగా సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా నిలబడిన ధీర వనిత సావిత్రి బాయి పూలే. స్త్రీల అభివృద్ధి కోసం తెగువతో నిలబడిన వీర వనిత. ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవ చేస్తూ తను కూడా ఆ వ్యాధి బారినపడి 1897 మార్చి 10న తుది శ్వాస విడిచారు సావిత్రి బాయి పూలే. ఆమె నాడు నేడు ఆదర్శప్రాయమే. ఆమె లక్ష్య సాధనకు కృషి చేద్దాం.

- డా॥ ప్రియాంక గంగరాపు,
ఆంధ్రా విశ్వవిద్యాలయం అధ్యాపకులు.

వ్యాఖ్య

రష్యా గ్యాస్ రవాణా నిలిపివేత!



> ఈ చర్య ద్వారా రష్యాను ఆర్థికంగా దెబ్బ తీసి, పోరు నిలిపివేసేందుకు ఒత్తిడికి పూనుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఇప్పటికే అనేక ఐరోపా దేశాలు ఆంక్షల అమల్లో భాగంగా రష్యా నుంచి గ్యాస్ కొనుగోళ్లు నిలిపివేసిన సంగతి తెలిసిందే. చట్టపరంగా లేదా సాంకేతికంగా చేయగలిగిందేమీ లేదని రష్యా పేర్కొన్నది. ఈ పరిణామంతో ఇప్పటికే గణనీయంగా పడిపోయిన ఎగుమతులు మరింతగా తగ్గనున్నాయి. దీని వలన రష్యాకు జరిగే నష్టం కంటే గ్యాస్ దిగుమతి చేసుకొనే దేశాల మీద ఆర్థిక భారం పడనుందని విశ్లేషణలు వెలువడ్డాయి.

మరి కొద్ది వారాల్లో ఉక్రెయిన్-రష్యా సంక్షోభం నాలుగో సంవత్సరంలో ప్రవేశించనుంది. ఒప్పంద గడువు ముగియటంతో తూర్పు ఐరోపా దేశాలకు సరఫరా అవుతున్న రష్యా సహజవాయువును తమ భూభాగంలోని పైప్‌లైన్ నుంచి జనవరి ఒకటి నుంచి నిలిపివేస్తున్నట్లు ఉక్రెయిన్ ప్రకటించింది. ఒప్పంద పునరుద్ధరణ సంప్రదింపులకు ససేమిరా అంది. ఈ నిర్ణయాన్ని చారిత్రాత్మకమైనదిగా వర్ణించింది. ఈ చర్య ద్వారా రష్యాను ఆర్థికంగా దెబ్బ తీసి, పోరు నిలిపివేసేందుకు ఒత్తిడికి పూనుకున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. అయితే ఇప్పటికే అనేక ఐరోపా దేశాలు ఆంక్షల అమల్లో భాగంగా రష్యా నుంచి గ్యాస్ కొనుగోళ్లు నిలిపివేసిన సంగతి తెలిసిందే. చట్టపరంగా లేదా సాంకేతికంగా చేయగలిగిందేమీ లేదని రష్యా పేర్కొన్నది. ఈ పరిణామంతో ఇప్పటికే గణనీయంగా పడిపోయిన ఎగుమతులు మరింతగా తగ్గనున్నాయి. దీని వలన రష్యాకు జరిగే నష్టం కంటే గ్యాస్ దిగుమతి చేసుకొనే దేశాల మీద ఆర్థిక భారం పడనుందని విశ్లేషణలు వెలువడ్డాయి. మూడు సంవత్సరాలుగా పశ్చిమ దేశాలు అమలు జరుపుతున్న ఆంక్షల వలన తనదైన తీరులో పుతిన్ పరిస్థితికి తగినట్లుగా కొత్త మార్కెట్లను వెతుకుతున్నాడు. ఈ పైప్‌లైన్ ద్వారా రష్యాకు ఏటా ఐదు బిలియన్ డాలర్లు, ఉక్రెయిన్‌కు ఒక బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చేది. టర్కీ ద్వారా మరోపైప్ లైన్ ద్వారా సరఫరా అవుతున్న రష్యన్ గ్యాస్‌కు ఎలాంటి అంతరాయం లేదు. ఐరోపాకు రష్యా నుంచి జరుగుతున్న 35 శాతం సరఫరాలకు ఇప్పుడు పదికి పడిపోయాయి. తమ రెండు దేశాల మధ్య సాగుతున్న పోరుకు త్వరలో ముగింపు పలకనున్నట్లు రష్యా అధినేత పుతిన్, ఉక్రెయిన్ నేత జెలెన్స్కీ 2024 సంవత్సర ముగింపులో ప్రకటించారు తప్ప ఎలా అన్నది చెప్పలేదు.తాను అధికారానికి వచ్చిన 24 గంటల్లోనే ఉక్రెయిన్ పోరుకు స్వస్తి పలుకుతానని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. మరోవైపు పదవి నుంచి దిగిపోతున్న తరుణంలో జో బైడెన్ ఉక్రెయిన్‌కు పెద్ద మొత్తంలో ఆయుధాలతో పాటు ఆరుబిలియన్ డాలర్ల గ్రాంట్ అందచేయనున్నట్లు ప్రకటించాడు.

మూడు సంవత్సరాల సైనిక చర్యను చూసినపుడు పశ్చిమ దేశాల మీడియా ఎన్నిక కట్టుకథలు చెప్పినప్పటికీ ప్రారంభ దినాలతో పోలిస్తే రష్యా ఆధీనంలోకి వచ్చిన ఉక్రెయిన్ ప్రాంతాలు పెరిగాయి. జనం నమ్మక పోవటంతో ఇప్పుడు తగ్గించాయి. రష్యా 2023లో స్వాధీనం చేసుకున్న విస్తీర్ణంతో పోల్చితే 2024లో ఏడు రెట్లు అదనంగా నాలుగు వేల చదరపు కిలోమీటర్లలో చొచ్చుకు పోయింది. ప్రారంభంలో చేసిన పొరపాట్లను పునరావృతం కానివ్వకుండా వేగాన్ని తగ్గించి మెల్లమెల్లగా ముందుకు పోతున్నది. ఉక్రెయిన్ మౌలిక సదుపాయాలను ధ్వంసం చేస్తున్నది. గతేడాది ఎదురు దాడులకు దిగిన ఉక్రెయిన్ తన సరిహద్దు సమీపంలోని రష్యాలో కొంత ప్రాంతాన్ని ఆక్రమించి అక్కడే తిష్టవేసింది. మూడు సంవత్సరాల రష్యా దాడులకు కొత్త సంవత్సరంలో స్వస్తి పలుకుతామని, ఈ ఏడాది తమదే అని జెలెన్స్కీ నూతన సంవత్సర సందేశంలో పేర్కొన్నాడు. ఈ పోరులో అమెరికా తమవెంటే ఉందన్నాడు. తమ భూభాగం నుంచి గ్యాస్ రవాణా నిలిపివేత రష్యాకు అతి పెద్ద ఓటమి అన్నాడు. నూతన సంవత్సరంలో పరిస్థితి నాటకీయంగా మారిపోతుందని పుతిన్ వార్షిక విలేకర్ల సమావేశంలో చెప్పాడు. మూడేళ్ల పోరులో పది లక్షల మంది మరణించటం లేదా గాయపడినట్లు, ఉక్రెయిన్ ఓటమి బాటలో ఉన్నట్లు బిబిసి పేర్కొన్నది. ప్రమాణ స్వీకారం చేసిన 24 గంటల్లోనే యుద్ధాన్ని ముగిస్తానని ట్రంప్ చేసిన ప్రకటన మీద సందేహాలు తలెత్తుతున్నాయి. అయితే పైకి ఏం మాట్లాడినప్పటికీ విశ్వసనీయత లేని ట్రంప్ మాటలను ఎవరూ పెద్దగా పట్టించుకోవటం లేదు. తొలి విడత అధికారానికి వచ్చినపుడు నాటో ఏర్పాటుతో లబ్ధి పొందుతున్నది ఐరోపా కాగా దాని కోసం తామెందుకు ఖర్చు పెట్టాలంటూ ట్రంప్ మాట్లాడిన సంగతి తెలిసిందే. ట్రంప్ తీరుతో గడచిన నాలుగు సంవత్సరాలుగా అనేక దేశాలు నాటో కూటమితో పాటు తమ మిలిటరీ బడ్జెట్‌లను కూడా గణనీయంగా పెంచాయి. ఉక్రెయిన్ పోరులో ఉక్రెయిన్ ఓడిపోతే ఐరోపా దేశాలకు రష్యా నుంచి ముప్పు పెరుగుతుందని అమెరికా భయపెడుతోంది. అయితే అవగాహనకు విరుద్ధంగా ఉక్రెయిన్‌కు నాటో తీర్థమిచ్చి తమ ముంగిట్లోకి ముప్పు తెస్తున్నారనే కారణంతోనే అడ్డుకొనేందుకు పుతిన్ సర్కార్ మిలిటరీ చర్యకు పూనుకున్న సంగతి తెలిసిందే. ట్రంప్ పైకి ఏమి చెప్పినప్పటికీ నాటో రంగం నుంచి అమెరికా తగ్గి ఐరోపాను స్వతంత్రంగా పని చేయనివ్వటం కలలో మాట. పశ్చిమ దేశాలను ఎదుర్కొనేందుకు రష్యా-చైనా మరింత సన్నిహితం అవుతున్నాయి. ఈ పూర్వ రంగంలో ట్రంప్ యంత్రాంగం అదిరించి బెదిరించి ఐరోపాను తమ పరిధిలో ఉంచుకుంటుంది తప్ప వదలి వేసే అవకాశమే లేదు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

ఎన్నికల నిబంధనల ఉల్లంఘన కేసు

మాజీ మంత్రి మహీధర్‌రెడ్డికి ఊరట

ప్రజాశక్తి, అమరావతి

మాజీ మంత్రి మానుగుంట మహీధరరెడ్డికి హైకోర్టు ఊరటనిచ్చింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి కందుకూరు పట్టణ పోలీసులు నమోదు చేసిన కేసులో 12 వారాల పాటు తదుపరి చర్యలను నిలుపుదల చేసింది. విచారణను ఫిబ్రవరి 25కి వాయిదా వేస్తూ జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల వేళ ఓటర్లను ప్రలోభపెట్టే ప్రకటనలు చేశారని రిటర్నింగ్ అధికారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పిటిషనర్ గుడికి వెళ్లినప్పుడు ఆ ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించిన విషయాన్ని చెప్పారని, ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు రాదని న్యాయవాది వాదించారు.

విజయ్‌కుమార్‌రెడ్డి పిటిషన్ 6కి వాయిదా

ప్రజాశక్తి, అమరావతి

ప్రభుత్వ ప్రకటనలు ఒక పత్రికకు ఇచ్చి పక్షపాతంగా వ్యవహరించారంటూ సమాచార, పౌర సంబంధాల శాఖ గత కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్‌రెడ్డిపై నమోదు చేసిన కేసుల వివరాలు అందజేయాలని ఏసీబీని హైకోర్టు ఆదేశించింది. ఏసీబీ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ విజయ్‌కుమార్‌రెడ్డి వేసిన పిటిషన్‌పై తదుపరి విచారణను ఈ నెల 6కి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రకటించారు. పిటిషనర్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వాలని న్యాయవాది కోరారు. పోలీసులు పెట్టిన కేసులో పూర్తి వివరాలను తమ ముందుంచాలని ఏసీబీని ఆదేశించిన హైకోర్టు, విచారణను 6వ తేదీకి వాయిదా వేసింది.

సోషల్ మీడియాలో పోస్టులపై కేసు

బోరుగడ్డ అనిల్‌కు ఎదురుదెబ్బ

ప్రజాశక్తి, అమరావతి

సోషల్ మీడియాలో పోస్టుల కేసులో బోరుగడ్డ అనిల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. సోషల్ మీడియా పోస్టుల్లో అనిల్ వాడిన పదజాలంపై ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. ఇలాంటి వాళ్లను ఉపేక్షించడానికి వీల్లేదని, క్షమించడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. అసభ్య పోస్టులను పెట్టడమే పనిగా పెట్టుకున్నట్లు ఉన్నారని మండిపడింది. ఇలాంటి వాళ్లు జైళ్లల్లో ఉంటే తప్పులేదని జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లపై బోరుగడ్డ అనిల్ అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టారంటూ దాఖలైన కేసులో బెయిల్ మంజూరు చేయాలని అనిల్ పిటిషన్ వేశారు. పిటిషనర్ తరఫు న్యాయవాది అభయ్ సిద్దాంత్ ఎం. వాదిస్తూ, బీఎన్ఎస్ సెక్షన్ 111 మినహా మిగిలిన ఇతర సెక్షన్లు ఏడేళ్లలోపు శిక్షలు పడేవని చెప్పారు. సోషల్ మీడియాలో పోస్టులకు సెక్షన్ 111 వర్తించదన్నారు. ఏపీపీ సాయి రోహిత్ ప్రతివాదన చేస్తూ, పిటిషనర్ సెక్షన్ 111 వర్తిస్తుందన్నారు.. వాదనల తర్వాత అనిల్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది.

సిసిఐపై కేసు

ప్రజాశక్తి, అమరావతి

కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు వ్యతిరేకంగా రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసి జిన్నింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియ చేపట్టడుతోందంటూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గుంటూరుకి చెందిన సాయి ఆదిత్య పిటిషన్ వేశారు. వివరాలు అందజేయాలని జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఆదేశించారు. విచారణను ఈ నెల 6కి వాయిదా వేశారు. సిసిఐ రైతుల నుంచి కొనుగోలు చేసిన ముడిపత్తిని మాత్రమే విక్రయించాలని, కేంద్రం నుంచి అనుమతి తీసుకున్నాకే జిన్నింగ్ చేయాలని పిటిషనర్ వాదన.

గోవాలో 'గూడెం' యువకుడి హత్య

- ఫుడ్ ఆర్డర్ విషయంలో హోటల్ నిర్వాహకులతో గొడవ
- వెదురు కర్రలతో దాడి చేయడంతో మృతి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గోవా పర్యటనకు వెళ్లిన పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మృతుని బంధువులు తెలిపిన వివరాల మేరకు.. తాడేపల్లిగూడెం పట్టణంలోని ఆరో వార్డుకు చెందిన ఐదుగురు యువకులు, ముగ్గురు యువతులు కలిసి నూతన సంవత్సర వేడుకలకు గోవా వెళ్లారు. గత నెల 31 రాత్రి ఒంటిగంట సమయంలో కలంగుట్ బీచ్‌లోని ఓ రెస్టారెంట్‌లో ఫుడ్ ఆర్డర్ విషయంలో రెస్టారెంట్ నిర్వాహకులతో వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో హోటల్ యజమాని కొడుకు గూడెం యువతి పట్ల అసభ్యకరంగా మాట్లాడడంతో బొల్లా రవితేజ (28), ఇతర మిత్రులు ప్రతిఘటించారు. ఆ సమయంలో రెస్టారెంట్‌లో పని చేస్తున్న ఓ వ్యక్తి రవితేజపై దాడి చేశాడు. వెదురు కర్రలతో తలపై బాదడంతో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తుండగా రవితేజ మృతి చెందారు. అవివాహితుడైన రవితేజ హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ జాబ్ కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నారు. గోవాలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని విమానంలో విజయవాడకు, అక్కడి నుంచి తాడేపల్లిగూడెం తీసుకువచ్చారు. సాయంకాలం అంత్యక్రియలు నిర్వహించారు.

ఫారం నెం.3
[రెగ్యులేషన్ చూడండి - 15 (1) (a)]

డెట్స్ రికవరీ అప్పిలేట్ ట్రిబ్యునల్, కోల్‌కత్తా వారి సమక్షంలో
9, పాత పోస్టాఫీసు వీధి, 7వ అంతస్తు, కోల్‌కత్తా-700001

DY. No. 940 OF 2024

కెనరా బ్యాంక్ అధీకృత అధికారి ......దరఖాస్తుదారు
వర్సెస్
శ్రీ విజయశ్రీ లక్ష్మి ట్రేడర్స్ & ఇతరులు ......ప్రతివాదులు

1. M/s. శ్రీ విజయశ్రీ లక్ష్మి ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీ కోట రామ కోటి రెడ్డి, తండ్రి: లేటు శేషి రెడ్డి, డి.నెం. 3-29-13/A, కృష్ణానగర్, 4వ లేను, గుంటూరు-522006. (ప్రతివాది నెం.1).

సమన్లు

1. గౌరవనీయ ప్రిసైడింగ్ ఆఫీసర్, డిఆర్‌టి విశాఖపట్నం వారు జారీచేసిన ఉత్తర్వులకు వ్యతిరేకంగా, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002, సెక్షన్ 18 క్రింద ధరఖాస్తుదారు ఇతర పరిహారాలతో పాటు అందులో తెలిపిన మొత్తాన్ని రాబట్టుకొనేందుకు ధరఖాస్తు చేశారు. సదరు క్లెయిమ్‌కు జవాబు ఇచ్చేందుకు తేది. 09.01.2025 ఉ. 10.30 గం॥లకు లేదా ట్రిబ్యునల్ సౌకర్యార్థం ఆ తర్వాత వచ్చే అట్టి సమయానికి ఈ ట్రిబ్యునల్ సమక్షంలో హాజరై వ్రాతకపూర్వక స్టేట్‌మెంట్ దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా అదేశించుచున్నారు.
2. మీరు ఏవైనా డాక్యుమెంట్లను దాఖలు చేయదలిస్తే మీరు వ్రాతపూర్వక స్టేట్‌మెంతో పాటు ఒక లిస్ట్‌తో దానిని దాఖలు చేయవచ్చును.
3. మీరు స్వయంగా లేదా తగువిధంగా సూచించిన ప్లీడర్/అడ్వకేట్ ద్వారా ట్రిబ్యునల్ సమక్షంలో మీరు హాజరయ్యేటప్పుడు మీ నమోదిత చిరునామా మరియు హాజరు మెమోను దాఖలు చేయవలెను.
4. ఇందులో తెలిపిన తేదీన మీరు హాజరగుటలో విఫలమైతే, ప్రొసీడింగ్ మీ గైర్హాజరులో విచారించబడి నిర్ధారించబడునని గమనించవలెను.

నాచే స్వయంగా, ఈ ట్రిబ్యునల్ సీల్‌తో 10, డిసెంబర్ 2024న ఇవ్వబడినది.

సమన్లు జారీ చేసిన
అధీకృత అధికారి వారి సంతకం

నాటక రంగ పునరుజ్జీవనానికి కృషి

- ఎపి నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ
- మూర్తి, అప్పాజోస్యులకు సత్కారం

ఆచార్య డిఎస్ఎన్ మూర్తి, సత్కరిస్తున్న గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ

నాటక రంగానికి పునర్జీవం పోసేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎపి నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకష్ణ అన్నారు. విజయవాడ గవర్నరుపేటలోని మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఆడిటోరియంలో అప్పాజోస్యుల విష్ణుభొట్ల కందాళం ఫౌండేషన్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యాన గురువారం జాతీయస్థాయి కథా నాటికల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 5వ తేదీ వరకు జరిగే ఈ నాటిక పోటీలకు గోపాలకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటక రంగ కళలను ప్రోత్సహించటానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఈ రంగానికి పూర్వవైభవం తీసుకురావటానికి అజో-విభొ-కందాళం ఫౌండేషన్ ట్రస్టులు చేస్తున్న సేవలు అభినందనీయమని తెలిపారు. సాహిత్య, కళా, సాంస్కృతిక, సాంఘిక సేవా రంగాల్లో చేస్తున్న కషి హర్షణీయమన్నారు. అజో-విభొ-కందాళం ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ (యుఎస్ఎ), చైర్మన్ డాక్టర్ కె.వి.రామానుజాచార్యులు, ప్రముఖ నాటక రచయిత పి.మృత్యుంజయరావు, శారదా కళాసమితి అధ్యక్షులు డోగిపర్తి శంకరరావు, కళావిపంచి గౌరవాధ్యక్షులు రామరాజు శ్రీనివాసరావు, జాషువా సాంస్కృతిక వేదిక కన్వీనర్ గుండు నారాయణరావు, తెలుగు డ్రామా నిర్వాహకులు డి.రామకోటేశ్వరరావు, రంగస్థల ప్రముఖులు, సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ వైఎస్ కృష్ణేశ్వరరావు, ఉత్సవాల ప్రిన్సిపల్, కోఆర్డినేటర్ జి.వి.రంగారెడ్డి, ప్రతినిధి చలసాని కష్ణప్రసాద్, ప్రముఖ నాటక రచయిత, విశ్లేషకులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు మాట్లాడారు. ముందుగా బాలోత్సవ్ భవన్‌లో తెలుగు డ్రామా గ్రూప్, కళా విపంచి నిర్వాహకులు డి.రామకోటేశ్వరరావు, బొప్పన నరసింహారావు (బుజ్జి) నిర్వహణలో ఆచార్య డిఎస్ఎన్ మూర్తి, ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణలకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు.

అన్నదాత, వేదాంతం, వర్క్‌ఫ్రం హోం నాటికల ప్రదర్శన

మొదటి రోజున హైదరాబాద్‌కు చెందిన కళాంజలి కళాకారులు 'అన్నదాత' నాటికను ప్రదర్శించారు. మూలకథ నాటకీకరణ వల్లూరు శివప్రసాద్, దర్శకత్వం కొల్లా రాధాకష్ణ వహించారు. రాత్రి 8 గంటలకు రెండో ప్రదర్శనగా వేదాంతం నాటిక ప్రదర్శితమైంది. కీర్తిశేషులు చలం మూలకథ, నాటకీకరణ మార్గశీర్ష పి.ముత్యాలరావు దర్శకత్వం వహించారు. అనకాపల్లికి చెందిన షిరిడీ సాయి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు దీనిని ప్రదర్శించారు. మూడో ప్రదర్శనగా రాత్రి 9.30 గంటలకు 'వర్క్‌ఫ్రం హోం' ప్రదర్శితమైంది. మూలకథ కెకె భాగ్యలక్ష్మి, నాటకీకరణ అద్దేపల్లి భరత్‌కుమార్, దర్శకత్వం డి.మహేంద్ర వహించారు.

అదానిపై చర్య తీసుకునే ధైర్యం ఉందా?

- చంద్రబాబుకు అంబటి రాంబాబు సవాల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

విద్యుత్ ఒప్పందాల్లో తప్పులు జరగడానికి కారకుడైన పారిశ్రామికవేత్త అదానిపై చర్య తీసుకునే ధైర్యం చంద్రబాబుకు ఉందా? అని మాజీ మంత్రి అంబటి రాంబాబు ప్రశ్నించారు. గుంటూరులోని తన కార్యాలయంలో ఆయన గురువారం మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ ఒప్పందాల్లో జగన్ లడ్డూలాగా దొరికాడని, అయినా తాను కక్షసాధింపు చర్యలకు వెళ్లడంలేదని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ ఒప్పందం వెనుక అసలు సూత్రదారి అదాని ఉండటం వల్ల ఆయనపై చర్య తీసుకోలేక జగన్‌పై నెపం మోపుతున్నారని ఎద్దేవా చేశారు. సెకీ ఒప్పందంలో జగన్ పాత్ర ఏమీ లేదని తెలిసే చంద్రబాబు మౌనంగా ఉన్నారన్నారు. చంద్రబాబు ఆరు నెలల కాలంలో కక్ష సాధింపు చర్యలు తప్ప అభివృద్ధి ఏమీ లేదని విమర్శించారు. వైసిపికి చెందిన అనేక మందిపై కక్ష సాధింపు చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. రెడ్‌బుక్‌లో పేర్లు రాసుకుని వారిని అరెస్టు చేయడమే తప్ప సాధించింది శూన్యమని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయలేకపోయారని విమర్శించారు. మాజీ మంత్రి పేర్ని నానిపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

బోధనలో నూతన విధానాలు

- సమగ్రశిక్షా డైరెక్టర్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యార్థుల అకడమిక్ ప్రావీణ్యతను పెంచేందుకు కొత్త బోధన విధానాలను ఉపాధ్యాయులు ఆచరణలోకి తీసుకురావాలని కెజిబివి ఉపాధ్యాయులను సమగ్రశిక్షా డైరెక్టర్ బి శ్రీనివాసరావు సూచించారు. బోధన అనేది ఒక వృత్తి కాదని, భవిష్యత్తు తరాల కోసం స్ఫూర్తినిచ్చి, మార్గదర్శకత్వం అందించే బాధ్యత అని అన్నారు. కెజిబివి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమాన్ని విజయవాడలోని లయోలా కళాశాల ప్రాంగణంలో గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బాలికల జీవితాలను తీర్చిదిద్దడంలో కెజిబివి టీచర్లు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. నాణ్యమైన బోధన, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. విద్యార్థినుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆరోగ్యం, సంక్షేమం, విద్యకు సమన్వయంగా ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కెజిబివి కార్యదర్శి డి దేవానందరెడ్డి, ఇగ్నస్ పహల్ వ్యవస్థాపకులు సుబీర్ శుక్లా, ఎల్ఎఫ్ఇ ప్రతినిధి సిద్ధేశ్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో తైక్వాండో అకాడమీ

మంత్రిని కోరిన అంతర్జాతీయ క్రీడాకారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలో తైక్వాండో అకాడమీ పెడితే తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని పోలాండ్ క్రీడాకారిణి పెట్రూష, జాతీయ క్రీడాకారుడు శివం తెలిపారు. గురువారం ఉదయం వెలగపూడి సచివాలయంలో ప్రవాసాంధ్ర సాధికారశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ను వారు కలిశారు. ఎన్ఆర్ఐ విభాగం టిడిపి కో-ఆర్డినేటర్ రాజశేఖర్, అమెరికా, ఆస్ట్రేలియా, పోలాండ్, యుకె నుండి సుమారు 20 మంది ప్రవాసాంధ్రులు కూడా మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తైక్వాండో క్రీడాకారులు మాట్లాడుతూ.. అమరావతిలో అకాడమీ పెడితే 2028లో జరిగే ఒలింపిక్స్‌కు ఎపి నుంచి అంతర్జాతీయ తైక్వాండో క్రీడాకారులను తయారు చేస్తామని తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. అలాగే ప్రవాసాంధ్రుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. అన్ని దేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులను కలిపే విధంగా ఒక గ్రూపును ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎన్ఆర్ఐలకు సహాయ, సహకారాలు అందించేందుకు ప్రభుత్వం తరపున అధికారులను నియమిస్తామన్నారు.



బాధిత రైతులతో మాట్లాడుతున్న రైతు, కౌలురైతు సంఘం నాయకులు

పంట సొమ్ముతో గుమస్తా పరారీ

- కోల్డ్ స్టోరేజీలోని రూ.5 కోట్లకుపైగా శనగ పంట విక్రయం
- రైతు, కౌలు రైతు సంఘం నాయకుల ఎదుట రైతుల ఆవేదన

ప్రజాశక్తి- చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

కోల్డ్ స్టోరేజీలో తాము దాచుకున్న రూ.5 కోట్లకుపైగా శనగలను అందులోని ఉద్యోగి అమ్ముకుని పరారయ్యారని రైతు సంఘం నాయకుల వద్ద బాధిత రైతులు వాపోయారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని సిపిఎం కార్యాలయంలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ, సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, సిఐటియు బాపట్ల జిల్లా ఉపాధ్యక్షులు బి.హనుమంతరావును గురువారం కలిసి తమకు జరిగిన నష్టాన్ని వివరించారు. ఈ సందర్భంగా వి.కృష్ణయ్య, వై.రాధాకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ.. చిలకలూరిపేట కోల్డ్ స్టోరేజీలో రైతులు పంటను దాచుకోగా అందులో గుమస్తాగా పని చేస్తున్న పట్టణంలోని ఎన్‌టిఆర్ కాలనీకి చెందిన నాగరాజు సుమారు 70 మంది రైతులకు చెందిన శనగ పంటను వారికి తెలియకుండా అమ్ముకున్నాడని తెలిపారు. ఇది జరిగి మూడు నెలలైందని, బాధిత రైతులు మంత్రులు నారా లోకేష్, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యేలు, పోలీసులను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించినా ఇప్పటికీ పట్టించుకోలేదన్నారు. చిలకలూరిపేట, యద్దనపూడి, మార్టూరు తదితర మండలాల్లో సుమారు ఏడెనిమిది గ్రామాల రైతులు మోసపోయారని తెలిపారు. దీనిపై 6, 7 తేదీల్లో సిఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రిని కలుస్తామని, వారిచ్చే సమాధానంపై రైతులతో చర్చించి అనంతరం దీనిపై కార్యాచరణ చేపడతామని తెలిపారు.

జెసి ట్రావెల్స్ బస్సు దగ్ధం

- బస్సుపై తెగిపడిన విద్యుత్ వైర్లు

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

అనంతపురం ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో దివాకర్ ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సు దగ్ధమైంది. విద్యుత్ వైర్లు తెగిపడడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది తెలిపిన సమాచారం మేరకు.. అనంతపురం ఆర్‌టిసి బస్టాండుకు సమీపంలో జెసి దివాకర్ ట్రావెల్స్‌కు సంబంధించిన ట్రాన్స్‌పోర్టు కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం ఎదురుగా వారికి సంబంధించిన స్థలంలో కొన్ని బస్సులను నిలిపి ఉంచారు. గురువారం తెల్లవారుజామున 11 కెవి విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తెగి ఓ బస్సు మీద పడ్డాయి. దీంతో, మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

రాష్ట్రాభివృద్ధికి కలిసి పనిచేద్దాం : మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రాభివృద్ధికి సిఎం చంద్రబాబు నేతృత్వంలో కలిసి పనిచేద్దామని ఉద్యోగులకు రాష్ట్ర బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత పిలుపునిచ్చారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రి సవితను గురువారం కలిసిన పలు ఉద్యోగ సంఘాల నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో అమరావతి జెఎసి ప్రతినిధులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఇతర ఉద్యోగ సంఘాల నాయకులు ఉన్నారు. అలాగే రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, చేనేత జౌళిశాఖ ముఖ్యకార్యదర్శి కె సునీత, కమిషనర్ రేఖారాణి, బిసి సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి, బిసి కార్పొరేషన్ డైరెక్టర్ మల్లికార్జున తదితరులు మంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు.

రజకులకు అండగా ఉంటాం

- రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రజకులు అభివృద్ధి బాటలో పయనించేలా వారికి అండగా ఉంటామని ఎపి రజక సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సి సావిత్రి తెలిపారు. గొల్లపూడిలోని బిసి భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన ఆ సంస్థ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ, అభివృద్ధి ఫలాలు రజకులకు అందించి వారికి సమాజంలో ఒక గుర్తింపు తీసుకొస్తామన్నారు. రాష్ట్రంలో ఉన్న అన్ని బిసి సంక్షేమ వసతి గృహాల్లో దుస్తులు ఉతికే పనిని రజకులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రజకుల స్థలాల్లో లాండ్రీ షాపులు పెట్టుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. రజక కుల వృత్తిదారులకు పనిముట్లు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ.. 2014-19 మధ్య రజకులకు రజక భవనాలతోపాటు అనేక సంక్షేమ ఫలాలు సిఎం చంద్రబాబు అందించారన్నారు. బడ్జెట్‌లో బిసిలకు రూ.39 వేలకోట్లు కేటాయించారన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి కూడా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రజక సంక్షేమ, అభివృద్ధి సంస్థ అధికారులు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కోళ్ల లారీ బోల్తా

- 500 కోళ్లు మృతి

ప్రజాశక్తి-బెలుగుప్ప

అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం దుద్దేకుంట సమీపంలో గురువారం కోళ్ల లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 500 కోళ్లు మతి చెందాయి. లారీ డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా కల్యాణదుర్గం నుంచి గుంటకల్లుకు కోళ్ల లోడుతో లారీ వెళ్తుండగా దుద్దేకుంట గ్రామ సమీపాన అదుపుతప్పి బోల్తా పడడంతో లారీలో తరలిస్తున్న 500 కోళ్లు మృతి చెందాయి. స్థానికులు స్పందించి లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లను చికిత్స నిమిత్తం కల్యాణదుర్గం ఆస్పత్రికి తరలించారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
మైలవరం బ్రాంచ్ (6302)
మైలవరం, కృష్ణా జిల్లా-521230.
ఫోన్: 08659-222225, 8331018962

సెక్షన్ 13(4) **స్వాధీనత ప్రకటన** (స్థిరాస్తి కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం 54, 2002) ప్రకారం **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు సెక్షన్ 13 (12) కు అనుబంధమైన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని 3వ నిబంధన ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించి **ఋణగ్రహీత/తనఖాదారు: షేక్ షహాన బేగం (ఇక మీదట "ఋణగ్రహీత" గా రిఫర్ చేయబడును) మరియు హామీదారు: షేక్ సుభాని (ఇక మీదట "హామీదారు/తనఖాదారు" గా రిఫర్ చేయబడును)** వారిని నోటీసులో ఉదహరించబడిన బకాయిసొమ్ము **రూ.3,83,341.00 (అక్షరాల మూడు లక్షల ఎనభై మూడు వేల మూడు వందల నలభై ఒక్క రూపాయలు)** మొత్తంను నోటీస్ అందిన తేది నుండి 60 రోజుల లోపు చెల్లించవలసినదిగా కోరుతూ తేది **29.08.2024** న **డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.**

ఋణగ్రహీత సదరు బకాయిసొమ్మును చెల్లించుటలో విఫలమైనందున, దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని సెక్షన్ 13(4) కు అనుబంధమైన సదరు రూల్ 8 & 9 ప్రకారము సంక్రమించిన అధికారములను వినియోగిస్తూ దిగువ ఆస్తిని **31-12-2024వ తేదీన స్వాధీనపరచుకున్నారని** ఋణగ్రహీత, హామీదారు మరియు ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ప్రత్యేకముగా ఋణగ్రహీత, హామీదారు మరియు సాధారణ ప్రజానీకమును హెచ్చరించునది ఏమనగా ఈ ఆస్తి విషయమై ఎవ్వరూ ఎటువంటి లావాదేవీలు జరుపరాదని, ఒకవేళ లావాదేవీలు జరిపిన అవి **కెనరా బ్యాంక్, మైలవరం బ్రాంచ్** వారికి తేది 30.12.2024 నాటికి చెల్లించవలసిన బకాయి **రూ. 3,58,889.00/-** వడ్డీ కలిపి మొత్తమునకు లోబడివుంటాయి.

సెక్షన్ 13(8) చట్ట ప్రకారము ఋణగ్రహీత'లు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది.

స్థిరాస్తి వివరములు:
ఎన్‌టిఆర్ జిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రీ, మైలవరం మండలం, మైలవరం గ్రామం, సర్వే నెం. 146/1, డోర్ నెం. 3-5 కలిగిన మొత్తం **88 చ॥గ॥ల ఇంటి స్థలం మరియు అందులోని ఆర్‌సిసి బిల్డింగ్. హద్దులు: తూర్పు:** షేక్ కసీం సాహెబ్, తండ్రి: మస్తాన్ సాహెబ్ ఇంటి గోడ, **దక్షిణం:** గౌండి సుబ్బారావు స్థలం, **పడమర:** షేక్ గలీబ్ సాహెబ్ స్థలం, **ఉత్తరం:** 8 అ॥ వెడల్పు రోడ్డు మరియు షేక్ సిలార్ సాహెబ్ స్థలం.

తేది: 31-12-2024
ప్రదేశం: మైలవరం
సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

HAVE A HOME A CAN FIN HOME
CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ◆ DEPOSITS Translating Dreams into Reality

కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్
(CIN: L85110KA1987PLC008699)
76-14-95/11, 1వ అంతస్థు, ఆర్‌టిసి వర్క్‌షాప్ రోడ్, భవానీపురం, గొల్లపూడి, విజయవాడ-520012.
ఫోన్: 0866-2975223, 7625079223.
Email: gollapudi@canfinhomes.com

డిమాండ్ నోటీసు
సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు (నెం.54 ఆఫ్ 2002)

దిగువ వారికి
1. యర్రంరెడ్డి పెద్ద సైదా రెడ్డి (ఋణగ్రహీత-1)
లేటు యర్రంరెడ్డి అశోక్ రెడ్డి మరియు వారి చట్టబద్ధ వారసులు, ఫ్లాట్ నెం. SF-1, 2వ అంతస్థు, గొల్లాస్ రెసిడెన్సీ, కానూరు, వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీ, కృష్ణా జిల్లా-520007.

మీలో **లేటు యర్రంరెడ్డి అశోక్ రెడ్డి** ఈ దిగువ ఉదహరించిన ఆస్తులను తనఖా ఉంచి మా **గొల్లపూడి** బ్రాంచి నుండి **గృహఋణ** సౌకర్యాన్ని మీలో నెం.1 పొందియున్నారు. సదరు ఋణఖాతాలో **తేది.02.01.2025** నాటికి **రూ.20,07,359/- (అక్షరాల ఇరవై లక్షల ఏడు వేల మూడు వందల యాభై తొమ్మిది రూపాయలు మాత్రమే)** మరియు వడ్డీతో మరియు సదరు బకాయి మొత్తంపై అంగీకరించిన కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ + ఇతర ఖర్చులు మరియు బ్యాంకు ఛార్జీలకు మీరు **కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్**కు బకాయి ఉన్నారు.

తనఖా పెట్టిన స్థిరాస్తి వివరములు
ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రెవెన్యూ డివిజన్, ఆర్.ఎస్.నెం.185, యు.డి.ఎ.ఎల్.పి నెం.70/1981, సమీప డి.నెం.18-729 వద్ద గల కానూరు గ్రామ పరిధిలో విస్తీర్ణం 145-2 చదరపు గజాలు లేదా 121-40 చదరపు మీటర్లతో గల గొల్లా రెసిడెన్సీ అనే అపార్ట్‌మెంట్, రెండవ అంతస్తు, ఫ్లాట్ నెం.ఎస్.ఎఫ్-1నకు గల **సరిహద్దులు: తూర్పు:** దొడ్డపనేని రమాదేవి గారి స్థలం-అ॥22.0, **దక్షిణం:** ముప్పవరపు నాగేశ్వరరావు గారి ఆస్తి-అ॥59.5, **పడమర:** 33.0 అ॥ల వెడల్పు పంచాయతీ రహదారి-అ॥22.0, **ఉత్తరం:** బొప్పన అరుణ కుమారి గారి ఆస్తి-అ॥59.5 24-00 చదరపు గజాలు లేదా చదరపు మీటర్ల అవిభాజ్యపు అనిర్ధిష్టపు వాటాతో విస్తీర్ణం 600 చదరపు అడుగులు, కామన్ ఏరియా 30 చదరపు అడుగులు, కార్ పార్కింగ్ 100 చదరపు అడుగులతో కూడిన గొల్లా రెసిడెన్సీ, రెండవ అంతస్తు, ఫ్లాట్ నెం:ఎస్.ఎఫ్-1 మరియు అన్ని హక్కులు, సౌకర్యాలు, ఈజ్‌మెంట్ హక్కులతో కలిపి **సరిహద్దులు: తూర్పు:** మెట్లు, లిఫ్ట్ మరియు కామన్ కారిడార్, **దక్షిణం:** ఓపెన్ టు స్కై, **పడమర:** ఓపెన్ టు స్కై, **ఉత్తరం:** ఓపెన్ టు స్కై.

పైన పేర్కొనబడిన SARFAESI చట్టం 2002లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును బ్యాంకు మీకు జారీచేసినది. దిగువ సంతకందారుడు సదరు నోటీసులను ఋణగ్రహీత/లు చివరిగా తెలిపిన చిరునామాల ఆవరణల యందు అతికించడమైనది. అందువల్ల ఈ పత్రికా ప్రకటన ఇవ్వబడినది. మా జారీ షరతులు మరియు నిబంధనలు పాటించుటలో మీరు విఫలమైనందున మీ ఖాతా క్రమము తప్పి NHB మార్గదర్శకాల ప్రకారం **ది.29.12.2024 నాటి నుండి ఎన్.పి.ఏగా వర్గీకరించబడినది.** ఈ నోటీసు ప్రకటన తేది నుండి కాంట్రాక్చువల్ రేటు ప్రకారం **తేది.02.01.2025** నుండి వడ్డీ+ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో కలిపి పైన తెలిపిన సదరు మొత్తమును 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్మల్ని కోరడమైనది. లేనియెడల ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా పైన తెలిపిన సెక్యూరిటీ పైన SARFAESI చట్టంలోని నిబంధనలు అమలు చేసేందుకు చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటర్ అగు దిగువ సంతకందారు సంసిద్ధులైతారు. ఇంకా తెలియజేయునది ఏమనగా ఋణగ్రహీతలు/హామీదారులు సెక్యూర్డు ఆస్తుల విమోచనం కొరకు గడువు లభ్యతపై సదరు చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8)లోని నిబంధనలు గమనించగలరు.

తేది : 02.01.2025
ప్రదేశం : గొల్లపూడి
సం/-అధీకృత అధికారి, కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

यूनियन बैंक ऑफ इंडिया యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఎ.పి. ఫోన్: 0891-2537792. ఇ-మెయిల్: ubin0817295@unionbankofindia.bank

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూలు 6(2)/8(6) క్రింద అమ్మకం గురించి (30 రోజుల నోటీసు) తెలియచేస్తూ ఋణగ్రహీతకు నోటీసు

టు:
(1). M/s. **సయినార్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి కలగర శ్రీదేవి మరియు డైరెక్టర్ శ్రీ సూర వెంకట శ్రీనివాసరావు, నమోదిత చిరునామా/ఆఫీస్ చిరునామా:** ఫ్లాట్ నెం - 110, మొదటి అంతస్తు, వెస్ట్ వింగ్, యస్‌వియస్‌యస్ నివాస్, సిజెక్ కాలనీ, సనత్‌నగర్, హైదరాబాద్-500038. **ఫ్యాక్టరీ చిరునామా:** ప్లాట్ నెం-59ఇ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, పరవాడ, విశాఖపట్నం-531021. **(2). శ్రీమతి కలగర శ్రీదేవి (మేనేజింగ్ డైరెక్టర్ మరియు హామీదారు), నమోదిత చిరునామా/ఆఫీస్ చిరునామా:** ఫ్లాట్ నెం - 110, మొదటి అంతస్తు, వెస్ట్ వింగ్, యస్‌వియస్‌యస్ నివాస్, సిజెక్ కాలనీ, సనత్‌నగర్, హైదరాబాద్-500038. **ఫ్యాక్టరీ చిరునామా:** ప్లాట్ నెం-59ఇ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, పరవాడ, విశాఖపట్నం-531021. **నివాస చిరునామా:** విల్లా నెం -47, గ్రీన్ సిటీ వడ్లపూడి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530046. **(3). శ్రీ సూర వెంకట శ్రీనివాసరావు (డైరెక్టర్ మరియు హామీదారు), నమోదిత చిరునామా/ఆఫీస్ చిరునామా:** ఫ్లాట్ నెం - 110, మొదటి అంతస్తు, వెస్ట్ వింగ్, యస్‌వియస్‌యస్ నివాస్, సిజెక్ కాలనీ, సనత్‌నగర్, హైదరాబాద్-500038. **ఫ్యాక్టరీ చిరునామా:** ప్లాట్ నెం-59ఇ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, పరవాడ, విశాఖపట్నం-531021. **నివాస చిరునామా:** విల్లా నెం -47, గ్రీన్ సిటీ వడ్లపూడి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్-530046. **(4). శ్రీ హనుమంతు రాజేశ్వరరావు (డైరెక్టర్ మరియు హామీదారు), (శ్రీమతి హనుమంతు ఉషారాణి యొక్క చట్టబద్ధమైన వారసులు), నమోదిత చిరునామా/ఆఫీస్ చిరునామా:** ఫ్లాట్ నెం - 110, మొదటి అంతస్తు, వెస్ట్ వింగ్, యస్‌వియస్‌యస్ నివాస్, సిజెక్ కాలనీ, సనత్‌నగర్, హైదరాబాద్-500038. **ఫ్యాక్టరీ చిరునామా:** ప్లాట్ నెం-59ఇ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, పరవాడ, విశాఖపట్నం-531021. **నివాస చిరునామా:** డి.నెం. 59A-8/5/7-4, ఫ్లాట్ నెం - 93, మారుతి కో-ఆపరేటివ్ కాలనీ, విజయవాడ (అర్బన్), VJ పాలిటెక్నిక్ , కృష్ణా, ఆంధ్రప్రదేశ్-520008. **(5). శ్రీ శివ బాల బ్రహ్మ రెడ్డి భీమవరపు కోటిరెడ్డి (డైరెక్టర్ మరియు హామీదారు), నమోదిత చిరునామా/ఆఫీస్ చిరునామా:** ఫ్లాట్ నెం - 110, మొదటి అంతస్తు, వెస్ట్ వింగ్, యస్‌వియస్‌యస్ నివాస్, సిజెక్ కాలనీ, సనత్‌నగర్, హైదరాబాద్-500038. **ఫ్యాక్టరీ చిరునామా:** ప్లాట్ నెం-59ఇ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, పరవాడ, విశాఖపట్నం-531021. **నివాస చిరునామా: తండ్రి: బిహెచ్. కోటిరెడ్డి,** డి.నెం.33-22-1/3, ఫ్లాట్ నెం.201, సాయి కార్తీక్ హైట్స్, సీతారామపురం, మైసూర్ కేఫ్ ఎదురుగా, ఏలూరు రోడ్, విజయవాడ (అర్బన్), బకింగ్‌హామ్ పేట, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-520002. **(6). శ్రీమతి రాయవరపు బద్రి విశాలాక్షి (డైరెక్టర్ మరియు హామీదారు), నమోదిత చిరునామా/ఆఫీస్ చిరునామా:** ఫ్లాట్ నెం - 110, మొదటి అంతస్తు, వెస్ట్ వింగ్, యస్‌వియస్‌యస్ నివాస్, సిజెక్ కాలనీ, సనత్‌నగర్, హైదరాబాద్-500038. **ఫ్యాక్టరీ చిరునామా:** ప్లాట్ నెం-59ఇ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, పరవాడ, విశాఖపట్నం-531021. **నివాస చిరునామా:** డి.నెం: 7-9-5, సాంబ మూర్తి వీధి, రామారావు పేట, కాకినాడ (అర్బన్), గాంధీనగర్ (కాకినాడ), తూర్పు గోదావరి, ఆంధ్రప్రదేశ్-533004. **(7). శ్రీ. ప్రభాకర్ రావు గుత్తా** (Addl. **డైరెక్టర్), నమోదిత చిరునామా/ఆఫీస్ చిరునామా:** ఫ్లాట్ నెం - 110, మొదటి అంతస్తు, వెస్ట్ వింగ్, యస్‌వియస్‌యస్ నివాస్, సిజెక్ కాలనీ, సనత్‌నగర్, హైదరాబాద్-500038. **ఫ్యాక్టరీ చిరునామా:** ప్లాట్ నెం-59ఇ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, పరవాడ, విశాఖపట్నం-531021. **నివాస చిరునామా: తండ్రి: లేటు గుత్తా వెంకట రత్నం,** ఫ్లాట్ నెం - 137, బృందావన్ కాలనీ, నిజాంపేట్ రోడ్, JNTU దగ్గర, కూకట్‌పల్లి, హైదరాబాద్-500085. **(8). శ్రీ. దత్తాత్రేయ నాగిరెడ్డి (అడిషనల్ డైరెక్టర్), నమోదిత చిరునామా/ఆఫీస్ చిరునామా:** ఫ్లాట్ నెం - 110, మొదటి అంతస్తు, వెస్ట్ వింగ్, యస్‌వియస్‌యస్ నివాస్, సిజెక్ కాలనీ, సనత్‌నగర్, హైదరాబాద్-500038. **ఫ్యాక్టరీ చిరునామా:** ప్లాట్ నెం-59ఇ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, పరవాడ, విశాఖపట్నం-531021. **నివాస చిరునామా:** హెచ్.నెం. 26-95/3/2, బలరాంనగర్, సఫీల్‌గూడ, హైదరాబాద్, తెలంగాణ-500056. **(9). శ్రీమతి అన్నయపు జ్యోత్స్న** (శ్రీమతి. హనుమంతు ఉషారాణి యొక్క చట్టబద్ధమైన వారసురాలు) **నివాస చిరునామా:** D/o హనుమంతు రాజేశ్వరరావు & లేటు శ్రీమతి హెచ్. ఉషారాణి, 59A-8/5-7/4, మారుతి కో ఆపరేటివ్ కాలనీ, ఫన్‌టైమ్స్ రోడ్ దగ్గర, పటమట, విజయవాడ (అర్బన్), V J పాలిటెక్నిక్, కృష్ణా, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520008. **(10). శ్రీమతి హనుమంతు స్వప్న** (శ్రీమతి. హనుమంతు ఉషారాణి యొక్క చట్టబద్ధమైన వారసురాలు) **నివాస చిరునామా:** D/o హనుమంతు రాజేశ్వరరావు & లేటు శ్రీమతి హెచ్. ఉషారాణి, 59A-8/5-7/4, మారుతి కో ఆపరేటివ్ కాలనీ, ఫన్‌టైమ్స్ రోడ్ దగ్గర, పటమట, విజయవాడ (అర్బన్), V J పాలిటెక్నిక్, కృష్ణా, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520008.

డియర్ సార్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు,2002 క్రింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలిసిన బకాయి వసూలు కొరకు M/s. సయినార్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఆస్తులు అమ్మకం.

బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తములను నోటీసులో తెలిపిన నిర్ణీతకాలంలోగా చెల్లించవలసినదిగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క 13(2) సెక్షన్ క్రింద **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,** UMFB **గాజువాక బ్రాంచ్, విశాఖపట్నం** సెక్యూర్డ్ క్రెడిటార్ వారు మీకు డిమాండ్ నోటీసు తేది **04.10.2023**న జారీచేసినారు. అయినప్పటికీ మీరు సదరు నోటీసులో సూచించిన నిర్ణీత కాలంలోగా బకాయి మొత్తము చెల్లించుటలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు-2002 యొక్క 6/8వ రూలుతో కూడిన సదరు చట్టం 13(4) సెక్షన్ క్రింద సెక్యూర్డ్ ఆస్తులను అధీకృత అధికారి గారు స్వాధీన పరుచుకున్నారు. క్రమ సంఖ్య 1 లో పేర్కొన్న ఆస్తులను తేది **27.12.2024** న, క్రమ సంఖ్య 2 లో పేర్కొన్న ఆస్తులను తేది **11.12.2023** న స్వాధీన పరుచుకున్నారు.

సెక్యూర్డ్ ఆస్తులు స్వాధీన పరచుకున్న తరువాత కూడా మీరు బ్యాంకు యొక్క బకాయి మొత్తము చెల్లించలేదు. అందువలన ఈ నోటీసు స్వీకరణ తేదీ నుండి 30 రోజులు తరువాత బహిరంగ ఇ-వేలం నిర్వహించుట ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో దిగువ తెలిపిన ఆస్తులను విక్రయించవలసిన అవసరం ఉంటుంది. ఇ-వేలం తేదీ మరియు సమయంతో పాటు ఆస్తి యొక్క రిజర్వుధర మరియు ఇ-వేలం నిర్వహించు సర్వీస్ ప్రొవైడర్ వివరములు మీకు విడిగా తెలియజేయబడతాయి. కాబట్టి, అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా మీరు బ్యాంకు వారికి చెల్లించవలసిన బకాయి మొత్తముతో పాటు దానిపై తదుపరి వడ్డీ, బ్యాంకు వారికి సంభవించిన ఖర్చులు, ఛార్జీలు మరియు వ్యయాలు చెల్లించినచో, అస్తి అమ్మకంపైన తదుపరి చర్యలు చేపట్టబడవు మరియు సదరు చట్టం 13(8) సెక్షన్ పరిధిలో మీ తనఖా ఆస్తులను మీరు విడిపించుకోవచ్చును.

షెడ్యూలు ఆస్తుల వివరములు
1. హైపొథికేషన్ ఆఫ్ ప్లాంట్ & మెషినరీ మరియు స్టాక్.
2. తనఖా ఆస్తి (ప్రైమరీ): (లంకెలపాలెం ఎస్ఆర్ఓ, డాక్యుమెంట్ 1335/2011, తేదీ 25.05.2011, విశాఖపట్నం జిల్లా, పరవాడ మండలం, తానం గ్రామం, APIIC IALA గ్రామ పంచాయతీ, తానం రెవెన్యూ గ్రామంలోని M/s. సయినార్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రాతినిధ్యం వహిస్తున్న డైరెక్టర్‌కు చెందిన ఆస్తి). ఆంధ్రప్రదేశ్, విశాఖపట్నం జిల్లా, పరవాడ మండలం, తానం గ్రామం, సర్వే నెం. 55 భాగం, 179 & 180, మొత్తం 3.01 ఎకరాలు లేదా 12190.00 చ.మీ. విస్తీర్ణంలో ఉన్న **ప్లాట్ నెం. 59-E. హద్దులు:** తూర్పు: 22 మీ॥ వెడల్పు రోడ్డు, దక్షిణం: 22 మీ॥ వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం. 59-D, ఉత్తరం: ప్లాట్ నెం. 59-A.

తేది: 31.12.2024, స్థలం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

గ్రామాల్లో భూ సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. గ్రామాల్లో పొలం సరిహద్దులు, గట్ల సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా రెవెన్యూ అధికారులే గ్రామాలకు వచ్చి పరిష్కరించేందుకు ప్రభుత్వం సదస్సులు ఏర్పాటు చేస్తోందన్నారు. భూ యజమానులకు సంపూర్ణ హక్కు, అధికారం కల్పిస్తారన్నారు. రైతులు అర్జీలో పేర్కొన్న వివరాలపై రాష్ట్ర స్థాయిలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఉంటుందన్నారు. గతంలో భూముల రీ సర్వే అసంపూర్తిగా జరిగిందని, దీంతో రుణాల మంజూరుకు ఇబ్బందులు ఎదురయ్యేవన్నారు. ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. అర్హులకు కొత్తగా రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయడతో పాటు పక్కా ఇళ్లు నిర్మిస్తామన్నారు.

27 నుంచి జాతీయ లఘు చిత్రాల పండుగ

ప్రజాశక్తి-అనంతపురం

జనవరి 27 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు వారం రోజుల పాటు అనంతపురం వేదికగా 7వ అనంత జాతీయ లఘు చిత్రోత్సవ వేడుకలు జరగనున్నాయి. అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ విజన్ ఇండియా, జిఎంసి గ్యాలరీ ఫిల్మ్స్ సహాయ సహకారాలతో లఘు చిత్రాల పోటీలు, ప్రదర్శన జరగనుంది. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను అనంతపురం ఫిల్మ్ సొసైటీ కార్యాలయంలో గురువారం విడుదల చేశారు. జిఎంసి గ్యాలరీ ఫిల్మ్స్ అధినేత సురేష్, 'ప్రాక్సీ ఆఫ్' అధినేత ముడార్ సుధీర్, డిస్కవరీ అనంతపురం అనిల్ కుమార్, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ మురళీధర్ రావు, ఎన్ఆర్ఐ కాలేజ్ అధినేత విశ్వనాథరెడ్డి, తోట బాలన్న, తోట భరద్వాజ్, యాంకర్ రమేష్, డిసిఐసి ప్రెసిడెంట్ రవీంద్రనాథ్ రెడ్డి, కెవి.రమణ (మీనాక్షమ్మ ఫౌండేషన్), వీర రాఘవ రెడ్డి, చిత్ర దర్శక, నిర్మాత రషీద్ బాషాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నటీనటులు, దర్శక నిర్మాతలు వారు రూపొందించిన లఘు చిత్రాలను జనవరి 20వ తేదీలో నమోదు చేసుకోవాలన్నారు. ఎన్నికైన 18 విభాగాల పరిధిలో ఫిబ్రవరి 2వ తేదీన అనంతపురం జిల్లా వేదికగా మెమోంటోలు, సర్టిఫికెట్లు అందించి సత్కరించనున్నట్లు చెప్పారు.

తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరు పునరుద్ధరణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)

తాటిపూడి రిజర్వాయర్‌కు గొర్రిపాటి బుచ్చి అప్పారావు రిజర్వాయర్‌గా పేరును పునరుద్ధరిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రిజర్వాయర్‌కు గొర్రిపాటి పేరును పునరుద్ధరించాలని ఎస్.కోట ఎంఎల్ఎ కోళ్ల లలితకుమారి జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి కొండపల్లి ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేసిన కృషి ఫలితంగా పేరు పునరుద్ధరణ జరిగింది. తాటిపూడి రిజర్వాయర్ నిర్మాణానికి విశేష కృషి చేసిన, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరును ప్రభుత్వం పునరుద్ధరించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విశాఖ మెట్రోలో కదలిక

ప్రజాశక్తి -గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ మెట్రో రైలుపై ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఈ మేరకు గురువారం రాజధానిలో సంబంధిత అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష జరిపారు. ఇప్పటికే 76.90 కి.మీ మేర విశాఖ మెట్రో ప్రాజెక్టులు చేపట్టేందుకు డిపిఆర్‌లు ఆమోదించారు. ఈ ప్రాజెక్టులకు నిధుల అంశంపై సచివాలయంలో సమీక్షించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు ఉందని, ఆ చట్ట ప్రకారమైనా, లేకపోతే 2017 మెట్రో పాలసీ ద్వారానైనా కేంద్ర సాయం చేయాలని కేంద్రంతో సంప్రదింపులు జరపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు.

డబుల్ డెక్కర్

విశాఖలో చేపట్టే మెట్రో ప్రాజెక్టులో డబుల్ డెక్కర్ విధానం అమలు చేయబోతున్నారు. ఈ విధానంలో కింద రోడ్డు దానిపైన ఫ్లైఓవర్, ఆపైన మెట్రో వస్తుంది. విశాఖలో మొదటి స్టేజ్‌లో చేపట్టే మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 15 కిలోమీటర్లు, గాజువాక నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ వరకు 4 కిలోమీటర్లు డబుల్ డెక్కర్ మోడల్‌లో మెట్రో నిర్మించనున్నారు. 4 ఏళ్లలో మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చేలా పనిచేయాలని సిఎం అధికారులను ఆదేశించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

- ఏచూరికి సలీం, నీలోత్పల్ బసు నివాళి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

భక్నా భవన్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఏచూరికి నివాళులర్పిస్తున్న నీలోత్పల్ బసు, ఎమ్‌డి సలీం

సీతారాం ఏచూరి బహుముఖ ప్రజ్ఞాశాలి అని, ఆయన వదిలి వెళ్లిన కర్తవ్యాన్ని నెరవేర్చడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అనిసిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎమ్‌డి సలీం, నీలోత్పల్‌బసు పేర్కొన్నారు. పంజాబీ దినపత్రిక దేశ్ సేవక్ 29 వ వార్షికోత్సవాన్ని ఏచూరికి అంకితం గావిస్తూ గురువారం నాడిక్కడి భక్నా భవన్ ఆడిటోరియంలో ఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్‌డి సలీం మాట్లాడుతూ.. ఏచూరి వ్యక్తిత్వం విశిష్టమైనదని అన్నారు. ఏచూరి రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, కళ, సంస్కృతిపై అపారమైన జ్ఞానంతో సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై అద్భుతమైన రచనలు చేశారని అన్నారు. ఆయనొక ఆర్థికవేత్త అని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ మార్గనిర్దేశంలోని మతోన్మాద బిజెపికి వ్యతిరేకంగా ఐక్య ఫ్రంట్ అవసరమని, అన్ని లౌకిక, ప్రజాస్వామ్య పార్టీలను ఒప్పించి, ఇండియా బ్లాక్‌ను నిర్మించడంలో ఏచూరి కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. అసాధారణమైన లక్షణాలతో కూడిన పార్లమెంటేరియన్ అని, ఆయనకు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు కూడా వచ్చిందని గుర్తు చేశారు. ఏచూరి తన ప్రత్యర్థితో కూడా సుదీర్ఘ చర్చలు చేసే కళ, సామర్థ్యం కలిగిన నేతని, ఆయన మాట్లాడుతున్నప్పుడు ప్రతిపక్ష నేతలు కూడా శ్రద్ధగా వినేవారని తెలిపారు.

మరో పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు మాట్లాడుతూ ఏచూరి గొప్ప మార్క్సిస్ట్ సిద్ధాంతకర్త, ఆలోచనాపరుడని కొనియాడారు. సంఘ్ పరివార మూకలు బాబ్రీ మసీదుపై దాడి చేసి కూల్చివేసే ప్రమాదాన్ని ఏచూరి ముందుగానే పసిగట్టి హెచ్చరించడం జరిగిందన్నారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని కాపాడటం దేశ ప్రజల

హాజరైన ప్రజలు

ముందున్న కర్తవ్యమని అన్నారు. ఈ సందర్భంగా సీతారాం ఏచూరికి అంకితం చేస్తూ కేలండర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి సుఖ్వీందర్ సింగ్ సెఖోన్, రాష్ట్ర మంత్రి లాల్‌చంద్ కటరుచక్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బంట్ బ్రార్, ఎం.డి.దేశ్ సేవక్, శిరోమణి అకాలీదళ్ తాత్కాలిక అధ్యక్షులు సర్దార్ బల్వీందర్ సింగ్ భుందర్, మాజీ పంజాబీ ట్రిబ్యూన్ ఎడిటర్ స్వరాజ్‌బీర్ సింగ్, జెఎన్‌యుటిఎ మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ చమన్ లాల్, ఎఐపిఎస్ఒ ప్రధాన కార్యదర్శి హర్‌చంద్ సింగ్ బాత్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నేతలు మేజర్ సింగ్ బిఖివింద్, గురుదర్శన్ సింగ్ ఖాస్పూర్ అధ్యక్షత వహించారు. సిపిఎం నేత భూప్ చంద్ చన్నో ఈ కార్యక్రమాలను నిర్వహించారు.

ప్రపంచ నాయకులందరూ పుస్తక పాఠకులే : జెఎన్‌టియుకె విసి

ప్రజాశక్తి - కాకినాడ

ప్రపంచ నాయకులందరూ గొప్ప పుస్తక పాఠకులనేని జెఎన్‌టియుకె ఇన్‌ఛార్జి విసి కెవిఎస్‌డి.మురళీకృష్ణ అన్నారు. జెఎన్‌టియుకె ప్రాంగణంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసి ఫ్రీబుల్ ద బుక్ బఫే కార్యక్రమాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. యుసిఇకె ప్రిన్సిపల్ ఎన్.మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన ముక్యఅతిథిగా, గౌరవ అతిథులుగా రెక్టార్ కెవి.రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, ఒఎస్‌డి డి.కోటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఫ్రాన్స్ దేశంలోని ఓపెన్ లైబ్రరీని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఫేస్ బుక్ కు అలవాటుపడిన విద్యార్థులు పుస్తక పఠనాన్ని విస్మరిస్తున్నారన్నారు. పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించేలా ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజలు, నగర ప్రముఖులు, అధ్యాపకులు అందజేసిన సాధారణ, సాంకేతిక పుస్తకాలను సెంట్రల్ లైబ్రరీ రీడింగ్ రూమ్‌లో అందుబాటులో ఉంచుతామన్నారు. అనుబంధ కళాశాలల్లోనూ ఈ కార్యక్రమాన్ని చేపట్టేలా చర్యలు చేపడతామన్నారు. రెక్టార్ రమణ మాట్లాడుతూ ఏదైనా అంశం గురించి తెలుసుకోవాలంటే లైబ్రరీకి వెళ్లకుండా స్మార్ట్ ఫోన్లపై ఆధారపడుతున్నారన్నారు. విద్యార్థులు పుస్తక పఠనంపై దృష్టి సారిస్తే జ్ఞానాన్ని సముపార్జించడంతో పాటు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చన్నారు. పుస్తక సేకరణను ఒక అలవాటుగా మార్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.సుబ్బారావు, కె.రాము, ఎఎం.ప్రసాద్, ఎంహెచ్‌ఎం.కృష్ణప్రసాద్, మాజీ విసి జివిఆర్.ప్రసాదరాజు, అసిస్టెంట్

ఐఆర్‌సిటిసి ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలు

ప్రజాశక్తి - ఆమదాలవలస (శ్రీకాకుళం)

ఐఆర్‌సిటిసి టూరిజంలో ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీలు కల్పించనున్నట్లు ఐఆర్‌సిటిసి టూరిజం మానిటర్ కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి 30వ తేదీ వరకు ఆరు రాత్రులు, ఏడు పగలు ఎయిర్ ప్యాకేజీ కింద కేరళ నగరంతో పాటు కొచ్చి, డచ్ ప్యాలెస్, సెయింట్ ఫ్రాన్సిస్ చర్చి, సాంటర్ క్రాస్ బాసిలిక, మున్నార్, కొమరం, అలీఫ్, తెక్కడి పెరియర్ వన్యప్రాణుల అభయారణ్యం, ప్లాంటేషన్‌తో పాటు త్రివేంద్రంలోని పద్మనాభ స్వామి ఆలయం, అజీమల ఆలయం కోవలం బీచ్ తదితర సుందరమైన నగరాలు, ఆలయాలు చూపించనున్నట్లు తెలిపారు. ఈ ఏడు రోజులకు ఒకరికి రూ.64,520, ఇద్దరికి రూ.45,670, ముగ్గురికి రూ.42,890 వసూలు చేయనున్నట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలో బయలుదేరిన నుంచి తిరిగి వచ్చేంత వరకు మొత్తం ఖర్చు ఐఆర్‌సిటిసినే భరిస్తుందని తెలిపారు. మ్యాజికల్ మేఘాలయ ఆరు రాత్రులు, ఏడు పగలు ఫిబ్రవరి 12 నుంచి 18వ తేదీ వరకు పలు పుణ్యక్షేత్రాల సందర్శనకు ప్రత్యేక ఎయిర్ ప్యాకేజీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మేఘాలయలో గౌహతిలో కామాఖ్య టెంపుల్, బాలాజీ టెంపుల్, చిరపుంజి జలపాతం, గుహలో, ఎలిఫెంటా జలపాతం, లివింగ్ రూట్ బిజీ డాకి సరస్సు, నేషనల్ పార్కుతో పాటు పలు పుణ్యక్షేత్రాలు చూపించనున్నట్లు వివరించారు. ఈ ఎయిర్ ప్యాకేజ్ విశాఖపట్నం నుంచి ప్రారంభమవుతాయని వివరించారు. ఈ ఏడు రోజుల టూర్ కోసం ఒకరికి రూ.63,635, ఇద్దరికి రూ.46,085, ముగ్గురికి రూ.44,205 నిర్ణయించనున్నట్లు తెలిపారు. ఈ ఎయిర్ ప్యాకేజీలో హోటల్ వసతి, అల్పాహారం, భోజన సదుపాయం, ఎసి వాహనాల్లో సందర్శనా స్థలాలకు తీసుకువెళ్లడం ఐఆర్‌సిటిసిదే బాధ్యత అని తెలిపారు. ప్రయాణ బీమా సదుపాయం కూడా ఉందని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం చందన్ కుమార్ 928103074, వెంకటేశ్వరరావు 9550166168, సాయిప్రసాద్ 9281495847 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పేదరికంపై తప్పుడు అంచనాలు

- దేశంలో నాలుగో వంతు మంది పేదలే
- అమెరికా జనాభా కంటే మన దేశంలో పేదవారే అధికం
- నిగ్గు తేల్చిన అధ్యయనం

న్యూఢిల్లీ : దేశంలో పేదరికం దాదాపు అంతరించిపోయిందంటూ కొన్ని ప్రభుత్వ సంస్థలు ఊదరగొడుతున్నాయని, కానీ వాస్తవాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయని ఓ అధ్యయనం తేల్చింది. ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇలాంటి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని ఆ అధ్యయనం తెలిపింది. సీపే సేతు, ఎల్వీ అభినవ్ సూర్య, సీపే రుతు సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనం ఇటీవల ప్రచురితమైంది.అధికారిక గణాంకాల ప్రకారం దేశంలో నాలుగో వంతు మంది ప్రజలు...అంటే జనాభాలో 26.4 శాతం మంది దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్నారని అధ్యయనం తెలిపింది. ఇది 2022-23లో నిర్వహించిన కుటుంబ వినియోగ వ్యయ సర్వే (హెచ్‌సీఈఎస్) నుండి తీసుకున్న సమాచారమేనని చెప్పింది. దేశంలో పేదరిక నిష్పత్తి ఐదు శాతం కంటే తక్కువగానే ఉన్నదంటూ నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం మాటలకు ఇది పూర్తి భిన్నం.

'వ్యవసాయ అధ్యయనాల సమీక్ష' పేరిట వచ్చిన సంపాదకీయం ఓ పత్రికలో ప్రచురితమైంది. దేశంలో పేదరికం ఏ మేరకు ఉన్నదన్న విషయంపై గత దశాబ్ద కాలంగా ప్రభుత్వం పెదవి విప్పడం లేదని ఆ సంపాదకీయం గుర్తు చేసింది. అందుకు రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. ఒకటి...నాణ్యమైన సమాచారం అందుబాటులో లేకపోవడం. రెండోది...పేదరికాన్ని లెక్కించే విధానంలో ప్రభుత్వం మార్పులు చేయడం. జీవన ప్రమాణాలకు సంబంధించిన వివిధ కోణాల నుండి పేదరికాన్ని లెక్కించడానికి వినియోగ వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుంటున్నారు. బెంగళూరులోని వ్యవసాయ అధ్యయనాల ఫౌండేషన్ ఆన్‌లైన్‌లో నిపుణులతో చర్చా గోష్టిని నిర్వహించింది. పేదరికాన్ని ఏదో ఒక పద్ధతిలో లెక్కించాల్సిన అవసరం ఉన్నదని ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ మధురా సామినాథన్ చెప్పారు. పేదరికానికి సంబంధించిన చిట్టచివరి అధికారిక అంచనాలు 2013లో ప్రణాళికా సంఘం నుండి వెలువడ్డాయి. ప్రొఫెసర్ సురేష్ టెండుల్కర్ నేతృత్వంలోని నిపుణుల బృందం సిఫార్సు చేసిన దారిద్ర్య రేఖ ఆధారంగా ఆ అంచనాలను రూపొందించారు. కాగా దేశ జనాభాలో పేదలు గ్రామీణ ప్రాంతాలలో 25.7 శాతం, పట్టణ ప్రాంతాలలో 13.7 శాతం ఉన్నారని సంపాదకీయం తెలిపింది. యూపీఏ ప్రభుత్వం సి.రంగరాజన్ నేతృత్వంలో మరో నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేసింది. టెండూల్కర్ బృందం సూచించిన దారిద్ర్యరేఖ కంటే రంగరాజన్ బృందం సూచించింది కొంచెం ఎక్కువగా ఉంది. మనుగడ కోసం ఆహార వస్తువులపై పెట్టే ఖర్చుతో పాటు కొన్ని అత్యవసర ఆహారేతర వస్తువులపై పెట్టే వ్యయాన్ని కూడా అది పరిగణనలోకి తీసుకుంది. 2011-12లో దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాలలో 30.9 శాతం, పట్టణ ప్రాంతాలలో 26.4 శాతం ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నారని నిపుణుల బృందం అంచనా వేసింది. అయితే ఈ అంచనాలను ప్రభుత్వం ఎన్నడూ అంగీకరించలేదు. 2011-12 నుండి 2024 ప్రారంభం వరకూ వినియోగ వ్యయంపై అధికారిక గణాంకాలేవీ విడుదల కాలేదు. 2022 ఆగస్ట్ నుండి 2023 జూలై వరకూ జరిపిన వినియోగ వ్యయ సర్వే వివరాలను గత సంవత్సరం విడుదల చేశారు.ఇటీవల నిర్వహించిన కుటుంబ వినియోగ వ్యయ సర్వే సమాచారాన్ని గతంలో జరిపిన సర్వేలు అందించిన సమాచారంతో పోల్చలేము. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. నమూనాల రూపకల్పనలో, ప్రశ్నావళిలో, సమాచార సేకరణలో అనుసరించిన పద్ధతులలోనూ మార్పులు చోటుచేసుకోవడమే దీనికి కారణం. తమ అధ్యయనం కారణంగా వెలుగు చూసిన విషయాలను పరిశీలిస్తే సిగ్గుచేటుగా ఉన్నాయని 'వ్యవసాయ అధ్యయనాల సమీక్ష' వ్యాఖ్యానించింది. 'దేశ జనాభాలో గ్రామీణ ప్రాంతాలలో 27.4 శాతం, పట్టణ ప్రాంతాలలో 23.7 శాతం మంది పేదలు ఉన్నరన్న అంచనా ప్రకారం గ్రామాలలో 246.7 మిలియన్లు, పట్టణాలలో 114.4 మిలియన్ల మంది పేదలు ఉన్నారని అర్థమవుతోంది. మొత్తంగా చూస్తే 361 మిలియన్ల ప్రజలు రంగరాజన్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ నిర్ధారించిన కనీస వ్యయాన్ని సైతం భరించే స్థితిలో లేరు. అమెరికా మొత్తం జనాభా కంటే మన దేశంలోని పేదలే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. జీడీపీ లేదా జాతీయాదాయాన్ని బట్టి చూస్తే ప్రపంచంలో భారత్ ఐదో స్థానంలో ఉంది. పేదరికంతో బాధపడుతున్న వారిని సంఖ్యాపరంగా చూస్తే ప్రపంచంలో మనదే మొదటి స్థానం. ఇది సిగ్గుచేటైన రికార్డు' అని ఆ అధ్యయనం వివరించింది.

రంగరాజన్ కమిటీ ప్రతిపాదించిన పద్ధతిపై అధ్యయన రచయితలు దృష్టి సారించారు. దారిద్ర్యరేఖను లెక్కించడానికి దానినే ఉపయోగించారు. దేశంలో పేదరికంతో బాధపడుతున్న వారు జనాభాలో 26.4 శాతం ఉన్నారని తేల్చారు.

నటుడు శేఖర్‌కు జైలు శిక్ష సబబే

- మహిళా జర్నలిస్టులపై అవమానకర పోస్టుల కేసులో హైకోర్టు

చెన్నై : మహిళా జర్నలిస్టులపై అవమానకర పోస్టుల కేసులో నటులు ఎస్‌వి శేఖర్‌కు ట్రయల్ కోర్టు విధించిన ఒక నెల జైలుశిక్షను మద్రాస్ హైకోర్టు గురువారం సమర్థించింది. ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. ఎంపి, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు గత ఏడాది ఫిబ్రవరిలో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ శేఖర్ వేసిన పిటిషన్‌ను జస్టిస్ పి.వేల్మురుగన్ కొట్టివేశారు. సుప్రీంకోర్టులో అప్పీల్‌కు వెళ్లేందుకు వీలుగా శేఖర్‌కు జైలుశిక్షను 90 రోజుల పాటు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మహిళా జర్నలిస్టులకు వ్యతిరేకంగా అమానకరమైన పోస్టులు షేర్ చేసినట్లు శేఖర్ స్వయంగా అంగీకరించి, బేషరతుగా క్షమాపణలు చెప్పిన తరువాత వేరే విచారణ అవసరం లేదని జస్టిస్ వేల్మురుగన్ వ్యాఖ్యానించారు. తాను షేర్ చేసిన సందేశాన్ని వేరే ఎవరో రాశారని, సరిగ్గా చదవకుండా, అనుకోకుండా షేర్ చేశానని పిటిషనర్ చెప్పడాన్ని న్యాయమూర్తి తప్పుపట్టారు. 'ఫేస్‌బుక్‌లో మీకు వచ్చిన ప్రతీదాన్నీ షేర్ చేస్తారా..' అని ప్రశ్నించారు. షేర్ చేసిన పోస్టులో ఉన్న కంటెంట్ చాలా జుగుప్సాకరంగా ఉందని, తమిళనాడు రాష్ట్రంలో ఉన్న మొత్తం మీడియాను అవమానించేవిధంగా ఉందని న్యాయమూర్తి పేర్కొన్నారు. 2018 ఏప్రిల్ 19న శేఖర్ చేసిన పోస్టులకు వ్యతిరేకంగా ఈ కేసు నమోదైంది.

మేం చేయగలిగినదంతా చేస్తాం

- నిమిష ప్రియ కేసులో ఇరాన్ అధికారి

న్యూఢిల్లీ : భారత నర్సు నిమిష ప్రియ కేసుపై ఇరాన్ ప్రభుత్వం దృష్టిసారిస్తుందని ఆ దేశానికి చెందిన ఉన్నతాధికారి ఒకరు హామీ ఇచ్చారు. యెమెన్ రాజధాని సనాలో జరిగిన విచారణలో నిమిష ప్రియకు న్యాయస్థానం ఉరిశిక్ష విధించింది. ఈ శిక్షను గత సోమవారం యెమెన్ అధ్యక్షులు రషీద్ అల్ అలిమి ఆమోదించారు. నెల రోజుల లోపు ఈ శిక్షను అమలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం యెమెన్ హౌతీల ఆధీనంలో ఉంది. ఈ నేపథ్యంలో ఇరాన్ అధికారి నుంచి ఈ హామీ రావడం నిమిష ప్రాణాలను రక్షించడంలో భారత్‌కు సహాయపడొచ్చునని భావిస్తున్నారు. న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇరాన్ సీనియర్ అధికారి ఒకరు మాట్లాడుతూ 'భారత నర్సుకు సంబంధించిన కేసును మేం స్వీకరిస్తాం. మేం చేయగలిగినదంతా చేస్తాం' అని చెప్పారు. ఈ కేసు అత్యంత తీవ్రమైనదని వ్యాఖ్యానించారు. భారత దౌత్యవేత్తలతో చర్చల కోసం వచ్చిన ఇరాన్ బృందానికి ఈ అధికారి నేతృత్వం వహిస్తున్నారు. 2017లో తన వ్యాపార భాగస్వామి తలాల్ అబ్దో మహదీ వద్ద నున్న పాస్‌పోర్టు కోసం మత్తుమందు ఇంజక్షన్ చేయగా, మోతాదు ఎక్కువై మరణించడంతో, ఈ కేసులో నిమిష ప్రియ ఉరిశిక్ష విధించారు.

జిఓ 91పై పిటీషన్

ప్రజాశక్తి, అమరావతి

ఎస్సీల్లో ఉప కులాల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంపై అధ్యయనం కోసం గత డిసెంబర్ 20న జీవో 91 జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విజయవాడకు చెందిన పరసా సురేష్ కుమార్ వేసిన పిటిషన్‌లో ఉప కులాల వర్గీకరణ విషయంలో తగిన అధ్యయనం చేసేందుకు స్వతంత్ర కమిషన్ ను నియమించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. విచారణను ఈ నెల 8కి వాయిదా వేస్తూ జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

గ్రీవెన్స్ నిర్వహించిన కంభంపాటి, ఆరిమిల్లి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి కార్యాలయంలో రాజ్యసభ మాజీ సభ్యులు కంభంపాటి రామ్మోహన్, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ గురువారం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. గుంటూరులో తాను కొనుగోలు చేసిన స్థలాన్ని అక్రమంగా మరొకరి పేరుమీదకు మార్చారని, దీనిపై చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్‌కు చెందిన చీకటి నవీన్ కోరారు. గత ప్రభుత్వం నిర్వహించిన కానిస్టేబుల్ అభ్యర్థుల నియామక పరిక్షా ప్రశ్నాపత్రంలో తప్పులు ఉన్నాయని పలువురు అభ్యర్థులు తెలియజేశారు. ఈవెంట్స్‌కు అర్హత సాధించాల్సిన వారికి మార్కులు తగ్గించి అనర్హులను చేశారని పేర్కొన్నారు. ఈవెంట్స్‌లో పాల్గొనే అవకాశం కల్పించి తమకు న్యాయం చేయాలని కోరారు. 1992లో వికలాంగులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని గత వైసిపి ప్రభుత్వంలో కబ్జా చేశారని పల్నాడు జిల్లా గురజాలకు చెందిన ఆనందరావు తెలిపారు. భూ కబ్జాదారులపై చర్యలు తీసుకుని తమకు స్థలం ఇప్పించాలని కోరారు.

వైకుంఠ ఏకాదశికి విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమలలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే యాత్రికుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు టిటిడి అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరి చెప్పారు. తిరుమలలోని పలు ప్రాంతాలను అదనపు ఇఒ, జెఇఒ వీరబ్రహ్మం, జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీధర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం మీడియాతో అదనపు ఇఒ మాట్లాడుతూ.. వైకుంఠ ద్వార దర్శనానికి విచ్చేసే యాత్రికులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా టిటిడి అధికారులు, విజిలెన్స్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. జనవరి 10, 11, 12వ తేదీలలో అధిక సంఖ్యలో యాత్రికులు రానున్న నేపథ్యంలో అధికారులతో చర్చించి పూర్తి స్థాయిలో ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. దర్శనానికి విచ్చేసే విఐపిలకు వారికి అందించే పాసులలోనే దర్శన సమయం, పార్కింగ్ ప్రాంతం, ప్రవేశ, నిష్క్రమణ గేట్ల వివరాలు పొందిపరిచనున్నట్లు తెలిపారు. విఐపిలు, యాత్రికులు తమకు కేటాయించిన సమయం ప్రకారం మాత్రమే దర్శనానికి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యాత్రికులు తమ పాదరక్షలను గదులలో, వారి వాహనాలలో వదలి రావాలన్నారు. అధిక రద్దీ నేపథ్యంలో తోటి యాత్రికులకు ఇబ్బంది లేకుండా పారిశుద్ధ్యాని పాటించాలని, వ్యర్థాలను టిటిడి ఏర్పాటు చేసిన డస్ట్ బిన్లలోనే వేయాలని కోరారు.

పేరుకే ఒడిఒపి..!

- వేరుశనగ రైతుకు దక్కని భరోసా
- వేరుశనగ అమ్మకానికి మార్కెట్ కరువు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఒడిఒపి (వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రాడెక్టు) కింద అనంతపురం జిల్లాలో వేరుశనగ పంటను ఎంపిక చేశారు. ఎంపిక వరకు బాగానే ఉన్నా దీని వల్ల వేరుశనగ సాగు చేసే రైతుకు ఏ మేరకు ప్రయోజనం చేకూరిందన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం వలన ఇప్పటి వరకు అదనపు ప్రయోజనం పెద్దగా లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రైతుకు అందుతున్న ప్రత్యేక రాయితీలుండటం లేదు...గిట్టుబాటు ధరకు కల్పిస్తున్న అదనపు సౌకర్యాలూ లేవు. అనంతపురం జిల్లాలో అత్యధిక విస్తీర్ణంలో వేరుశనగ పంట సాగవుతుంది. జిల్లాలో ఐదు లక్షల ఎకరాలకుపైగానే వేరుశనగ పంట సాధారణంగా సాగవుతుంది. ఇందులో అత్యధికం వర్షాధారంపైనే ఉంటుంది. ఇంత పెద్దఎత్తున ఈ పంటసాగవుతున్న నేపథ్యంలో ఒడిఒపి కింద దీనిని ఎంపిక చేశారు. ఈ రకంగా ఎంపిక చేసిన జిల్లాలో ఆ పంటల సాగుతోపాటు, ఉత్పత్తులకు అదనపు విలువ కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఇది 2022కు ముందే ప్రకటించారు. కొద్ది రోజులు దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆ తరువాత దీని ఊసే కనిపించడం లేదు. రైతు పండించిన పంటకు అదనపు విలువ కల్పించడం, ఎగుమతులు జరిగే విధంగా ప్రోత్సహించి, రైతుకూ అదనపు ప్రయోజనం చేకూర్చడం ఒడిఒపి ప్రధాన లక్ష్యం. ఇప్పటి వరకు చూస్తే ఒకటి, రెండు స్వచ్ఛంద సంస్థలు మాత్రమే రైతుకు వాల్యు ఎడిషన్ చేసే కార్యక్రమాలు చేపడుతున్నాయి.

ఇప్పటికీ మార్కెట్ సౌకర్యం కరువు

పెద్దఎత్తున వేరుశనగ సాగయ్యే అనంతపురం జిల్లాలో స్థానికంగా వేరుశనగ మార్కెట్ లేదు. పంట పండితే రైతు కర్నాటకలోని బళ్లారి మార్కెట్‌కు తీసుకుపోవాలి. లేదా వ్యాపారులే వచ్చి పంటను కొనుగోలు చేయాల్సి ఉంది. ఇలా కొనుగోలు చేసే సమయంలో వ్యాపారులు చెప్పిందే ధరగా ఉంటోంది. రైతుకు మరో మార్గం లేక పంటను అమ్మేసుకోవాల్సి ఉంటోంది. వేరుశగ రైతులకు స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించడంలో మాత్రం ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది.

మద్దతు ధర కల్పిస్తేనే ప్రయోజనం
చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

పాలకుల మాటలు కోటలు దాటుతున్నాయి. ఆచరణ మత్రం గడప దాటలేదు. పేరుకే ఓడీఓపీ ప్రకటనలు చేస్తున్నారు. అందుకు అనుగుణమైన చర్యలు తీసుకోవడం లేదు. కనీసం ఇప్పటి వరకు మార్కెట్ సౌకర్యం కూడా స్థానికంగా లేదు. ఇప్పటికైనా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలి.

చంద్రన్న కానుక అందేనా.?

- 2014లో పంపిణీ చేసిన టిడిపి సర్కారు
- సంక్రాంతి సమీపిస్తున్నా కానరాని ప్రకటన
- ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

2014లో టిడిపి ప్రభుత్వం అమలు చేసిన 'చంద్రన్న సంక్రాంతి కానుక'ను గత వైసిపి ప్రభుత్వం పూర్తిగా ఎత్తివేసింది. టిడిపి పాలనలో పండుగల వేళ కొన్ని సరుకులను లబ్ధిదారులకు అందించేవారు. క్రిస్మస్, సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా అంటూ అవసరమైన సరుకులను రేషన్ షాపుల ద్వారా ఇచ్చేవారు. వైసిపి ప్రభుత్వం వాటిని పక్కన పెట్టి కేవలం బియ్యం, పంచదార, కందిపప్పు మాత్రమే పంపిణీ చేసింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఇప్పుడు కానుకల కోసం ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సంక్రాంతికి చంద్రన్న కానుకను అందజేస్తారా ? లేదా? అనే ప్రశ్నలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. క్రిస్మస్ కానుకను మరిచిపోయిన కూటమి ప్రభుత్వం సంక్రాంతి కానుకనైనా ఇవ్వాలని పలువులు లబ్ధిదారులు కోరుతున్నారు.

2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం 2019 వరకు పండుగల వేళ కానుకలు అందించింది. అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 16 లక్షల 50 వేల 558 రేషన్ కార్డులుండగా 30 శాతం మందికి క్రిస్మస్ కానుకలను అందించారు. మిగిలిన సుమారు 11 లక్షల 55 వేల మందికి సంక్రాంతి కానుకలను అందించారు. జిల్లా వ్యాప్తంగా రెండూ కలిపి 825 టన్నుల 279 కేజీల కందిపప్పు, 16 లక్షల 49 వేల 681 కేజీల పామాయిల్, 16 లక్షల 50 వేల 558 కేజీల గోధుమ పిండి, 825 టన్నుల 280 కేజీల శనగపప్పు, 824 టన్నుల 923 కేజీల బెల్లం,16 లక్షల 49 వేల 710 (100 గ్రాములు) నెయ్యి ప్యాకె ట్లను అందించారు. ఒక్కో కార్డుదారునికి రూ.207.94 పైసలు విలువ చేసే కేజి గోధుమ పిండి, అర కిలో చొప్పున బెల్లం, పామాయిల్, శనగ పప్పు, కందిపప్పు, 100 గ్రాముల నెయ్యి, ఒక సంచిలో అందజేశారు.

ఈ సంక్రాంతికి అనుమానమే.!

ఈ సంక్రాంతికి ప్రత్యేక కానుకలు లేనట్లేనని తెలుస్తోంది. ఎందుకంటే ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి ప్రకటన చేయలేదు. చంద్రబాబు సర్కారులో ఏటా ఈ పథకం కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.287 కోట్లు ఖర్చు చేసేవారు. కార్డుదారులకు ఆరు రకాల సరుకులు ఉచితంగా పంపిణీ చేసేవారు. అయితే ఈ ఏడాది సంక్రాంతి సమీపిస్తున్నా ప్రభుత్వం మాత్రం ఇప్పటివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. ఒకవేళ ఇవ్వాలని అనుకుంటే జనవరి 1వ తేదీ నుంచే పంపిణీ చేయాల్సి ఉంది. దీని గురించి కానీ జిల్లాలో అటువంటి పరిస్థితి ఏమీ కనిపించడం లేదు. ఏడు నెలల క్రితం అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం గత ఐదేళ్లకు ముందు అమలు చేసిన అనేక పథకాలను పునరుద్ధరిస్తామని చెప్పుకొచ్చింది. చివరకు క్రిస్మస్, సంక్రాంతి, రంజాన్ కానుకలను కూడా అందిస్తామని హామీ ఇచ్చింది. అయితే ఆచరణలో మాత్రం కానుకల సంగతిని కూటమి పాలకులు మర్చిపోయారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రజలు ఎంతో ఆదరించిన చంద్రన్న సంక్రాంతి కానుకలు మళ్లీ ఇస్తారని లబ్ధిదారులు ఆశిస్తున్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం దీనిపై ఎటువంటి ఆసక్తి చూపకపోతుండడంపై సంక్రాంతి కానుక పథకం అమలయ్యే అవకాశాలు దాదాపుగా కనిపించడం లేదు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిపోవడంతో నెలనెలా పింఛన్లు, జీతాలకే గగ్గోలు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో పలు సంక్షేమ పథకాలకు ప్రభుత్వం దూరంగా ఉంటుంది.

కోర్టు ఆదేశాలూ బేఖాతర్!

- కౌంటర్ అఫిడవిట్ల దాఖలులో కేంద్ర, రాష్ట్రాల అలసత్వం
- కాలపరిమితి లేకపోవడంతో జాప్యం
- న్యాయస్థానాల్లో పేరుకుపోతున్న కేసులు
- జరిమానాలు విధించినా లెక్కచేయని వైనం

న్యూఢిల్లీ : దేశంలోని న్యాయస్థానాలలో పెండింగ్ కేసుల సంఖ్య కొండలా పెరిగిపోతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులోనూ, వివిధ రాష్ట్రాల హైకోర్టులలోనూ అనేక కేసులు నమోదవుతుంటాయి. వీటిపై ఆయా న్యాయస్థానాలు ప్రభుత్వాల నుండి సమాధానాలు కోరడం పరిపాటి. వాటిని సమర్పించడంలో అటు కేంద్రం, ఇటు రాష్ట్రాలు అలసత్వం ప్రదర్శిస్తూ జాప్యం చేస్తుండడంతో న్యాయస్థానాలలో కేసులు పేరుకుపోతున్నాయి. పెండింగ్ కేసులలో సగానికి పైగా కేంద్రానికి వ్యతిరేకంగా దాఖలైనవే ఉంటున్నాయి. ప్రభుత్వానికి లేదా ప్రభుత్వ సంస్థకు వ్యతిరేకంగా ఏదైనా కేసు వస్తే న్యాయస్థానాలు ముందుగా వాటి విచారణార్హతను నిర్ణయిస్తాయి. పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తే ప్రభుత్వానికి నోటీసు జారీ చేస్తారు. ప్రతివాదిగా ఉండే ప్రభుత్వం కానీ, ప్రభుత్వ సంస్థ కానీ ఆ పిటిషన్‌పై స్పందించి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. అందులో తన వాదనలను బలంగా వినిపించి, కేసును తిప్పికొట్టేందుకు ప్రయత్నించాలి. కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయడానికి ప్రభుత్వానికి చట్టంలో ఎలాంటి కాలపరిమితిని నిర్ణయించలేదు. ఈ వెసులుబాటునే కేంద్రం, రాష్ట్రాలు తమకు అనుకూలంగా మార్చుకుంటూ అఫిడవిట్ సమర్పించకుండా జాప్యం చేస్తున్నాయి.

పరిపాటిగా మారిన ఉల్లంఘనలు

కేసును బట్టి సమాధానాన్ని దాఖలు చేసేందుకు కోర్టులు సహజంగా ప్రభుత్వానికి నాలుగు నుండి ఎనిమిది వారాల సమయం ఇస్తుంటాయి. ఆ రోజుకు కేసుపై తదుపరి విచారణ జరుగుతుంది. వివిధ న్యాయస్థానాలు, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కాలపరిమితిపై సొంతగా నిబంధనలు రూపొందించుకున్నాయి.

కౌంటర్ అఫిడవిట్ సమర్పించేందుకు అదనపు సమయం కూడా కోరే అవకాశం ఉంది. దానికీ నిర్దిష్ట గడువు అంటూ ఏదీ లేదు. విచారణ తేదీకి కనీసం మూడు రోజుల ముందు సమాధానాలు సమర్పించాలని సుప్రీంకోర్టు 2013లో రాష్ట్ర ప్రభుత్వాలను, ప్రభుత్వ సంస్థలను ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు కానీ న్యాయస్థానం విధించిన గడువును ఉల్లంఘించడం పరిపాటిగా మారింది. లోపం ఎక్కడ జరుగుతోందో, ఉల్లంఘనకు కారణమేమిటో తెలుసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు న్యాయస్థానాలు కానీ, ప్రభుత్వాలు కానీ ప్రయత్నించడం లేదు. అఫిడవిట్లు సమర్పించడంలో సంవత్సరాల తరబడి జాప్యం జరుగుతుండడంతో రాజకీయంగా సున్నితమైన, ముఖ్యమైన కేసులు సుప్రీంకోర్టులో పెద్ద సంఖ్యలో పెండింగులో ఉన్నాయి.

ప్రార్థనా స్థలాల చట్టంపై...

ఉదాహరణకు ప్రార్థనా స్థలాల చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో దాఖలైన కేసుపై రెండు వారాలలో వైఖరిని అఫిడవిట్ రూపంలో తెలియజేయాలంటూ 2022 సెప్టెంబరులో కేంద్రాన్ని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అప్పటి నుండి ఇప్పటివరకూ కేంద్రం అఫిడవిట్ సమర్పించలేదు. గత డిసెంబర్ 12న కేసు విచారణకు వచ్చినప్పుడు ప్రభుత్వానికి న్యాయస్థానం మరో నాలుగు వారాల సమయం ఇచ్చింది.

సహనం నశిస్తోందన్న సుప్రీం

సామాజిక భద్రతా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ యాప్ ఆధారిత రవాణా కార్మికుల భారతీయ సమాఖ్య దాఖలు చేసిన పిటిషన్‌పై 2022 ఫిబ్రవరిలో సమాధానాల కోసం వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలకు సుప్రీంకోర్టు నాలుగు వారాల సమయం ఇచ్చింది. వలస కార్మికుల సమస్యలకు సంబంధించిన ఈ కేసు విచారణ 2020లోనే ప్రారంభమైంది. వారికి రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ కార్డులు ఇవ్వాలంటూ 2021లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. కేంద్రం కానీ, రాష్ట్రాలు కానీ నేటి వరకూ అఫిడవిట్లు సమర్పించలేదు. దీనిపై గత అక్టోబరులో 'మాలో సహనం నశిస్తోంది' అని సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది.

సీరియల్ తరహాలో సెబీ దర్యాప్తు

అదానీ గ్రూపుపై హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలను 2023 మేలోగా విచారించాలంటూ సెబీని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీనిపై మరో ఆరు వారాల సమయం ఇవ్వాలని గత ఏప్రిల్‌లో సెబీ కోరింది. దీనిపై మేలో స్పందించిన సుప్రీంకోర్టు ఆగస్ట్ 14వ తేదీ వరకూ సమయం ఇచ్చింది. అప్పుడు కూడా సెబీ మరో పదిహేను రోజుల గడువు అడిగింది. అయినా ఎంతకీ సెబీ తన నివేదికను సమర్పించకపోవడంతో గత సంవత్సరం జనవరి 3న తుది తీర్పు ఇచ్చింది. మూడు నెలల్లో దర్యాప్తు ముగించాలని సెబీని అందులో ఆదేశించింది. ఆ నివేదిక నేటికీ బహిర్గతం కాలేదు. అసలు విచారణ ముగుస్తుందా లేదా అనేది కూడా తెలియడం లేదు.

కోర్టు ధిక్కరణ చర్యలేవి?

2021 ఐటి నిబంధనలను సవాలు చేస్తూ మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై 2021 జూలై నాటికి కౌంటర్ అఫిడవిట్ సమర్పించాలని కేంద్రాన్ని కోర్టు ఆదేశించింది. కానీ ప్రభుత్వం 2022 ఫిబ్రవరి 24న కానీ దానిని దాఖలు చేయలేదు. తన ఆదేశాలను ధిక్కరించినందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలపై చర్య తీసుకునే అధికారం న్యాయస్థానానికి ఉన్నా, ఇప్పటివరకూ అలాంటి చర్యలు తీసుకున్న సందర్భాలు దాదాపు లేవు. అదే సమయంలో సకాలంలో స్పందించని ప్రైవేటు సంస్థలు, వ్యక్తులపై న్యాయస్థానాలు చర్యలు తీసుకున్న ఉదంతాలు కోకొల్లలు. దీనిని అలుసుగా తీసుకోవడం వల్లనే ప్రభుత్వాలు సంవత్సరాల తరబడి సమాధానాలు ఇవ్వకుండా దాటవేస్తున్నాయి.

జరిమానాలతో సరి

ప్రాథమిక విధులు అమలయ్యేలా చూడాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై కౌంటర్ అఫిడవిట్లు సమర్పించడానికి 2022 నవంబరులో కేంద్ర, రాష్ట్రాలకు సుప్రీంకోర్టు తుది అవకాశం ఇచ్చింది. కానీ నేటికీ అతీగతీ లేదు. కోర్టు ధిక్కరణ చర్యలకు బదులు న్యాయస్థానాలు స్వల్ప మొత్తంలో జరిమానాలు విధించి వదిలేయడాన్ని కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అలుసుగా తీసుకుంటున్నాయి. 2022 నవంబరులో ఓ కేసులో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు రూ.25 వేల జరిమానా విధించింది. అదే ఏడాది జనవరిలో మరో కేసులో ఏడున్నర వేల రూపాయల ఫైన్ వేసింది. 2017 జనవరిలో ఓ కేసుకు సంబంధించి ప్రధాని కార్యాలయం, కేంద్ర హోం శాఖకు అలహాబాద్ హైకోర్టు ఐదు వేల రూపాయల జరిమానా విధించింది. 2016 అక్టోబరులో ఢిల్లీ ఆరోగ్య మంత్రికి సుప్రీంకోర్టు రూ.25 వేల జరిమానా వేసింది. ఇవన్నీ సకాలంలో సమాధానాలు ఇవ్వనందుకు, అఫిడవిట్లు సమర్పించనందుకు వేసిన శిక్షలే. వీటిని కేంద్రం కానీ, రాష్ట్రాలు కానీ ఏ మాత్రం ఖాతరు చేయడం లేదు. జరిమానాలు చెల్లించి చేతులు దులుపుకుంటున్నాయి. న్యాయస్థానాలు తీవ్రంగా అభిశంసించినా, చీవాట్లు పెట్టినా, ఆగ్రహం వ్యక్తం చేసినా అటు కేంద్రానికి కానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలకు కానీ కనీసం చీమ కుట్టినట్లు అయినా లేదు.

రాష్ట్ర హోదా త్వరగా పునరుద్ధరించాలి

- పోలీసు వెరిఫికేషన్‌ను సులభతరం చేయాలి
- జమ్మూకాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా

శ్రీనగర్ : జమ్మూకాశ్మీర్‌కు రాష్ట్రహోదాను త్వరగా పునరుద్ధరించాలని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా డిమాండ్ చేశారు. 2019 నుంచి అమలవుతున్న పోలీస్ వెరిఫికేషన్‌ను సులభతరం చేయాలని, 'ఉగ్రవాది కొడుకును ఉగ్రవాదిగా పరిగణించకూడదు' అని పేర్కొన్నారు. గత ఏడాది అక్టోబర్‌లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఒమర్ అబ్దుల్లా గురువారం తొలిసారి విలేకరుల సమావేశం నిర్వహించారు. 'ఒక రాష్ట్ర ప్రభుత్వంగా చాలా చేయవచ్చు. కానీ కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వంగా కాదు. మాకు మళ్లీ రాష్ట్ర హోదా కావాలి' అని ఆయన అన్నారు. భద్రతాపరమైన విషయాల్లో కేంద్ర పాలిత ప్రభుత్వం పాత్ర చాలా పరిమితంగా ఉంటుందని అన్నారు. 2019లో నుంచి ఈ ప్రాంతంలో కఠినమైన పోలీస్ వెరిఫికేషన్ ప్రక్రియ అమలవుతుందని, దీన్ని సులభతరం చేయాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే సిఐడి చీఫ్‌తో మాట్లాడినట్లు చెప్పారు. సెలవుల జాబితా నుంచి షేక్ అబ్దుల్లా జయంతిని తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నుంచి 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు.

నిపుణుల కమిటీ సిఫార్సులు అమలు చేస్తాం

- నీట్-యుజి పరీక్షపై సుప్రీంకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ : గతేడాది నీట్-యుజి నిర్వహణలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరును సమీక్షించిన తర్వాత పరీక్షల సంస్కరణలపై ఏడుగురు సభ్యుల నిపుణుల మండలి సూచించిన దిద్దుబాటు చర్యలన్నింటినీ అమలు చేస్తామని కేంద్రప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. వివాదాలతో కూడిన నీట్ - యుజి 2024 పరీక్షను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు గతేడాది ఆగస్టు 2న తిరస్కరించింది. పరీక్షల సమగ్రతపై రాజీ పడేలా అవకతవకలు జరిగాయని లేదా వ్యవస్థాగతంగా లీకేజీ జరిగిందని చెప్పేందుకు తగిన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంది. నీట్-యుజి పరీక్ష పారదర్శకంగా, ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా జరిగేలా చూసేందుకు అవసరమైన సంస్కరణలు సిఫార్సు చేయాలంటూ ఇస్రో మాజీ చీఫ్ రాధాకృష్ణన్ నేతృత్వాన ఏడుగురు సభ్యులతో కమిటీని నియమించింది. కేంద్రం నియమించిన కమిటీ తన నివేదికను ఇచ్చిందని, ఆ సిఫార్సులన్నింటినీ ప్రభుత్వం అమలు చేస్తుందని గురువారం సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీం బెంచ్‌కు తెలియజేశారు. సిఫార్సులన్నింటినీ అమలు చేయబోతున్నందున ఆరు మాసాల తర్వాత విచారణ జరపాలని కోరారు. దానిపై బెంచ్ స్పందిస్తూ మూడు మాసాల పాటు వాయిదా వేస్తున్నామని, ఏప్రిల్ మాసంలో ఈ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విచారణ జరుపుతామని బెంచ్ పేర్కొంది. ప్రశ్నల ముద్రణ వంటి అంశాలకు సంబంధించిన కొన్ని వివరాలు వున్నందున మొత్తం నివేదిక అంతా రికార్డుల్లో పెట్టలేదు.

ఇతర పిటిషన్లతోపాటు విచారణ

- ప్రార్థనా స్థలాల చట్టంపై అసదుద్దీన్ వ్యాజ్యంపై సుప్రీం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశవ్యాప్తంగా ప్రార్థనా స్థలాల చట్టం 1991ను అమలు చేయాలని ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఒవైసి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుంది. ఇదే అంశంపై గతంలో దాఖలైన ఇతర పిటిషన్లతో కలిపి విచారించేందుకు అంగీకరించింది. 1947 ఆగస్టు 15 నాటి మతపరమైన స్వభావాన్ని కొనసాగించాలని కోరే 1991 నాటి ప్రార్థనా స్థలాల చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ అసదుద్దీన్ ఒవైసి తరపున న్యాయవాది ఫుజైల్ అహ్మద్ అయ్యూబీ డిసెంబర్ 17న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చింది. ఈ వ్యవహారంలో దాఖలైన పలు పిటిషన్లతో ఈ పిటిషన్‌ను ట్యాగ్ చేస్తున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. వాటితోపాటు వచ్చే నెల ఫిబ్రవరి 17న ఈ పిటిషన్‌పై విచారణ చేపడతామని తెలిపింది.

తాజా దాడుల్లో 52మంది పాలస్తీనియన్ల మృతి

- చలి పంజాకు మరో చిన్నారి కన్నుమూత
- అల్‌జజీరా కార్యకలాపాలను నిషేధించిన పాలస్తీనా అథారిటీ

గాజా : నిర్వాసితులు తల దాచుకున్న శిబిరాలను వదిలిపెట్టకుండా విచక్షణారహితంగా ఇజ్రాయిల్ ఆర్మీ గాజావ్యాప్తంగా కొనసాగిస్తున్న బాంబు దాడుల్లో గురువారం ఉదయం నుండి 52మంది మరణించారు. సురక్షిత, మానవతా జోన్‌గా ప్రకటించిన అల్ మావసి శిబిరంపైనా ఆర్మీ బాంబు దాడులు జరిపింది. ఈ దాడిలో 12మంది పాలస్తీనియన్లు మరణించారు. పశ్చిమ గాజా నగరమైన లాబాబిడి జంక్షన్‌కు సమీపంలో జరిగిన దాడిలో ముగ్గురు మరణించారు. దక్షిణ ఖాన్ యూనిస్ నగరంలో హోం శాఖ భవనంపై జరిగిన దాడిలో ఆరుగురు చనిపోగా, పలువురు గాయపడ్డారు. తాజాగా మరో చిన్నారి చలి పులికి చిక్కి కన్నుమూసింది. దీంతో ఇప్పటివరకు ఇలా మరణించిన చిన్నారుల సంఖ్య 8కి చేరింది. దాడుల కారణంగా ఇల్లూ వాకిలి పోగొట్టుకుని వీధుల పాలై శిబిరాల్లో తల దాచుకుంటున్న వేలాది కుటుంబాలు తీవ్రంగా వున్న చలికి తట్టుకోలేక ఇబ్బందుల పాలవుతున్నాయి. భారీ వర్షాలు ముంచెత్తినపుడు కూడా ఇదే రకమైన పరిస్థితి నెలకొంది. కేవలం ప్లాస్టిక్ పరదాలతో ఉన్న శిబిరంలో తల దాచుకోవడం వల్ల చలిగాలులను పిల్లలు తట్టుకోలేకపోతున్నారని, ఇప్పటికే ప్రజలు ఈ దాడులతో బలహీనపడిన పడిన నేపథ్యంలో శీతల గాలుల వల్ల తలెత్తే ముప్పులను సమర్ధవంతంగా ఎదుర్కోలేకపోతున్నారని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 15మాసాలుగా కొనసాగుతున్న దాడుల్లో గాజాలో 45,581మంది మరణించగా, 1,08,438మంది గాయపడ్డారు.

దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్ పట్టణంలో గురువారం ఇజ్రాయిల్ జరిపిన దాడుల దృశ్యం

అల్‌జజీరాపై నిషేధం

పాలస్తీనా భూభాగాల్లో అల్‌జజీరా ప్రసారాలను పాలస్తీనా అథారిటీ నిలుపుచేసింది. రెచ్చగొట్టే, తప్పు దారి పట్టించే సమాచారాన్ని ప్రసారం చేస్తోందంటూ పాలస్తీనా అథారిటీ అధికారిక వార్తా సంస్థ వఫా పేర్కొంది. అల్ జజీరా ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించింది. ఇప్పటికే ఇజ్రాయిల్‌లో అల్‌జజీరా కార్యకలాపాలను నిషేధించారు. ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వంతో దీర్ఘకాలంగా వున్న విభేదాల నేపథ్యంలో ఈ నిషేధ ఉత్తర్వులు వెలు వడ్డాయి. తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే వార్తలు, దేశ ద్రోహం, పాలస్తీనా అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం వంటి కారణాలన్నీ ఈ చర్యలు తీసుకోవడానికి దారి తీశాయని వఫా బుధవారం పొద్దుపోయిన తర్వాత ప్రకటించింది.

దొడ్డిదారిన నల్ల చట్టాల అమలుకు యత్నం

- కేంద్రంపై కేజ్రీవాల్ ఆగ్రహం

న్యూఢిల్లీ : రద్దు చేసిన నల్ల చట్టాలు (వ్యవసాయ చట్టాలు)ను దొడ్డిదారిన అమలు చేయాలని కేంద్రం ప్రయత్నిస్తోందని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. నూతన 'విధానం' పేరుతో దాని ప్రతులను అన్ని రాష్ట్రాలకూ పంపుతోందని, అభిప్రాయాలు కోరుతోందని ఆయన తెలిపారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత సహా డిమాండ్ల సాధన కోసం పంజాబ్‌లో ఆందోళన చేస్తున్న అన్నదాతలకు ఏమైనా జరిగితే అందుకు బిజెపియే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. పంజాబ్‌లో రైతులు నిరవధిక నిరాహార దీక్ష చేస్తుంటే కేంద్రం కనీసం వారితో సంప్రదింపులు కూడా జరపడం లేదని కేజ్రీవాల్ మండిపడ్డారు. మూడు సంవత్సరాల క్రితం రైతుల డిమాండ్లను అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మాట మారుస్తోందని విమర్శించారు. నిరసన వ్యక్తం చేస్తున్న రైతులతో మాట్లాడకపోవడం బిజెపి అహంకారం కాక మరేమిటని కేజ్రీవాల్ ప్రశ్నించారు.

న్యూయార్క్ నైట్ క్లబ్ వద్ద కాల్పులు

- 10మందికి తీవ్ర గాయాలు
- 15కి చేరిన న్యూ ఆర్లీన్స్ దాడి మృతులు
- భారత్ సహా పలు దేశాల ఖండన

న్యూయార్క్ : న్యూ ఆర్లీన్స్ నరమేధం నుంచి తేరుకోక ముందే అమెరికాలో మరో దారుణం చోటు చేసుకుంది.. బుధవారం న్యూయార్క్ నైట్ క్లబ్ వెలుపల జరిగిన కాల్పుల్లో 10మంది గాయపడినట్లు న్యూయార్క్ పోలీసులు తెలిపారు. న్యూ ఆర్లీన్స్‌లో వేడుకల సందర్భంగా సైబర్ ట్రక్కును జనం మీదకు పోనిచ్చిన ఘటనలో మృతుల సంఖ్య 15కు పెరిగింది. దాడికి పాల్పడిన వ్యక్తిని 42 ఏళ్ల జబ్బార్‌గా గుర్తించారు. అతను ఓ డ్రైవర్ అని, ఐసిస్ నుంచి ప్రేరణ పొందాడని పోలీసులు తెలిపారు. ఆర్లీన్స్‌లో దాడిని ఫ్రాన్స్, బ్రిటన్, చైనా, ఉక్రెయిన్, ఇయు, జర్మనీ, ఇజ్రాయిల్, టర్కీ, భారత్‌తో సహా పలు దేశాలు ఖండించాయి. మణిపూర్‌లో ఏడాదికిపైగా సాగుతున్న మారణ హోమంపై ఎలాంటి స్పందన లేని ప్రధాని నరేంద్ర మోడీ ఆర్లీన్స్ ఘటనను వెంటనే ఖండిస్తూ ప్రధాని గురువారం ఒక ప్రకటన విడుదలజేశారు. బుధవారం రాత్రి 11.15 గంటల సమయంలో న్యూయార్క్‌లోని క్వీన్స్ ప్రాంతంలోని నైట్‌క్లబ్ వద్దకు నలుగురు దుండగులు కాలి నడకన వచ్చి బయట వేచి ఉన్న 16-20 ఏళ్ల వయసు గల 15 మందిపై 30 రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం వారు కాలినడకన కొంత దూరం వెళ్లి అక్కడి నుంచి నేమ్ ప్లేట్ లేని సెడాన్ కారెక్కి పారిపోయారని న్యూయార్క్ పోలీస్ గస్తీ బృందం చీఫ్ ఫిలిప్ రివెరా గురువారం మీడియాకు తెలిపారు. ఇటువంటి విచ్చలవిడి హింసను సహించేది లేదని రివెరా హెచ్చరించారు. అయితే, ఇది తీవ్రవాద చర్య కాదని, కానీ కాల్పులకు కారణమేమిటన్నది తెలియరాలేదని చెప్పారు. అంతకుముందు లాస్‌వేగాస్‌లోని ట్రంప్ ఇంటర్నేషనల్ హోటల్ ప్రధాన గేటు వద్ద పేలుడు సైబర్ ట్రక్కు పేలి పెద్దయెత్తున మంటలు వ్యాపించాయి. కొత్త సంవత్సరం ప్రారంభపు రోజున చోటుచేసుకున్న ఈ మూడు ఘటనలతో అమెరికన్లు బెంబేలెత్తుతున్నారు.

కక్ష కట్టిన కేంద్రం

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే ఆందోళన చెందుతుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఆయనకి అత్యవసరంగా వైద్య సహాయం అందించాలని కోరుకుంటున్నామని తెలిపింది.

కేంద్ర ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు

పంటలపై కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)కి చట్టపరమైన హామీతో సహా వాగ్దానాలను పాటించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ దల్లేవాల్ తరపున దాఖలైన తాజా పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రానికి నోటీసులు జారీ చేసింది.

కేంద్రానికి ప్రశ్నల వర్షం

"రైతుల నిజమైన మనోవేదనలను పరిగణనలోకి తీసుకుంటామని ప్రభుత్వం ఎందుకు ప్రకటన చేయలేకపోతుంది. మీ తలుపులు తెరిచి ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం ఎందుకు ప్రకటన చేయలేకపోయింది?" ఈ కేసులో హర్యానా ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను న్యాయమూర్తి జస్టిస్ భుయాన్ ప్రశ్నించారు. దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు ప్రమాదకరంగా మారుతున్నదని, ఈ సమస్య మరింత సున్నితంగా మారుతోందని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. సమయం మించిపోతోందని పేర్కొన్నారు. మెహతా సమాధానం ఇస్తూ కేంద్రానికి అనేక అంశాలు ఉన్నాయని, ప్రస్తుతం కోర్టులో ఉన్న సమస్య దల్లేవాల్ ఆరోగ్యం అని, కేంద్రం "ప్రతి రైతు పట్ల శ్రద్ధ వహిస్తుందని చెప్పుకొచ్చారు. దల్లేవాల్ "విలువైన నాయకుడని" జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ఆయన ఏ రాజకీయ భావజాలానికి పొంతన లేకుండా రైతుల ప్రయోజనాలకు అంకితమయ్యారన్నారు. పంజాబ్ అడ్వకేట్ జనరల్ గుర్మీందర్ సింగ్ వాదనలు వినిపిస్తూ రాష్ట్రప్రభుత్వం నిర్లక్ష్యంగా లేదని, వైద్య సహాయాన్ని అంగీకరించేలా దల్లేవాల్‌ను ఒప్పించేందుకు తమ వంతు కృషి చేస్తోందని చెప్పారు. దల్లేవాల్‌ను ఆసుపత్రిలో చేర్చేందుకు పంజాబ్ ప్రభుత్వానికి మరో మూడు రోజుల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ జనవరి 6కు వాయిదా వేసింది.

దల్లేవాల్‌కు ఇతర రాష్ట్రాల నుంచి మద్దతు

దల్లేవాల్‌కు మద్దతుగా ఇతర రాష్ట్రాల నుండి రైతు నాయకులు ఖనౌరీకి చేరుకున్నారు. రైతు నాయకుడు లఖ్వీందర్ సింగ్ ఔలాఖ్ మాట్లాడుతూ దల్లేవాల్‌కు మద్దతు ఇవ్వడానికి ఇతర రాష్ట్రాల నుంచి రైతు నేతలు వస్తున్నారని తెలిపారు. దల్లేవాల్ నిరాహార దీక్షకు రైతులంతా మద్దతు తెలుపుతున్నారని తమిళనాడుకు రైతు సంఘాలకు చెందిన పి.ఆర్.పాండియన్ అన్నారు. చర్చలు జరిపి రైతుల డిమాండ్లను నెరవేర్చేందుకు కేంద్రం నిరాకరించడం తమిళనాడు రైతులను వేదనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. కర్ణాటకకు చెందిన మరో నాయకుడు శాంతకుమార్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమం తరహాలో పంజాబ్ రైతులు తమ ఆందోళనలు చేపడుతున్నారని అన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.

'అన్నా యూనివర్శిటీ' కేసు రాజకీయం చేయొద్దు

- మద్రాస్ హైకోర్టు జడ్జి

చెన్నై : అన్నా యూనివర్శిటీ లైంగిక వేధింపుల కేసులో మహిళలకు జరుగుతున్న అన్యాయంపై ఆందోళన వ్యక్తం చేయడానికి బదులు రాజకీయం చేస్తున్నారని మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.వేల్మురుగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గత నెలలో యూనివర్శిటీకి చెందిన 19 ఏళ్ల ఇంజినీరింగ్ విద్యార్థినిపై కేంపస్‌లో జరిగిన దాడికి సంబంధించిన కేసులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి ఘటనలు ఎందుకు జరుగుతున్నాయో ఆత్మ పరిశీలన చేసుకుంటే మంచిదని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. పట్టాలి మక్కల్ కచ్చి (పిఎంకె) మహిళా విభాగం నిరసనకు పోలీసులు అనుమతి నిరాకరించడాన్ని ఆ పార్టీ తరపు న్యాయవాది కె బాలు ప్రస్తావించినప్పుడు న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. మీడియా దృష్టిని ఆకర్షించే లక్ష్యంతో ఆందోళన చేస్తున్నారని, సమస్యపై నిజమైన ఆందోళనతో నిరసన తెలపడం లేదని అన్నారు. మీడియా కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని, గత నెలలో ఈ సంఘటన వెలుగులోకి వచ్చినప్పటి నుంచి టివి న్యూస్ ఛానళ్లలో 'మీడియా విచారణ' జరుగుతుందని న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. మీడియా ఈ సమస్యపై రిపోర్టు చేయకూడదని తాను చెప్పడం లేదని, వారు చేస్తున్న విధంగా కాదని అన్నారు. ఒక హైకోర్టు జడ్జిగా ఈ విషయం చెప్పడం లేదని, ఒక సామాన్య మనిషిగా తన వేదనను వ్యక్తం చేస్తున్నానని జస్టిస్ వేల్మురుగన్ తెలిపారు. 'లింగం, కులం మొదలైన వాటి ఆధారంగా వివక్ష కొనసాగుతున్న ఈ యుగంలో జీవించడానికి నేను సిగ్గు పడుతున్నాను. మనమందరం సిగ్గుపడాలి. కచ్చితంగా చెప్పాలంటే మనమందరం అలాంటి నేరాలలో సహ నిందితులం' అని వ్యాఖ్యానించారు. మహిళలను రక్షించడం లక్ష్యంగా పిఎంకె నిరసన ఉందని న్యాయవాది బాలు చెప్పినప్పుడు... 'రక్షణ అనే పదాన్ని ఉపయోగించడం తప్పు. మన తల్లులు, అక్కచెల్లెళ్లు, కుమార్తెలకు సమాన హక్కులు ఇవ్వలేదని మాత్రమే ఇది సూచిస్తుంది. వారు ఇప్పటికీ మన రక్షణలో ఉంచబడ్డారు అనే ఆలోచన మారాలి' అని అన్నారు. తన వ్యాఖ్యల మధ్యలో ప్రభుత్వ న్యాయవాది జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించగా, జడ్జి మందలించారు. 'నేను మీ వైపు తిరిగితే విషయం వేరుగా ఉంటుంది. నన్ను రెచ్చగొట్టొద్దు. ప్రస్తుత కాలంలోనూ మహిళలపై లైంగిక వేధింపులు వంటి సంఘటనలు చూసి మనమంతా సమిష్టిగా సిగ్గుపడాలి' అని జడ్జి తెలిపారు. ఈ కేసును విచారణ చేయడానికి డివిజన్ బెంచ్ మహిళా ఐపిఎస్ అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. సరైన విచారణ జరగకపోతే, ఎలా వ్యవహరించాలో కోర్టుకు తెలుసునని తెలిపారు. నిరసనలు నిర్వహించడం ఈ కేసుకు ఏవిధంగానూ సహాయం చేయదని వ్యాఖ్యానించారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తును అడ్డుకోలేం

- సుప్రీంకోర్టు స్పష్టీకరణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణను అడ్డుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దర్యాప్తు సుదీర్ఘకాలం కొనసాగడం సరికాదని, దర్యాప్తు కొనసాగింపు పేరుతో పిటిషనర్‌కు ఉన్న స్వేచ్ఛను అడ్డుకోలేమని వ్యాఖ్యానించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడిగా అభియోగాలు ఉన్న మేకల తిరుపతన్న (అప్పటి అడిషనల్ ఎస్‌పి) బెయిల్ మంజూరు చేయాలని రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా తిరస్కరించింది. దీంతో గతేడాది అక్టోబర్ 20న ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘకాలంగా జైలులో ఉంటున్నానని, తనకు బెయిల్ మంజూరు చేయాలని పిటిషనర్ కోరారు. గతంలో ఈ పిటిషన్ పై విచారణ చేపట్టిన సుప్రీం ధర్మాసనం రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోపు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. మరోసారి బుధవారం ఈ పిటిషన్ జస్టిస్ బివి నాగరత్నం, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం ముందుకు వచ్చింది. 'ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తిరుపతన్న పాత్రపై దర్యాప్తు సుదీర్ఘకాలం కొనసాగడంపై సరికాదు. దర్యాప్తు పేరుతో పిటిషనర్ స్వేచ్ఛను అడ్డుకోలేరు. విచారణకు ఇంకా ఎంత సమయం పడుతుందో రాతపూర్వకంగా ఇవ్వండి' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. తిరుపతన్న పాత్రపై ఇప్పటి వరకు చేసిన దర్యాప్తు వివరాలు సమర్పించాలని స్పష్టం చేసింది. దీనిపై లూథ్రా స్పందిస్తూ... విచారణ పూర్తయ్యేందుకు మరో నాలుగు నెలలు సమయం పడుతుందని, అఫిడవిట్ దాఖలుకు సమయం కావాలని కోరారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 27 కు వాయిదా వేస్తున్నట్లు వెల్లడించింది.

ఎక్కడ కోరుకుంటే అక్కడే!

(మొదటిపేజీ తరువాయి)

కలిగించేందుకు చేసిన ప్రతిపాదనకు మంత్రి మండలి ఆమోదించింది.

- చిత్తూరు జిల్లా యాదమర్రి మండలం జంగాలపల్లెలో 40 ఎకరాల ప్రభుత్వ భూమి ఐఆర్ బెటాలియన్‌కు బదలాయింపు.
- గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం నడింపాలెం గ్రామంలో 100 పడకల ఇఎస్‌ఐ ఆసుపత్రి, స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణం కోసం 6.35 ఎకరాల భూమి కేటాయింపు.
- విశాఖలో 10వేల మందితో టిసిఎస్ ఏర్పాటుకు వీలుగా ఎపిఐఐసికి చెందిన మిలీనియం టవర్స్ ఎ, బి బ్లాకుల్లో 2.08లక్షల స్క్వేర్ ఫీట్ ఏరియా కేటాయింపు.
- అనకాపల్లి జిల్లాలో 106.27 ఎకరాల్లో రూ.1174 కోట్ల పెట్టుబడితో ఉడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి.

తెలుగు పరిరక్షణకు మీరే సైన్యం

(మొదటిపేజీ తరువాయి)

రామోజీరావు అగ్రగణ్యులన్నారు. పత్రికను, టివి మాధ్యమాలను విజయవంతంగా, ప్రభావవంతంగా నిర్వహించడం ద్వారా యావత్ భారతదేశ దృష్టినే కాక, ప్రపంచం దృష్టినీ ఆకర్షించారని వివరించారు. ప్రపంచంలోని శక్తివంతులందరిలాగే రామోజీరావు కూడా మంచి చదువరి అని తెలిపారు. పుస్తక మహోత్సవం ద్వారా తమకు దక్కిన అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకుని మంచి పుస్తకాలతో సాన్నిహిత్యం పెంచుకోవాలని సూచించారు. కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పుస్తకాలు కొనిచదివే అలవాటును అందరూ పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కె.లక్ష్మయ్య, మనోహరనాయుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పవన్ కల్యాణ్... పుస్తక మహోత్సవంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు.

కార్పొరేట్ల కోసమే 'విజన్'

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. విశాఖలో అదానీ డేటా సెంటర్ ఇప్పటి వరకూ ప్రారంభం కాలేదని వివరించారు. ఇలాంటి బూటకపు విజన్లు మాని ఐదేళ్లలో ఎంతవరకు చేయగలరో అంతే చెప్పి వాటిని కొనసాగించాలని సూచించారు. నివాస ప్రాంతంలోనే పని సౌకర్యం ఏర్పాటు ఇప్పటికే కేరళలో ప్రారంభమైందని, అక్కడ విజయవంతంగా నడుస్తోందని తెలిపారు. డ్వాక్రా సంఘాల్లో మహిళలను ఎంటర్‌ప్రెన్యూర్లను చేస్తామని చెప్పడం ద్వారా ఉపాధి కల్పించే ఆలోచన నుండి ప్రభుత్వం తప్పుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జలవనరుల ప్రాజెక్టుల పేరుతో వేలకోట్ల విలువైన ప్రణాళికలు రూపొందిస్తున్నారని, అతి తక్కువ మొత్తంలో పూర్తయ్యే ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాజెక్టులను అలాగే వదిలివేస్తున్నారని చెప్పారు.

మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ మాట్లాడుతూ 2047 నాటికి రెండు ట్రిలియన్ల ఎకానమీకి తీసుకెళతానంటున్నారని, అంటే 23 సంవత్సరాల్లో రాష్ట్ర ఎకానమీ 12 రెట్లు పెరగాల్సి ఉందని అది సాధ్యమయ్యేది కాదని ఇప్పటి వరకూ ఉన్న అనుభవాలు చెబుతున్నాయని వివరించారు. విజన్లో ఎక్కడా ప్రజాస్వామ్యం ప్రస్తావన లేదని, సహకార వ్యవస్థ మాటే లేదని తెలిపారు. వికేంద్రీకరణ చేయాలనే ఆలోచన, కనీస వేతనాల గ్యారంటీ అనే అంశాలేవీ విజన్లో కనిపించడం లేదని, ఇది పూర్తిగా ప్రజావ్యతిరేక విజనని చెప్పారు. పంటలకు కనీస మద్దతు ధర అంశమే కనిపించడం లేదని పేర్కొన్నారు. చంద్రబాబు అనుసరిస్తున్న తీరు ప్రజాచైతన్యంపై రాజకీయ సైద్ధాంతిక దాడని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ విజన్ పేరుతో రైతులను, వ్యవసాయాన్ని చంద్రబాబు దెబ్బకొడుతున్నారని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రికి ప్రైవేటు మత్తు ఎక్కిందని, రాష్ట్రాన్ని దోచిపెట్టడం తప్ప ప్రజలకు ఏదైనా చేయాలనే ఆలోచన విజన్లో కనిపించడం లేదని తెలిపారు. వక్తలను సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.హరికిషోర్ వేదిక మీదకు ఆహ్వానించారు.

విద్యుత్ ఛార్జీలపై ఆందోళన

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, సెకీతో ఒప్పందాలు రద్దు చేయాలని, ట్రూఅప్ చార్జీల విధానాన్ని రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీన విజయవాడలో 10వ తేదీన కర్నూలులో ఎపిఇఆర్‌సి వద్దకు సామూహిక రాయబారాలు నిర్వహించనున్నట్లు శ్రీనివాసరావు ప్రకటించారు. యం.బి.విజ్ఞాన కేంద్రంలో తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ బిల్లులను జనవరి 13 భోగి మంటల్లో దహనం చేయనున్నట్లుగా ప్రకటించారు. ప్రజలు ఈ నిరసనల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కాకులు కూడా మన నేస్తాలే!

అది ఒక అడవి, అందులో అన్ని రకాల జంతువులూ, పక్షులూ ఉన్నాయి. పులి రాజు, నక్క మంత్రి. ఒక రోజు పక్షులన్నీ నక్క దగ్గరకి వచ్చాయి. 'మేము చక్కగా పాడుతూ, ఆహ్లాదంగా కూస్తూ, చక్కని పలుకులు పలుకుతున్నాము. కానీ కాకులు 'కావ్..కావ్' అని అరుస్తాయి. వాటి గోలను భరించలేకుండా ఉన్నాము. నక్క బావా! పులితో చెప్పి వాటిని మన అడవిలో నుండి పంపించే ఏర్పాటు చేయవా!' అన్నాయి. ఆ మాటలు నక్కకి కూడా సబబుగా అనిపించాయి. 'అవును ఎప్పుడైనా చెట్టు కింద ఆదమరచి నిద్రపోయినప్పుడు, ఈ కాకుల అరుపుల వల్ల వెంటనే మెలకువ వస్తుంది. వీటిని అడవి నుండి పంపించేయాల్సిందే' అంది నక్క. అనుకున్నదే తడవు, పులి దగ్గరికి వెళ్లి కాకుల మీద లేని పోనివి చెప్పింది. దాంతో పులి కాకులని అడవి నుండి గెంటేసింది. అలా చేయొద్దని అంజి అనే కోతి ఎంతో చెప్పింది. అయినా వినలేదు.

ఒక రోజు పులి ఆహారం కోసం వెళ్ళి వస్తుండగా, కాళ్లల్లో తుమ్మ ముళ్లు దిగబడ్డాయి. నొప్పితో గిలగిలలాడుతూ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయింది. అడవంతా వినిపించేలా గట్టిగా గాండ్రించింది. జంతువులు, పక్షులు పులి ఉన్న చోటుకి వచ్చాయి. బాధతో ఉన్న పులిని చూసి కోయిలలూ, చిలుకలు తమ ముక్కులతో ఆ ముళ్లను తీయడానికి ప్రయత్నించాయి. కానీ లాభం లేక పోయింది. అప్పుడే అక్కడికి అంజి వచ్చింది. 'రాజా! మీకు గుచ్చుకున్న ఈ ముళ్లు చాలా ప్రమాదకరమైనవి. వాటిని కాకి మాత్రమే తీయగలదు' అని చెప్పింది. 'వెంటనే వాటిని పిలువు. ఈ బాధ నుండి నన్ను విడిపించు' అని బతిమాలింది పులి.

అంజి వెళ్లి కాకుల రాజుని పిలుచుకు వచ్చింది. అది పులి కాళ్లల్లోని ముళ్లను జాగ్రత్తగా బయటకు తీసింది. అంజితో చెప్పి కొన్ని రకాల ఆకులను తెప్పించి వైద్యం చేసింది. 'ఇక ప్రమాదం లేదు రాజా! నేను వెళ్ళి వస్తాను' అని బయల్దేరింది. అప్పుడు పులి, చుట్టూ చూసి, 'నన్ను క్షమించు. మిమ్మల్ని అడవి నుండి తరిమేసి చాలా పెద్ద తప్పు చేశాను. మీరంతా మళ్లీ ఈ అడవికి రండి' అంది. పులి మాటలకు వంత పాడుతూ 'మీరు కూడా మా నేస్తాలే.. మమ్మల్ని క్షమించండి' అన్నాయి మిగతా జంతువులు, పక్షులు.

- యు.విజయశేఖర రెడ్డి

నేను గీసిన బొమ్మ



కే. మోక్ష శ్రీ,
4వ తరగతి,
ఏ.బి.ఎస్ పబ్లిక్ స్కూల్,
అగనంపూడి,
విశాఖపట్నం.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ వరుసగా ఉన్న చుక్కలను కలిపితే అందమైన ఉడుత బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

సాంస్కృతిక వైభవం .. సమైక్యతా ప్రచారం...

సకల కళల ప్రోత్సాహానికి సమైక్య వేదిక.. కులం, మతం, భాష, ప్రాంతాలకు అతీతం... సమైక్య జీవనమే సౌరభం.. చాందస భావాలను కూకటి వేళ్లతో పెకిలించటానికి పూనుకున్న అభ్యుదయ స్వరం ఎంబివికె... పీడిత, తాడిత ప్రజలను చైతన్యం చేస్తూ వర్గదోపిడీని వ్యతిరేకిస్తూ మతం కాదు.. మారణహోమం అస్సలే వద్దు... మనిషిని మనిషిగా చూసే సమ సమాజం కావాలని కోరే అభ్యుదయ కాముకుల వేదికే ఎంబివికె. గత కొన్నేళ్లుగా ఈ విజ్ఞాన కేంద్రం ద్వారా అనేక ప్రగతిశీల కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. లక్షలాది మందిని ఐక్యపరుస్తూ అభ్యుదయ ఆలోచనల వైపు తీసుకెళ్తున్న సమర శంఖారావానికి వేదిక ఈ కేంద్రమే. ఈ దిశగా ఏడాది పొడవునా విద్య, వైద్యం, స్వయం ఉపాధి, సాంస్కృతిక వైభవం ఇలా అనేక కార్యక్రమాలకు సారధ్యం వహిస్తోంది.

విజయవాడ కేంద్రంగా మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) అనేక సాంస్కృతిక, విజ్ఞానదాయక కార్యక్రమాలను నిర్వహిస్తోంది. మతోన్మాద శక్తులు సాంస్కృతిక రంగాన్ని విద్వేష పూరితం చేస్తున్న నేటి తరుణంలో ప్రజానాయకుడు, మేధావి మాకినేని బసవ పున్నయ్య స్ఫూర్తితో లౌకికవాదం, సామాజిక న్యాయం కోసం ఉద్యమించటమే కర్తవ్యంగా ఏర్పాటైన కేంద్రమే ఇది. ప్రజలందరీ సహకారం, సమిష్టితత్వం, సంతోషంగా ఉండే భావాలతో సాంస్కృతిక రంగ వ్యాప్తిలో భాగంగా పనిచేస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సామాజిక మార్పు, సంస్కరణల కోసం కృషిచేసిన మహనీయులు 32 మంది చిత్రపటాలను బాలోత్సవ్ భవన్ గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఏర్పాటు చేయటం నిరంతర స్ఫూర్తి కల్గిస్తోంది. గత ఏడేళ్లుగా అమరావతి బాలోత్సవం పేరుతో విజయవాడలోనూ, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బాలోత్సవ సంబరాలు విస్తరిస్తున్నాయి. విజయవాడ కేంద్రంగా 10 ట్యూషన్ సెంటర్లు కొనసాగుతున్నాయి. ఏటా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వ్యాసరచన, వక్తృత్వం, దేశభక్తి గీతాలాపన పోటీలకు వేలాదిమంది హాజరవుతున్నారు. వేసవి సెలవుల్లో బాలబాలికలకు 20 రోజులపాటు చిత్రలేఖనం, నృత్య శిక్షణలు పెద్దఎత్తున ఏర్పాటు చేస్తోంది. మేడే సందర్భంగా 'శ్రమ జీవే జగతికి మూలం' పేరుతో నిపుణులైన గాయకులకు అభ్యుదయ, సినీ సంగీత విభావరిలు నిర్వహించింది.

జనహితమే లక్ష్యంగా ...

ఏటేటా దాశరధి, ఆరుద్రల శతజయంతి సందర్భంగా పాటల కచేరీలు; మేడే సందర్భంగా కథలు, కవితలు, పాటల రచనల పోటీ; ఉత్తమ సాహిత్యాన్ని ఎంపిక చేసి పుస్తకాల ముద్రణ; మహాకవి గుర్రం జాషువా జయంతిలో 'జన హితమే మా నాట్యం' పేరుతో స్వాతంత్ర్య ఉద్యమం, స్త్రీ, రైతే రాజు, అమ్మ, పంచతంత్రం, పర్యావరణంపై కొత్త తరహా 'బాలే' నృత్యరూపకాల ప్రదర్శనలు వంటివి నిర్వహించింది. ఇంకా సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజ 'శ్రమకావ్యం'పై స్వీయ కవితాగానం జరిపింది. అభ్యుదయ అంశాలపై షార్ట్ ఫిలింస్ పోటీ నిర్వహించి, విజయవాడ ఫిలిం సొసైటీ తరపున మొత్తం 7 చిత్రాల ప్రదర్శనలు జరిపింది.

ఫోరంఫర్ ఆర్టిస్ట్స్ వేదిక, జాషువా సాంస్కృతిక వేదిక, ఎంబివికె ద్వారా ఒక్క ఏడాదిలోనే 15 సార్లు చిత్రలేఖనం పోటీలు, ఎగ్జిబిషన్లు జరిగాయి. హరివిల్లు, తుపానులో రైతుల బాధలపై చిత్రలేఖనం ఎగ్జిబిషన్ నిర్వహించింది. స్వాతంత్ర్య దినోత్సవం, మాతృభాషా దినోత్సవం, పర్యావరణ దినోత్సవాలు జరిపింది.

వరద బాధితులకు ఆపన్నహస్తం

గతేడాది ఆగస్టులో విజయవాడలో వచ్చిన వరదల సమయంలో ఎంబివికె ద్వారా రూ.20 లక్షలు నిధులు, బట్టలు, బియ్యం సమీకరించి విజయవాడ, యనమలకుదురు, తాడేపల్లి వంటి 11 చోట్ల భోజన ఏర్పాట్లు చేసింది. తాడేపల్లి అమరావతి ఐకాన్ కేంద్రంగా అపార్ట్‌మెంట్లలో బాలలకు నృత్యాలు, మహిళలకు కోలాటం, లెక్కలు, ఇంగ్లీషు శిక్షణ, సమ్మర్ కోచింగ్, మిద్దె సాగు వంటి కార్యక్రమాలు జరిగాయి. ఈ కృషిలో అభ్యుదయ, ప్రజాతంత్ర వాదులు పెద్దఎత్తున పాల్గొంటున్నారు.

లైంగిక వేధింపుల నిరోధానికి...

ఆడపిల్లలపై జరిగే లైంగిక దాడుల నిరోధానికి గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై పాఠశాలల్లో 6000 మందికి, లింగ వివక్ష, చట్టపరమైన హక్కులపై కళాశాలల్లో 3000 మందికి సదస్సులు నిర్వహించారు. అభ్యుదయ భావాలన్న విద్యావంతులైన యువతులు ముందుకొచ్చి శిక్షణ ఇస్తుండటం గర్వకారణం.

పండగల సందర్భంలో ...

సంక్రాంతి, దసరా, క్రిస్మస్, రంజాన్ వంటి పండుగల సమయంలో ఎంబివికె పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. మహిళల పట్ల వివక్షత, సమానత్వం, లైంగిక హింస, సాంఘిక సమస్యలైన మాదక ద్రవ్యాలు, మద్యం, శాస్త్రీయ దక్పథం కోసం మూఢ నమ్మకాలు, మూఢాచారాలను విడిచిపెట్టాలనీ, పర్యావరణం తదితర అంశాలపై అన్ని తరగతుల ప్రజలు, మహిళలు, విద్యార్థినీ విద్యార్థులు ఇలాంటి ఉత్సవాల్లో పెద్దఎత్తున పాల్గొని చక్కటి ప్రతిభ కనబర్చుతున్నారు.

ఎలా విజయవంతం అవుతున్నాయంటే...

సమాజంలో భిన్న అభిరుచులు ఉంటాయి. ప్రజలెప్పుడూ లౌకిక వాదులుగా ఉంటారు. పురోగమనాన్ని కోరుకుంటారు. ప్రజలకు ఆసక్తి కలిగే అంశాలను ఎంచుకోవటం, అనేక సంస్థలను వేదికలను కలుపుకోవటం, వారితో ప్రజాతంత్రంగా చర్చించటం, వారికే బాధ్యతలు అప్పగించటం, సాంస్కృతిక రంగంలో వస్తువు, రూపం, ప్రజానుకూలంగా ఉండేవాటిని ఎంచుకోవటం, నిరంతరం కొత్త ప్రక్రియలు రూపొందించటం, కొనసాగింపు కార్యక్రమాలను చేపడుతున్నాం. వీటిని ఏడాది పొడవునా కొనసాగిస్తున్నాం.

- పిన్నమనేని మురళీకృష్ణ, ఎంబివికె కార్యదర్శి, విజయవాడ, సెల్ : 94900 98044

సమభావం.. సమిష్టితత్వం

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, అన్ని రంగాల ప్రముఖులను అమరావతి బాలోత్సవం, జాషువా సాంస్కృతిక వేదిక, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ వంటి ఇతర అభ్యుదయ సంస్థల భాగస్వామ్యంతో నైపుణ్యత, నటన, ప్రతిభా పాటవాలను స్వేచ్ఛగా ప్రదర్శించే అనేక వేదికలకు కేంద్ర బిందువుగా నిలుస్తోంది. షార్ట్ ఫిలిమ్స్, సినిమా రంగాల్లో అవకాశాలు తదితర అంశాలపై కూడా శిక్షణలు కొనసాగుతున్నాయి. సినీరంగ ప్రముఖులు కూడా ఈ కార్యక్రమాల్లో భాగస్వాములవు తున్నారు.

స్వయం ఉపాధి శిక్షణా కేంద్రంగా...

రోటరీ మిడ్‌టౌన్ విజయవాడ సౌజన్యంతో, మరికొన్ని సంస్థల ప్రోత్సాహంతో పలు కంప్యూటర్ బ్యాచ్‌లు, కుట్టు శిక్షణా తరగతులు కొనసాగుతున్నాయి. గత మూడేళ్లుగా మహిళలకు నిరంతరాయంగా కుట్టు శిక్షణలు బ్యాచ్‌ల వారీగా కొనసాగుతున్నాయి. గత 8 సంవత్సరాలుగా కంప్యూటర్ శిక్షణ కూడా కొనసాగు తోంది. 27 కంప్యూటర్లలో ల్యాబ్‌ను సైతం నిర్వహిస్తున్నారు.

- యడవల్లి శ్రీనివాసరావు

రంగవల్లి

13 చుక్కలు 7 వచ్చే వరకు (మధ్య చుక్క)

ఎం.శ్రీలక్ష్మీ,
భట్టిప్రోలు,
బాపట్ల జిల్లా.

మా చిరునామా
మెయిల్ ఐడి : jeevana-pageps@gmail.com
వాట్సాప్ : 83329 25496

రామ్‌చరణ్ కెరీర్‌లోనే బ్లాక్‌బస్టర్

'గేమ్‌ఛేంజర్' ట్రైలర్ విడుదలలో దర్శకుడు రాజమౌళి

'రామ్‌చరణ్-శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన పాన్ ఇండియా చిత్రం 'గేమ్‌ఛేంజర్'. సంక్రాంతి పండుగ సందర్భంగా ఈనెల 10న విడుదల కానుంది. గురువారం సాయంత్రం ఈ చిత్ర ట్రైలర్‌ను రాజమౌళి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'రామ్‌చరణ్ కెరీర్‌లోనే అతిపెద్ద హిట్ మూవీగా 'గేమ్‌ఛేంజర్' నిలుస్తుంది. ఎంతో కష్టపడి చరణ్‌తోపాటుగా నటీనటులంతా చాలా బాగా పనిచేశారు. సినిమాలోని ప్రతి పాట బ్లాక్ బస్టర్‌గా నిలుస్తాయనటంలో సందేహం లేదు. అదిరిపోయే డ్యాన్సులు ఈ సినిమాలో ఉన్నాయి. సాహిత్య విలువలకు రచయితలు ఎంతో ప్రాధాన్యత ఇచ్చారు. తెలుగు సినిమాను ఆస్కార్‌స్థాయికి తీసుకెళ్లాం. మా అందరికీ కూడా ఆదర్శమైన దర్శకుడు శంకర్. శంకర్ చేసిన సినిమాలు ఎంత పెద్ద హిట్ అయ్యాయో తెలిసిందే. ఒకే ఒక్కడు సినిమా ఎంత బాగా విజయవంతంగా ప్రదర్శితమయ్యిందో అందరికీ తెలిసిందే. గేమ్‌ఛేంజర్ కూడా హాలీవుడ్ స్థాయికి ఎదగాలని కోరుతున్నా' అని దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి వివరించారు. అనంతరం శంకర్ మాట్లాడుతూ 'తెలుగు సినిమాను ఆస్కార్‌స్థాయికి తీసుకెళ్లిన ఘనత ఎస్ఎస్ రాజమౌళికి దక్కుతుంది. క్లాస్, మాస్ ఎలిమెంట్లతో అన్ని తరగతుల ప్రేక్షకులకు ఈ సినిమా నచ్చుతుంది. ఈ సినిమా కథ కోసం చర్చల్లో రామ్‌చరణ్‌తో మూడునాలుగు సార్లు చర్చించాం. రామ్‌చరణ్‌కు ఎంతో బాగా నచ్చింది. వెంటనే అంగీకరించారు. రామ్‌చరణ్‌కు అభిమానులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారు. దానిని దృష్టిలో పెట్టుకునే ఈ సినిమాను సరికొత్తగా తెరకెక్కించాం' అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ 'గేమ్‌ఛేంజర్' సినిమా కోసం చాలా కష్టపడ్డా. అభిమానుల కోసం నా వంతు ప్రయత్నం చేశా. సమాజ పరిస్థితులకు అద్దంపట్టేలా ఈ సినిమా ఉంటుంది'. ఆదరించాలని కోరుతున్నా' అన్నారు. 'ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, నటి కియారా అద్వానీ, శ్రీకాంత్, అంజలి, నవీన్‌చంద్ర, ఎస్‌జె సూర్య పాల్గొన్నారు. గురువారం విడుదలైన ట్రైలర్ 2.43 నిముషాల నిడివితో సాగింది.

సినిమాల్లో ప్రాంతీయ విభేదాలొద్దు

ఎపి తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి

'సినిమాల్లో దక్షిణాది, ఉత్తరాది అంటూ ఇండస్ట్రీలో బేధాలు చూపటం, వివక్ష చూపటం సరికాదు. మనం ఎక్కువ బడ్జెట్‌తో పాన్ ఇండియా సినిమాలు తీస్తున్నాం. దక్షిణాది సినిమాలకు ఉత్తర భారతదేశంలోనే ఎక్కువ కలెక్షన్లు వస్తున్నాయి. ఇటీవల విడుదలైన పుష్ప 2కు దక్షిణాది కంటే ఉత్తరాదిలోనే ఎక్కువ వసూళ్లు వచ్చాయి. మనదేశంలో అత్యధిక థియేటర్లు ఉన్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. దేశంలో మొత్తం 6,877 థియేటర్లు ఉండగా ఆంధ్రాలో అత్యధికంగా 1097 ఉన్నాయి. తమిళనాడులో 943, కర్నాటకలో 719, మహారాష్ట్రలో 703, తెలంగాణాలో 485 థియేటర్లు ఉన్నాయి. టాప్ 5లో నాలుగు దక్షిణాది రాష్ట్రాలకే చోటు దక్కటం విశేషం. దక్షిణాదిలో దాదాపు 3700 థియేటర్లు ఉన్నా ఉత్తరాదిన ఎక్కువగా వసూళ్లు వచ్చాయి. ఇది మనం గమనించాలి. సినిమా పరిశ్రమ అంటేనే ప్రేక్షకులకు వినోదం పంచడం. దక్షిణాది, ఉత్తరాది అంటూ వేర్వేరుగా చూడకూడదు. సినిమాలన్నీ భారతీయచిత్ర పరిశ్రమలో భాగమని గుర్తించాలి' అని కోరారు.

మను, గుకేశ్, హర్మన్, ప్రవీణ్‌లకు ఖేల్‌రత్న

- అత్యున్నత క్రీడా పురస్కారాల జాబితా ప్రకటన
- 32మంది అర్జున అవార్డులు

న్యూఢిల్లీ: కేంద్ర క్రీడా మంత్రిత్వశాఖ ప్రకటించిన ప్రతిష్టాత్మక మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డుకు ఈసారి ఏకంగా నలుగురికి వరించింది. షూటింగ్ సంచలనం మను బకర్, చెస్ యువ గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్‌తోపాటు హర్మన్‌ప్రీత్ సింగ్(హాకీ), పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్‌లకు ఖేల్‌రత్న అవార్డులకు ఎంపికయ్యారు. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో 22ఏళ్ల మను బకర్ రెండు కాంస్య పతకాలతో సత్తా చాటగా.. 18ఏళ్ల గుకేశ్ ఇటీవల ఫిడే ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిల్ విజేతగా నిలిచాడు. ఇక హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ పారిస్ ఒలింపిక్స్‌లో భారత జట్టు కాంస్య పతకం సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో భారత హాకీజట్టు 52ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో వరుసగా రెండుసార్లు కాంస్య పతకాలు సాధించింది. ఆ ఒలింపిక్స్‌లో హర్మన్ ఏకంగా 10 గోల్స్‌తో కొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. ఇక 21ఏళ్ల పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్ 2.08మీ. హైజంప్ చేసి వరుసగా రెండోసారి పతకం సాధించాడు. 2020 టోక్యో పారా ఒలింపిక్స్‌లో 2.07మీ. రికార్డును బ్రేక్ చేశాడు.

ధ్యాన్‌చంద్ అవార్డు :
మను భాకర్(షూటింగ్), డి. గుకేశ్(చెస్), హర్మన్‌ప్రీత్ (హాకీ), ప్రవీణ్(పారా అథ్లెటిక్స్)

అర్జున అవార్డు:

1. జ్యోతి యర్రాజి	అథ్లెటిక్స్
2. అన్ను రాణి	అథ్లెటిక్స్
3. నీతు	బాక్సింగ్
4. స్వీటి	బాక్సింగ్
5. వంటిక అగర్వాల్	చెస్
6. సలీమా టేతే	హాకీ
7. అభిషేక్	హాకీ
8. సంజయ్	హాకీ
9. జమన్‌ప్రీత్ సింగ్	హాకీ
10. సుఖ్‌జీత్ సింగ్	హాకీ
11. రాకేశ్‌కుమార్	పారా ఆర్చరీ
12. ప్రీతిపాల్	పారా అథ్లెటిక్స్
13. జీవన్‌జి దీప్తి	పారా అథ్లెటిక్స్
14. అజిత్‌సింగ్	పారా అథ్లెటిక్స్
15. సచిన్ సర్జీరావ్	పారా అథ్లెటిక్స్
16. ధరమ్‌బీర్	పారా అథ్లెటిక్స్
17. ప్రణవ్ సూర్మా	పారా అథ్లెటిక్స్
18. హోకాటో సీమా	పారా అథ్లెటిక్స్
19. సిమ్రన్	పారా అథ్లెటిక్స్
20. నవ్‌దీప్	పారా అథ్లెటిక్స్
21. నితీశ్ కుమార్	పారా బ్యాడ్మింటన్
22. తులసిమతి మురుగేశన్	పారా బ్యాడ్మింటన్
23. సుమతి శివన్	పారా బ్యాడ్మింటన్
24. మనీషా రాందాస్	పారా బ్యాడ్మింటన్
25. కపిల్ పర్మార్	పారా జూడో
26. మోనా అగర్వాల్	పారా షూటింగ్
27. రూబినా ఫ్రాన్సిస్	పారా షూటింగ్
28. స్వప్నిల్ సురేశ్	షూటింగ్
29. శరభ్‌జ్యోత్ సింగ్	షూటింగ్
30. అభయ్ సింగ్	స్క్వాష్
31. సజన్ ప్రకాశ్	స్విమ్మింగ్
32. అమన్	రెజ్లింగ్

అర్జున అవార్డులు(లైఫ్‌టైమ్)

1. సుచా సింగ్	అథ్లెటిక్స్
2. మురళీకాంత్ రాజారామ్	పారా స్విమ్మింగ్

ద్రోణాచార్య(రెగ్యులర్)...

1. శుభాష్ రాణా	పారా షూటింగ్
2. దీపలి దేశ్‌పాండే	షూటింగ్
3. సందీప్ సంఘ్వాన్	హాకీ

ద్రోణాచార్య(లైఫ్‌టైమ్)...

1. మురళీధరణ్	బ్యాడ్మింటన్
2. ఆర్మెండో అంగేలో	ఫుట్‌బాల్

రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహక్ పురస్కార్..
1. ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా

మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ట్రోఫీ..
1. ఛండీగఢ్ యూనివర్శిటీ
2. లౌల్లీ ప్రొఫెషనల్ యూనివర్శిటీ(పంజాబ్) (1వ రన్నరప్ యూనివర్శిటీ)
3. గురునానక్ దేవ్ యూనివర్శిటీ, అమృత్‌సర్ (2వ రన్నరప్ యూనివర్శిటీ)

టీమిండియాకు కఠిన పరీక్ష

- రోహిత్‌కు విశ్రాంతి, కెప్టెన్‌గా బుమ్రా?
- ఆస్ట్రేలియాతో ఐదో టెస్ట్ నేటినుంచే..
- ఉ. 5.00గం॥లకు

సిడ్నీ: బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో టీమిండియా కఠిన పరీక్షను ఎదుర్కోనుంది. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో 1-2తో వెనుకబడ్డ నేపథ్యంలో సిడ్నీ టెస్ట్ గెలుపు తప్పనిసరి. ఆస్ట్రేలియాతో శుక్రవారం నుంచి జరిగే చివరి టెస్టు భారత జట్టుకు అత్యంత కీలకం. సిరీస్‌ను కోల్పోకుండా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో తప్పకుండా గెలవాల్సిందే. కీలకమైన ఈ పోరుకు ముందు భారత జట్టు కూర్పు అత్యంత క్లిష్టంగా మారింది. ఈ క్రమంలో రెగ్యులర్ కెప్టెన్ రోహిత్ శర్మకు విశ్రాంతి ఇవ్వనున్నట్లు సమాచారం. పేలవ ఫామ్‌లో ఉన్న రోహిత్‌ను చివరి టెస్ట్‌కు విశ్రాంతినిచ్చి.. వైస్ కెప్టెన్ జస్ప్రీత్ బుమ్రాకు సారథ్యం బాధ్యతలు అప్పగించనున్నట్లు తెలిసింది. బుమ్రా సారథ్యం వహించిన పెర్త్ టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అదే జరిగితే రోహిత్‌కు విశ్రాంతి ఇచ్చి గత మ్యాచ్‌లో ఆడని శుభ్‌మన్ గిల్‌కు ఛాన్స్ ఇవ్వడం ఖాయం. అదే జరిగితే యశస్వి జైస్వాల్‌తో కలిసి కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తాడు. మెల్‌బోర్న్ మ్యాచ్‌లో రోహిత్ ఓపెనర్‌గా రావడంతో కేఎల్ వన్‌డౌన్‌కు మారాడు. ఈ సిరీస్‌లో ఓపెనర్‌గా విజయవంత మైన కేఎల్.. వన్‌డౌన్‌లో మాత్రం విఫలమయ్యా డు. ఇప్పుడు మళ్లీ తనకిష్టమైన ప్లేస్‌కు రావొచ్చు. అలాగే ఈ సిరీస్‌లో తన స్థాయి ప్రదర్శన ఇవ్వడం లో విఫలమైన రిషభ్ పంత్‌నూ పక్కన పెట్టేయ నున్నట్లు తెలుస్తోంది. అతడికి బదులు ధ్రువ్ జురెల్‌ను తీసుకోనేందుకు మేనేజ్‌మెంట్ భావిస్తు న్నట్లు సమాచారం. ఆకాశ్ దీప్ గాయం కారణంగా వైదొలిగినట్లు ఇప్పటికే ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ వెల్లడించాడు.

జట్లు(అంచనా)...

ఇండియా: బుమ్రా(కెప్టెన్), జైస్వాల్, కెఎల్ రాహుల్, గిల్/రోహిత్, కోహ్లి, పంత్(వికెట్ కీపర్), జడేజా, ధృవ్ జురెల్/సుందర్, నితీశ్ రెడ్డి, ప్రసిధ్ కృష్ణ, సిరాజ్.

ఆస్ట్రేలియా: కమిన్స్(కెప్టెన్), ఖవాజా, కొన్‌స్టాస్, లబూషేన్, స్మిత్, వెబ్‌స్టర్, హెడ్, కేరీ(వికెట్ కీపర్), స్టార్క్, లైయన్, బోలాండ్.

13న ఖోఖో ప్రపంచ కప్

- పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి రామ్ ప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఖోఖో ప్రపంచ కప్ పోటీలు ఢిల్లీలో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్యే బిసిహెచ్ గరటయ్యతో కలిసి సచివాలయంలో గురువారం ఆవిష్కరించారు. దేశ రాజధానిలో ప్రపంచ్ కప్ నిర్వహించడాన్ని మంత్రి ప్రశంసించారు. వారం రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 21 పురుషుల జట్లు, 20 మహిళల జట్లు పోటీపడతాయని ఛైర్మన్ గరటయ్య తెలిపారు.

'యమజాలీ.. లవ్ మీ లైలా' సినిమా ప్రారంభం

ఎస్‌పి క్రియేషన్స్ పతాకంపై కె.మహేశ్వర నిర్మాత, డైరెక్టర్ సాయిపవన్ సుంకర తెరకెక్కించనున్న సినిమా 'యమ జాలీ.. లవ్ మీ లైలా'. రాజధాని అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో పూజలు చేసి సినిమా షూటింగ్ పనులు ప్రారంభించారు. తొలుత దర్శకుడు సాయిపవన్ సుంకరకు సినిమా స్క్రిప్టును నిర్మాత మహేశ్వర అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్వర, సాయిపవన్ సుంకర మాట్లాడుతూ అత్యాశకు పోతే ఎలాంటి అనర్థాలు చోటు చేసుకుంటాయనేది ఈ సినిమాలో చక్కగా చూపించబోతున్నామన్నారు. యమలోకం..వయా భూలోకం... యముడు (డూప్లికేట్) ప్రేమలో పడిన ఓ యువతి ఏ విధంగా మోసపోతుందనేది ఇతివృత్తంగా ఈ సినిమా ఆద్యంతం సాగుతుందన్నారు. యముడు వద్ద ఉన్న బంగారు గదను కాజేయాలనే ఆలోచనతో అతడి ప్రేమలో పడిన ఓ యువతి ఏ విధంగా మోసపోయింది, ఆ తర్వాత ఎలాంటి పరిణామాలు జరిగాయనే చాలా చక్కగా కథ సాగుతుందన్నారు. నాటి, నేటి తరాల మధ్య ఉన్న అవగాహనా లోపాలు- కొత్త ట్రెండ్‌గా జరుగుతున్న మోసాలు ఎలా జరుగుతున్నాయనేది కూడా ఈ సినిమాలో నేటి యువతకు ఒక సందేశాత్మకంగా తెలియజేయబోతున్నామన్నారు. సినీ రచయిత ఠాగూర్ బత్తిన, ధనుంజయ, బిగ్‌బ్యాంగ్

చిన్న సినిమా పెద్ద విజయం : ధర్మ

'చిన్న సినిమాగా వచ్చిన 'డ్రింకర్‌సాయి' సినిమా పెద్ద విజయాన్ని సొంతం చేసుకుంది. క్లాస్, మాస్ ప్రేక్షకులు మా సినిమాను ఆదరిస్తుండటం ఎంతో సంతోషంగా ఉంది. సినిమాలోని ఎమోషన్స్ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు రీచ్ అయ్యింది. తెలంగాణా, ఆంధ్రాలో కూడా మంచి టాక్‌తో సినిమా దూసుకుపోవటం ఎంతో సంతోషంగా ఉంది' అని నటుడు ధర్మ అన్నారు. ధర్మ, ఐశ్వర్య శర్మ నటించిన సినిమా 'డ్రింకర్‌సాయి'. ఎవరెస్ట్ సినిమాస్, స్మార్ట్ స్క్రీన్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్స్‌పై బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవరాజు లహరిధర్ నిర్మించారు. కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా దర్శకుడు కిరణ్ తిరుమలశెట్టి రూపొందించారు. డిసెంబర్ 27న విడుదలైన ఈ సినిమా విజయవంతంగా ప్రదర్శితమవుతున్న నేపథ్యంలో నటుడు ధర్మ పాత్రికేయులతో మాట్లాడారు. ఈ సినిమాలో పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్, ఎస్ఎస్ కాంచి, భద్రం, కిర్రాక్ సీత, రీతు చౌదరి, ఫన్ బకెట్ రాజేష్, రాజ ప్రజ్వల్ నటించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68